శనివారం 20-4-2024

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 28



'తెలుగువారి గుండెచప్పుడు
వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు...
నా జన్మ ధన్యమైనట్టే'



తొలిదశ ప్రశాంతం

102 ఎంపీ సీట్లకు మొదటి దశలో 62.37% పోలింగ్

బెంగాల్‌లో స్వల్ప ఘర్షణలు

ఛత్తీస్‌గఢ్‌లో గ్రెనేడ్ పేలి జవాన్ మృతి

ఓటేసిన దిగ్గజ నేతలు

- వివరాలు 6లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



రెండో రోజు 57 మంది నామినేషన్లు

రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్లకు రెండో రోజున 57 మంది అభ్యర్థులు 69 సెట్ల నామినేషన్ పత్రాలను అధికారులకు సమర్పించారు.

- వివరాలు 10లో



ఆ పార్టీలవి అవినీతి ప్రభుత్వాలు

బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అవినీతిమయంగా మారాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ విమర్శించారు.

- వివరాలు 10లో



మీ తప్పుల వల్లే కరువు తిప్పలు..

- బీఆర్ఎస్ వాళ్లున్నప్పుడే వర్షాలు పడలేదు.. వచ్చిన వర్షాన్ని ఒడిసి పట్టుకోవడంలో విఫలమయ్యారు..
- కాళేశ్వరం నీటిని కిందకు వదిలేసి ఇప్పుడు కరువొచ్చిందంటున్నారు
- రూ.43 వేల కోట్ల మిషన్ భగీరథ ఈ కరువులో ఏం చేస్తున్నట్టు?
- ఇవన్నీ ఎవరి తప్పులు?
- మీడియాతో ముఖాముఖిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

3లో

ఎమ్మెల్సీ లేదా చైర్మన్ పోస్టులిస్తాం..

- లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వండి
- సీపీఎంకు భట్టి ప్రతిపాదన - 3లో

టచ్ చేస్తే మసే!

నేను హైటెన్షన్ వైర్ లాంటోడిని.. ముట్టుకుంటే షాక్ కొడతా..

మహబూబ్‌నగర్ కార్నర్ మీటింగ్, మహబూబాబాద్ సభల్లో సీఎం రేవంత్

కేసీఆర్ గతంలోలాగా ఎమ్మెల్యేలను ఎత్తుకుపోదామని చూస్తున్నరేమో..

ఇక్కడ కాపలా ఉన్నది రేవంత్‌రెడ్డి.. దమ్ముంటే మా ఎమ్మెల్యేలను టచ్ చేయ్..

మేం ఆషామాషీగా అధికారంలోకి రాలేదు కూల్చేస్తామనడం అవివేకం..

మోదీ, కేసీఆర్ ఇద్దరూ తోడుదొంగలు

ఏ ముఖంతో బీజేపీ ఓట్లడుగుతుంది? గత పదేళ్లుగా తెలంగాణకు నిధులివ్వకుండా అన్యాయం చేశారు

లెఫ్ట్, టీజేఎస్ మద్దతు తీసుకుంటాం

14 ఎంపీ సీట్లు గెలిచి ఢిల్లీకి బహుమతి ఇస్తాం

వచ్చే పదేళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీదే అధికారమని వ్యాఖ్య



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ సాక్షి, మహబూబాబాద్: ''20 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని, చిటికేస్తే వస్తారని కేసీఆర్ చెప్తున్నారు. చిటికె కాదు.. మిద్దెక్కి డప్పు కొట్టు .. నీ దగ్గర ఉన్నోళ్లు కూడా ఎవరైనా ఉంటారేమో చూద్దాం. గతంలోలాగా తోడేళ్లలా వచ్చి కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఎత్తుకుపోదామని అనుకుంటున్నావేమో. ఇక్కడ కాపలా ఉన్నది రేవంత్ రెడ్డి. కంచె వేసి కాపాడుకునే పవర్‌ఫుల్ హైటెన్షన్ వైర్ లాంటివాడు. కరెంటు తీగ మీద కాకి వాలితే ఎట్లా అయితదో..

మిగతా 2వ పేజీలో ▶

ఆఖరి నిమిషం దాకా అలర్ట్!

- అప్రమత్తంగా ఉండాలని బీఆర్ఎస్ నిర్ణయం.. అభ్యర్థులు చేజారకుండా అన్ని రకాల జాగ్రత్తలు
- అధినేత కేసీఆర్‌తో భేటీ అయిన కేటీఆర్, హరీశ్‌రావు
- 22వ తేదీ నుంచి కేసీఆర్ బస్సు యాత్రపై కసరత్తు - 3లో

సోలార్ ప్యానెల్స్ పెట్టుకుంటేనే.. గ్రేటర్‌లో ఇళ్లకు అనుమతి!

- ఆలోచన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. లోక్‌సభ ఎన్నికల తర్వాత దీనిపై నిర్ణయం
- చిన్న, మధ్య తరహా నీటి ప్రాజెక్టుల్లో ఫ్లోటింగ్ సోలార్ ప్యానెల్స్ - 2లో

క్లుప్తంగా...

సీఎంతో శ్రీనివాస్‌గుప్తా భేటీ



సీఎం రేవంత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన తెలంగాణ రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) అంతర్జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేసిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్య వైశ్యుల అభ్యున్నతికి అన్నివిధాలుగా కృషి చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు శ్రీనివాస్ గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, సీనియర్ నేత మైనంపల్లి హనుమంతరావులను కూడా కలిశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఐవీఎఫ్ స్టేట్ జనరల్ సెక్రటరీ పబ్బా చంద్రశేఖర్, ట్రెజరర్ కొడిపాక నారాయణ తదితరులున్నారు.

ఎంపీ పాటిల్‌కు హైకోర్టులో ఊరట



నిజాంసాగర్(జుక్కల్): జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు బీబీ పాటిల్‌కు శుక్రవారం హైకోర్టులో ఊరట లభించింది. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీబీ పాటిల్ ఎంపీగా గెలుపొందారు. ఆయన ఎన్నిక చెల్లదంటూ అప్పట్లో ప్రస్తుత ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు హైకోర్టులో పిటిషన్ వేశారు. పాటిల్ దాఖలు చేసిన ఎన్నికల అఫిడవిట్‌లో సరైన సమాచారం ఇవ్వలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఈ పిటిషన్ చెల్లదంటూ.. శుక్రవారం హైకోర్టు కొట్టి వేస్తూ తీర్పునిచ్చింది.

బీసీలను నిర్లక్ష్యం చేస్తే గుణపాఠం తప్పదు

ఎంపీ ఆర్.కృష్ణయ్య



సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): బీజేపీ, కాంగ్రెస్ ఇతర రాజకీయ పార్టీలు బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు కల్పించాలని, బీసీ బిల్లు, చట్టసభల్లో బీసీలకు 50% రిజర్వేషన్‌పై తమ స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 86 బీసీ కుల సంఘాలు, 22 బీసీ సంఘాలు, 18 బీసీ ఉద్యోగ సంఘాలతో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ప్రధాని ఒక బీసీ కులానికి చెందిన వారు అయి ఉండి కూడా బీసీల అభివృద్ధికి సంబంధించి ఒక చిన్న డిమాండ్ కూడా ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొనకపోవడం దేశంలోని 70 కోట్ల మంది బీసీలు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. బీసీలు బిచ్చగాళ్లు కాదని, తమ వాటా ను సక్రమంగా ఇవ్వకపోతే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఎన్ని రోజులు రాముడి బొమ్మ చూపించి బీసీలను మోసం చేస్తారని మండిపడ్డారు.

వడదెబ్బతో ఇద్దరు మృతి

హుజూర్‌నగర్/ములుగు రూరల్: వేర్వేరుచోట్ల వడదెబ్బతో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. లారీ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో పనిచేసే సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన కస్తాల మహేష్ (45) వడదెబ్బతో అలసటకు గురయ్యాడు. కుటుంబసభ్యులు స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుడి సూచన మేరకు ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందాడు. ములుగు జిల్లా మదనపల్లిలో చిలపాక సాల్‌మోహన్ (50) ఎండన తాపీ పనిచేస్తూ సాయంత్రానికి అలసిపోయి నిద్రపోయాడు. రాత్రి 8 గంటల సమయంలో అన్నం తినేందుకు భార్య నిద్రలేపే ప్రయత్నం చేయగా మృతిచెంది ఉన్నాడు.

ఇదండీ జగత్



ప్రచారం ఆపండి! పొత్తు సర్దుబాటులో మీ సీటు వేరేవారికి కేటాయించార్సార్!



చిలుకూరులో ట్రాఫిక్ జామ్.. నడిచి వెళ్తున్న భక్తులు



ఆలయం వెలుపల పెద్ద సంఖ్యలో గుమిగూడిన మహిళలు



మహిళలకు గరుడ ప్రసాదం పంపిణీ చేస్తున్న అర్చకులు

గరుడ ప్రసాదం.. పోటెత్తిన జనం.. ట్రాఫిక్ నరకం

- సోషల్ మీడియా ప్రచారంతో భారీగా తరలివచ్చిన మహిళలు
- వేలాది వాహనాలతో కిలోమీటర్ల మేర స్తంభించిన ట్రాఫిక్

మొయినాబాద్, బండ్లగూడ: చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుత్మంతుడికి నైవేద్యంగా పెట్టే ప్రసాదాన్ని స్వీకరిస్తే సంతానం లేని మహిళలకు పిల్లలు కలుగుతారని సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం చేయడంతో శుక్రవారం అనూహ్యంగా భక్తులు పోటెత్తారు. ప్రసాదం కోసం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఢిల్లీ, కర్ణాటక, ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాదిగా తరలివచ్చారు. ఇందుకు తగిన ఏర్పాట్లు చేయకపోవడంతో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. వేకువ జామున 4 గంటల నుంచే వాహనాలు భారీ సంఖ్యలో రావడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. మూడు నాలుగు గంటల పాటు ట్రాఫిక్‌లో ఇరుక్కుని, ఎండలో కాలినడకన ఆలయానికి చేరుకున్న భక్తులకు క్యూలైన్లు ఎక్కడ ఉన్నాయో..? ప్రసాదం ఎక్కడ పంపిణీ చేస్తున్నారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఆలయ ప్రాంగణంలోనికి మహిళలను మాత్రమే అనుమతించడంతో పురుషులు బయటే ఉండిపోయారు.

చేతులెత్తేసిన పోలీసులు

ప్రసాదం కోసం పోటెత్తిన మహిళలను నియంత్రించడంలో ఆలయ సిబ్బంది, పోలీసులు చేతులెత్తేశారు. క్యూలైన్లలో తోపులాటలు జరగడంతో పలువురు సొమ్మసిల్లి పడిపోయారు. వీరిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గరుడ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కానీ వచ్చిన వారిలో సగం మందికి కూడా అందలేదు. దీంతో కొంత మంది మహిళలు నిరసన చేపట్టారు. గరుడ ప్రసాదం కొరతపై భక్తుల నుంచి తీవ్ర ఆందోళన వ్యక్తమైన నేపథ్యంలో బ్రహ్మోత్సవాలు జరిగే వారం రోజుల పాటు ప్రసాదం ఇస్తామని, వారం రోజుల్లో ఎప్పుడైనా వచ్చి తీసుకోవచ్చని ఆలయ అర్చకులు తెలిపారు. గరుడ ప్రసాదం కోసం ఏటా సుమారు నాలుగు నుంచి ఐదు వేల మంది వచ్చేవారు. ఈసారి రెండింతలు వస్తారని భావించాం.. కానీ ఇంతమంది వస్తారని ఊహించలేదని ఆలయ అర్చకులు రంగరాజన్ తెలిపారు.

కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్..

వేలాది వాహనాలు ఒక్కసారిగా రావడంతో సుమారు 25 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ సమస్య నెలకొంది. మెహిదీపట్నం నుంచి నానల్ నగర్, లంగర్‌హౌస్, టిప్‌ఖాన్‌పూల్ బ్రిడ్జ్, సన్‌సిటీ, కాళీమందిర్, టీఎస్‌పీఏ చౌరస్తా మీదుగా చిలుకూరు ఆలయం వరకు పూర్తిగా ట్రాఫిక్‌తో రోడ్డంతా స్తంభించిపోయింది.

నిప్పుల కొలిమి!

రాష్ట్రవ్యాప్తంగా భగ్గుమంటున్న ఎండలు

- సాధారణం కంటే 5 డిగ్రీలు అధికంగా గరిష్ట ఉష్ణోగ్రతలు
- తీవ్ర ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి
- మరో మూడు రోజులపాటు ఇలాగే ఉంటుందన్న వాతావరణ శాఖ
- ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వడగాడ్పులు వీచే అవకాశం
- అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం బయటికి రావద్దని హెచ్చరికలు

ప్రధాన కేంద్రాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలివీ (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం
ఆదిలాబాద్	42.8
ఖమ్మం	42.6
భద్రాచలం	42.5
నల్లగొండ	42.5
నిజామాబాద్	42.4
రామగుండం	41.1
మహబూబ్‌నగర్	41.0
మెదక్	40.6
హైదరాబాద్	40.2
హనుమకొండ	40.0



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అనేక ప్రాంతాలు నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. ఎండలు భగ్గుమంటున్నాయి. సాధారణం కంటే 5 డిగ్రీల మేర అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీనికితోడు తీవ్ర ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కూలర్లు, ఫ్యాన్లు ఏమాత్రం ఉపశమనం ఇవ్వక తిప్పలు పడుతున్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా బుగ్గబావిగూడలో 45 డిగ్రీలు, మాడుగులపల్లిలో 44.8 డిగ్రీల సెల్సియస్ చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాతావరణంలో నెలకొంటున్న మార్పులతో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెప్తున్నారు. శుక్రవారం ఖమ్మంలో సాధారణం కంటే 5.2 డిగ్రీలు అధికంగా గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. భద్రాచలం, నల్లగొండలలో 4 డిగ్రీలు, ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్‌లలో 3 డిగ్రీల మేర అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగతా ప్రాంతాల్లో 2 డిగ్రీల మేర అధికంగా ఉన్నాయి.

మరో మూడు రోజులు ఇలానే..

రాష్ట్రంలో మరో మూడు రోజులు సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని.. ఇదే తరహా పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించింది. అత్యవసర పనులుంటే తప్ప మధ్యాహ్నం పూట బయటికి రావొద్దని అధికారులు హెచ్చరించారు. ఇక ప్రస్తుతం మరాఠ్వాడ పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని.. దాని ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన మోస్తరు వానలు పడవచ్చని తెలిపారు. శనివారం ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు.

తీవ్ర ఎండలతో జాగ్రత్త

అధిక ఉష్ణోగ్రతలు,వడగాడ్పుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రజారోగ్య విభాగం సూచించింది. ఈ మేరకు శుక్రవారం ప్రకటన జారీ చేసింది. వాతావరణ శాఖ కూడా హీట్ వేవ్ అలర్ట్ జారీ చేసింది. అవేమంటే..

- దాహం వేయకపోయినా కూడా అవసరమైన మేర నీళ్లు తాగుతూ ఉండాలి. ఓఆర్ఎస్, నిమ్మరసం, లస్సీ, మజ్జిగ, పండ్ల రసాలు వంటివి తాగాలి.
- వీలైనంత వరకు ఇంట్లోనే ఉండాలి. మధ్యాహ్న సమయంలో బయటికి వెళ్లకపోవడం మంచిది. బాగా గాలి వచ్చే, చల్లని ప్రదేశాలలో ఉండాలి.
- ఎండకు వెళ్లాల్సి వస్తే.. సన్నని వదులుగా ఉండే కాటన్ వస్త్రాలను ధరించాలి. తలపై టోపీ, గొడుగు వంటివి కప్పుకోవాలి.
- మధ్యాహ్న సమయంలో ఆరు బయట తీవ్ర శారీరక శ్రమ చేయవద్దు.
- ఎవరైనా వడదెబ్బకు లోనైట్టు గుర్తిస్తే.. వెంటనే వైద్య సహాయం అందించాలి.

సోలార్‌ప్యానెల్స్ పెట్టుకుంటేనే... గ్రేటర్‌లో ఇళ్లకు అనుమతి!

ఆలోచన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం..
లోక్‌సభ ఎన్నికల తర్వాత దీనిపై నిర్ణయం

- చిన్న, మధ్య తరహా నీటి ప్రాజెక్టుల్లో ఫ్లోటింగ్ సోలార్ ప్యానెల్స్
- సోలార్ విలేజ్‌లతో గ్రామాల్లోనూ విస్తృతంగా విద్యుత్ ఉత్పాదన
- ఓపెన్ కాస్ట్ మైన్స్‌లోనూ సోలార్ ప్యానెల్స్...



సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇళ్లపై సోలార్‌ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటేనే ఇంటి అనుమతులు మంజూరు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత దీనికి సంబంధించి విధానపరమైన నిర్ణయం తీసుకోనుంది. సౌర విద్యుత్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ప్రతీ ఇంటిపై సోలార్‌ప్యానెల్స్ ఏర్పాటు చేసుకోవాలనే కచ్చితమైన నిబంధన తీసుకురావాలనుకుంటోంది. తద్వారా నగరాల్లో విపరీతంగా పెరిగిపోతున్న విద్యుత్ అవసరాలను స్థానికంగానే ఉత్పత్తి చేసుకొని వినియోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. కాలుష్యరహిత విద్యుత్ ఉత్పాదన లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకోవాలనుకుంటోంది. గ్రామాలను కూడా సోలార్ ఎనర్జీ హబ్‌లుగా మార్చాలని భావిస్తోంది. ప్రతీ గ్రామంలోనూ నాలుగైదు ఎకరాల విస్తీర్ణంలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి స్థానికంగా ఉండే సబ్‌స్టేషన్లకు వీటిని అనుసంధానిస్తారు. తద్వారా ఆ గ్రామాలకు విద్యుత్ సమస్య ఎదురుకాకుండా చూడాలన్న అభిప్రాయానికి వచ్చారు. దీనిపై విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆ శాఖ ఉన్నతాధికారులతో చర్చించి రోడ్ మ్యాప్ రూపొందించారు. ఎన్నికల తర్వాత ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోనూ పూర్తిస్థాయిలో చర్చించిన అనంతరం మంత్రివర్గంలో ఈ కీలక నిర్ణయం తీసుకొని అమలు చేయాలని భావిస్తున్నారు. విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలంటే.. సోలార్ ఎనర్జీనే ప్రధానం అన్న అభిప్రాయానికి వచ్చారు. ప్రస్తుతం థర్మల్, హైడల్ జనరేషన్‌తోపాటు సౌర, పవనవిద్యుత్ రాష్ట్రంలో ఉత్పత్తి అవుతోంది. హైడల్ పవర్ అందుబాటులో లేని సమయంలో రాష్ట్రంలో విద్యుత్ అవసరాలకు బయట నుంచి ఎక్కువ మొత్తానికి విద్యుత్ కొనాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్న నేపథ్యంలో సౌర విద్యుత్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

రిజర్వాయర్లలోనూ..: నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లోనూ ఫ్లోటింగ్ సోలార్‌ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనితోపాటు చిన్న, మధ్య తరహా నీటిపారుదల ప్రాజెక్టుల్లో ఫ్లోటింగ్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ ఉత్పాదనతోపాటు, నీరు ఆవిరవడాన్ని తగ్గించడానికి అవకాశం ఉంటుందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. అవసరమైతే రిజర్వాయర్ల నుంచి నీరు వెళ్లే కాలువ గట్లపై కూడా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడం వల్ల వేలాది మెగావాట్ల విద్యుత్ ఉత్పాదనకు అవకాశం ఏర్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఎల్లంపల్లి రిజర్వాయర్‌లో ఇప్పటికే సింగరేణి సంస్థ ఫ్లోటింగ్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసిన సంగతి విదితమే. సింగరేణి ఓపెన్ కాస్ట్ మైన్స్‌లో బొగ్గు తవ్విన తర్వాత ఆ ప్రాంతాలనూ ఈ సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగించుకోవాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గ్రీనర్ ఎనర్జీకి స్కాండినేవియన్ దేశాలు అధిక ప్రాధాన్యం ఇస్తున్న మాదిరిగానే తెలంగాణలోనూ ఆ మోడల్‌ను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. ప్రస్తుతం థర్మల్ విద్యుత్ ప్లాంట్‌ల నిర్మాణంతోపాటు వాటి నిర్వహణ, బొగ్గు ధరలు ఏటేటా పెరుగుతున్న తరుణంలో విద్యుత్ ధర పెరుగుతూ వస్తోంది. ఇది ప్రభుత్వంపైనే కాకుండా వినియోగదారులకు మోయలేని భారంగా మారుతున్న తరుణంలో సోలార్ పవర్‌ను ప్రోత్సహించాలని నిర్ణయానికి వచ్చింది. థర్మల్ కేంద్రాలతో భారీగా వెలువడే కాలుష్యాన్ని కూడా అరికట్టడానికి వీలవుతుందని అధికారులు చెబుతున్నారు.

ఎకరాకు రూ.14 వేల బోనస్ ఎందుకివ్వడం లేదు?

ఎంపీ బండి సంజయ్

కరీంనగర్ టౌన్: అసెంబ్లీ ఎన్నికలకు ముందు క్వింటాల్ వడ్లకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఈ లెక్కన ఎకరానికి సగటున 28 క్వింటాళ్ల వడ్లకు రూ.14 వేల చొప్పున బోనస్ ఎందుకివ్వడం లేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ప్రశ్నించారు. ఇచ్చిన హామీల మేరకు తాలు, తరుగు, తేమతో పనిలేకుండా వడ్లు కొనాలని డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో హుస్నాబాద్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్‌కు చెందిన తాజా, మాజీ సర్పంచులు పలువురు బీజేపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సంజయ్ మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో సర్పంచుల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. మోదీ ప్రభుత్వం పంచాయతీలకు నిధులివ్వడంతోనే సిబ్బందికి జీతాలిస్తున్నారని తెలిపారు. దేశమంతా మోదీ గాలి వీస్తుందని, తొలివిడతలోనే 102 ఎంపీ స్థానాల్లో గెలవబోతున్నట్లు జోస్యం చెప్పారు.



మాజీ సర్పంచ్‌లకు కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బండి సంజయ్

సీబీఐకి వాంగ్మూలం ఇవ్వడానికి శరత్‌చంద్రారెడ్డి అంగీకారం

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించి ఈడీ కేసులో అప్రూవర్‌గా ఉన్న శరత్‌చంద్రారెడ్డి.. సీబీఐకి వాంగ్మూలం ఇవ్వడానికి అంగీకరించారు. సీఆర్‌పీసీ సెక్షన్ 164 కింద శరత్‌చంద్రారెడ్డి వాంగ్మూలం నమోదు చేస్తామని రౌజ్ అవెన్యూ కోర్టులో సీబీఐ అప్లికేషన్ దాఖలు చేసింది. దీనిని న్యాయమూర్తి కావేరి బవేజా విచారించారు. స్టేట్‌మెంట్ రికార్డు చేయడానికి సమ్మతమేనా అని శరత్ చంద్రారెడ్డిని న్యాయమూర్తి బవేజా ప్రశ్నించగా, దానికి శరత్‌రెడ్డి అంగీకరించారు. అనంతరం ఆయన వాంగ్మూలాన్ని సీబీఐ నమోదు చేయడానికి న్యాయమూర్తి అనుమతించారు. సీబీఐ నమోదు చేసిన కేసులో శరత్‌చంద్రారెడ్డి అరెస్టు కాలేదు. అయితే, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను రిమాండు కోరే సమయంలో శరత్‌రెడ్డిని కవిత బెదిరించినట్లు సీబీఐ ఆరోపించిన విషయం విదితమే. ఈ మేరకు శరత్‌రెడ్డి నుంచి వివరాలు రికార్డు చేయడానికి సీబీఐ, ప్రత్యేక కోర్టు అనుమతి కోరినట్లు సమాచారం.

టచ్ చేస్తే మసే!

▶ మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ వైపు చూస్తే అట్లానే షాక్ కొట్టి మాడిమసైపోతారు. ప్రయత్నం చేసి చూడు'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. ఆయన శుక్రవారం మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా చల్లా వంశీచంద్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో, పట్టణంలో నిర్వహించిన భారీ ర్యాలీ, కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. సాయంత్రం మహబూబాబాద్‌లో కాంగ్రెస్ తెలంగాణ జన జాతర బహిరంగ సభలో పాల్గొన్నారు. ఆయా చోట్ల సీఎం రేవంత్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

''మా కారు కొంచెం పాడైంది. గ్యారేజీకి పోయిందని నిన్న, మొన్న కేటీఆర్ అంటున్నారు. కారు రిపేర్ వడం కాదు.. ఇంజిన్ సహా మొత్తం పాడైపోయింది. ఇనుప సమాన్ల కింద తూకానికి అమ్ముడే. నీ కారే కాదు.. తండ్రి కేసీఆర్ ఆరోగ్యం కూడా దెబ్బతిన్నది.. ఇంకా నడవలేకపోతున్నరు. మొన్నటి ఎన్నికల్లో ఓటర్లు బీఆర్ఎస్‌ను పాతేసినా.. ఇంకా పొంకనాలు కొడుతున్నరు. మీ ఎమ్మెల్యేలే నీవెంబడి ఉంటలేరు. అలాంటిది ఎదుటి పార్టీల 20 మంది ఎమ్మెల్యేలున్నారని చెబుతావా? ఇంకెన్ని రోజులు ఇలా కథలు చెప్పి బతుకుతరు?

మోదీ, కేసీఆర్ ఒక్కటే..

కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ ఇద్దరూ తోడు దొంగలు. వారిలో ఎవరికి ఓటేసినా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్లే. తెలంగాణకు ద్రోహం చేసినట్లే.. పదేళ్లు పాలించిన ఇద్దరు రాష్ట్రానికి చేసింది శూన్యం. కాళేశ్వరం అవినీతిని బయట పెట్టకుండా కేసీఆర్ ఇచ్చే కమీషన్లకు కక్కుర్తి పడింది ప్రధాని కాదా? పార్లమెంట్‌లో బీజేపీ ప్రవేశపెట్టి న ప్రతి బిల్లును సమర్థించింది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా?

ఏ ముఖంతో బీజేపీ ఓట్లు అడుగుతుంది?

పదేళ్లు తెలంగాణకు నిధులు ఇవ్వకుండా అన్యాయం చేసిన బీజేపీ ఇప్పుడు ఓట్లు వేయాలంటూ ప్రజల ముందుకు రావడం సిగ్గుచేటు. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయకుండా పక్కన పెట్టింది బీజేపీ కాదా? వరంగల్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఎటు పోయింది? తల్లిని చంపి బిడ్డను బతికించారంటూ తెలంగాణ ఏర్పాటుపై వ్యాఖ్యలు చేసిన ప్రధాని మోదీ తెలంగాణ ప్రజల ఓట్లు ఎలా అడుగుతారు? ఉత్తర భారత దేశంలో కుంభమేళా, గంగానది పరిరక్షణ కోసం వేల కోట్లు కేటాయించిన బీజేపీ ప్రభుత్వం.. మన మేడారం జాతరకు ముష్టి రూ.3 కోట్లు కేటాయించి అవమానించింది. 42 మంది తెలుగు మాట్లాడే ఎంపీలుంటే ఒక్క మంత్రి పదవి ఇచ్చారు. అదే యూపీలోని 60 మంది ఎంపీలకు 12 మంత్రి పదవులు, 26 మంది ఎంపీలు ఉన్న గుజరాత్‌కు ఏడు మంత్రి పదవులు ఇచ్చి వివక్ష చూపారు.

బీఆర్ఎస్, బీజేపీ చీకటి ఒప్పందం

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సొంతంగా ఒక్క సీటు కూడా గెలవదని గ్రహించే బీజేపీతో చీకటి ఒప్పందం కుదుర్చుకుంది. కేసీఆర్ తన బిడ్డ కవితకు బెయిల్ మంజూరు చేయించుకునేందుకు.. రాష్ట్రంలోని మహబూబ్‌నగర్, చేవెళ్ల, మల్కాజిగిరి, భువనగిరి, జహీరాబాద్ సీట్లను వదిలేశారు. ఎవరెన్ని ఒప్పందాలు చేసుకున్నా.. అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌ను ఓడించిన తెలంగాణ ప్రజలు.. ఈ ఎన్నికల్లో మోదీకి కూడా బుద్ధి చెప్పడం ఖాయం.

కమ్యూనిస్టులు, టీజేఎస్ మద్దతు తీసుకుంటాం

పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో సీపీఐ, సీపీఎం, టీజేఎస్ పార్టీల మద్దతు తీసుకుంటాం. వారితో చర్చించే బాధ్యతను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చూసుకుంటారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కలిసొచ్చే ఇతర పార్టీల మద్దతును కూడగడతాం. మరో పదేళ్లు తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంటుంది. ప్రజలకిచ్చిన ప్రతీ హామీని నెరవేస్తుంది. తెలంగాణ బిడ్డల చావులను చూసిన సోనియా గాంధీ మనసు తల్లడిల్లి తెలంగాణ ఇచ్చారు. ఇప్పుడు ఆమె కుటుంబానికి అండగా ఉండేందుకు తెలంగాణ సమాజం సిద్ధంగా ఉంది. ఢిల్లీ లో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే. 14 మంది ఎంపీలతో ఢిల్లీ వెళ్తాం..'' అని రేవంత్ పేర్కొన్నారు.

కేసీఆర్‌ది అసత్య ప్రచారం: మంత్రులు

మహబూబాబాద్ సభలో మంత్రులు ప్రసంగించారు. రేవంత్ బీజేపీలోకి వెళ్తున్నారంటూ.. తాను బీఆర్ఎస్‌లోకి వెళ్తున్నానంటూ అసత్యపు ప్రచారం చేయడం మాజీ సీఎంకు అలవాటుగా మారిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 120 రోజులే అయిందని, ఈ కొద్ది సమయంలోనే ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచామని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. గత పదేళ్లలో గిరిజనుల కోసం ఏమీ చేయని బీజేపీకి గిరిజనులు బుద్ధి చెప్తారని మంత్రి సీతక్క చెప్పారు.




మహబూబ్‌నగర్‌లో సీఎంకు చేపను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి. మానుకోట జనజాతర సభలో అభివాదం చేస్తున్న రేవంత్, ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్, మంత్రులు పొంగులేటి, తుమ్మల, సీతక్క

పాలమూరుకు పది పైసలైనా తెచ్చారా?

శత్రువు చేతిలో కత్తి పెడితే.. వాడు పక్కోన్ని పొడవడు. మన కడుపులోనే పొడుస్తడు. నిన్న మొన్నటివరకు పదేళ్లు కేసీఆరే సీఎంగా, మోదీ పీఎంగా ఉన్నారు కదా. పాలమూరుకు పది పైసలన్నా తెచ్చారా? పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా తెచ్చారా? అది తేలేదుగానీ డీకే అరుణమ్మ మాత్రం బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు పదవి తెచ్చుకుంది. పాలమూరులో ఆమె గెలిస్తే గడీలో ఉన్న బంధువులకు మేలే తప్ప పాలమూరుకు ఏ న్యాయమూ జరగదు. గల్లీ నుండి కేసీఆర్ వచ్చినా.. ఢిల్లీ నుంచి మోదీ వచ్చినా ఈ గడ్డ మనది. నాడు తట్టపనికో, మట్టి పనికో వలసలు పోయినం. ఇవాళ నాయకులమై మీ ప్రాంతాని కొచ్చినం. రాష్ట్రంలోనే కాదు.. దేశంలోనే తలెత్తుకునేలా గౌరవాన్ని ప్రదర్శించినం.

మీ తప్పుల వల్లే కరువు తిప్పలు

మీడియాతో ముఖాముఖిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- బీఆర్ఎస్ వాళ్లున్నప్పుడే వర్షాలు పడలేదు.. వచ్చిన వర్షాన్ని ఒడిసి పట్టుకోవడంలో విఫలమయ్యారు..
- కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని కిందకు వదిలేసి ఇప్పుడు కరువొచ్చిందంటున్నారు
- రూ.43 వేల కోట్ల మిషన్ భగీరథ వ్యవస్థ ఈ కరువులో ఏం చేస్తున్నట్టు?
- ఇవన్నీ ఎవరి తప్పులు?
- బీఆర్ఎస్ తప్పిదాలపై మేం బతకాలనుకోవడం లేదు
- సీఎం సహా మేమందరం 24 గంటలూ ఓ తపస్సులా పనిచేస్తున్నాం
- రాష్ట్రంలో సంపదను సృష్టించి పేదలందరికీ పంచాలన్నదే మా ఆలోచన



సాక్షి, హైదరాబాద్: గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలపై బతకాలని తాము అనుకోవడం లేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. 'బీఆర్ఎస్ హయాంలో తలసరి ఆదాయం పెరిగిందని గొప్పలు చెప్పుకుంటున్నారు. కానీ ప్రజల మధ్య ఆర్థిక అంతరాలు పెరిగాయన్న విషయాన్ని మరుగున పెట్టారు. సింగరేణిలో రూ.30 వేల కోట్ల ఆదాయం వచ్చే బొగ్గు గనులకు సంబంధించిన పెండింగ్ అంశాలను పదేళ్లయినా తేల్చలేదు. వర్షాలు వాళ్లున్నప్పుడే పడలేదు. వచ్చిన వర్షాన్ని ఒడిసి పట్టుకోవడంలో విఫలమయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయినట్టు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చెపితే గోదావరి నీటిని అవసరం లేకపోయినా కిందకు వదిలేశారు. కృష్ణాలో నీటి నిల్వల సంగతి తెలిసి కూడా కేవలం ఓట్ల కోసం, కాల్వల్లో నీటిని చూసి జనం ఓట్లేస్తారనే ఉద్దేశంతో పంటలు లేకపోయినా నీటిని సముద్రంలోకి వదిలేశారు. ఇప్పుడు కరువొచ్చిందని అంటున్నారు. రూ.43 వేల కోట్లు పెట్టి ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ వ్యవస్థ ఈ కరువులో ఏం చేస్తున్నట్టు? ఇవన్నీ ఎవరి తప్పులు? తప్పులన్నీ మీవైపే ఉన్నాయి..' అంటూ భట్టి ధ్వజమెత్తారు. శుక్రవారం హైదరాబాద్‌లోని దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో 'విద్యుత్–తాగునీరు–ఆర్థికం' అంశాలపై నిర్వహించిన మీడియాతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

అప్పులు, వడ్డీల కింద రూ.26,374 కోట్లు చెల్లించాం

'రైతుబంధు కింద గత ప్రభుత్వం రూ.7 వేల కోట్లు దాచిపెడితే మేమేదో ఖర్చు పెట్టినట్టుగా ప్రచారం చేస్తున్నారు. కానీ రాష్ట్రంలో మేము అధికారం చేపట్టేనాటికి రూ.3,960 కోట్ల లోటు బడ్జెట్ ఉంది. ఆ పరిస్థితి నుంచి ప్రతి రూపాయి పోగేస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసే ప్రయత్నం చేస్తున్నాం. సీఎం రేవంత్‌రెడ్డితో సహా మంత్రులందరం 24 గంటలూ కష్టపడుతూ ఓ తపస్సులా పనిచేస్తున్నాం. రాష్ట్రంలో సంపదను సృష్టించి పేదలందరికీ పంచాలన్నదే మా ఆలోచన. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వం చేసిన అప్పుల అసలు, వడ్డీల కింద రూ.26,374 కోట్లు తిరిగి చెల్లించాం. రైతుబంధు కింద రూ.5,575 కోట్లు, ఆర్టీసీకి రూ.1,120 కోట్లు, వ్యవసాయ విద్యుత్ సబ్సిడీల కోసం రూ.3,924 కోట్లు, గృహజ్యోతి కోసం రూ.200 కోట్లు, గ్యాస్ సబ్సిడీ కోసం రూ.80 కోట్లు, బియ్యం సబ్సిడీల కింద రూ.1,147 కోట్లు, రైతు బీమా ప్రీమియం కోసం రూ.734 కోట్లు చెల్లించాం. ఉద్యోగుల వేతనాలు, విద్యార్థులకు డైట్ చార్జీలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, అంగన్‌వాడీలు, హోంగార్డులకు వేతనాలు, డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు... ఇలా మొత్తం రూ.66,507 కోట్లు ఖర్చు పెట్టాం. దీనిపై ఎవరితోనైనా, ఎక్కడైనా చర్చించేందుకు మేం సిద్ధంగా ఉన్నాం..' అని భట్టి సవాల్ చేశారు.

విద్యుత్‌కు అంతరాయమే తప్ప కోతల్లేవు

'విద్యుత్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించి పని చేస్తున్నాం. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా 15,673 మెగావాట్ల పీక్ డిమాండ్ వచ్చినా చిన్న కోత లేకుండా నిరంతర విద్యుత్ ఇస్తున్నాం. ఎప్పుడైనా ఎక్కడైనా కరెంటు పోతే అది అంతరాయం మాత్రమే. నిర్వహణ పనుల కోసం ఆపేస్తున్నదే తప్ప కోత కాదు. 2031–32 సంవత్సరం వరకు 29 వేల నుంచి 30వేల మెగావాట్ల వరకు పీక్ డిమాండ్ వచ్చినా అందుకు తగిన కార్యాచరణ మా వద్ద ఉంది..' అని డిప్యూటీ సీఎం తెలిపారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

'గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండలు మండిపోతున్నా తాగునీటికి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకున్నాం. రాష్ట్రంలో ఎక్కడా నీటి సమస్య రానివ్వబోం. త్వరితగతిన పూర్తయ్యే సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తాం. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో అంబేడ్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు నిర్మిస్తాం. రైతు రుణమాఫీ తప్పకుండా చేస్తాం. ఎన్నికల తర్వాత దీనిపై స్పష్టమైన ప్రకటన ఉంటుంది..' అని భట్టి తెలిపారు.



10 లక్షల కోట్లు ప్రభుత్వ అకౌంట్లలోకి రాలేదు

గత పదేళ్లలో రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.10 లక్షల కోట్లు వచ్చాయన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యలను భట్టి ఖండించారు. 'కేంద్రం నుంచి రూ.10 లక్షల కోట్లు వచ్చాయని ఒక పెద్దమనిషి చెపుతున్నాడు. రూ.10 లక్షల కోట్ల మాట అటుంచితే తెలంగాణపై బీజేపీకి కనీస ప్రేమ ఉన్నా లక్ష కోట్ల రూపాయల నష్టం జరిగేది కాదు. నాడు చేవెళ్ల–ప్రాణహిత ప్రాజెక్టు కోసం మహారాష్ట్ర కోల్పోయే 3 వేల ఎకరాల భూమి విషయంలో వారిని ఒప్పించి పరిహారం ఇచ్చి ఉంటే నేడు కాళేశ్వరం ప్రాజెక్టే వచ్చేది కాదు. కేంద్రం నుంచి మనకు రావాల్సిన వాటా కింద వచ్చింది రూ.3,70,235 కోట్లు మాత్రమే. మరి ఆయన చెపుతున్నట్టు మిగిలినవి ఎక్కడ ఇచ్చారో తెలియదు. ప్రభుత్వ అకౌంట్లలోకి అయితే రాలేదు. బీజేపీ ఇచ్చిన రూ.10 లక్షల కోట్లు, బీఆర్ఎస్ చేసిన రూ.7 లక్షల కోట్ల అప్పు ఏమయ్యాయో, ఆ రెండు పార్టీలు ఏం సాధించాయో?' వారే సమాధానం చెప్పాలి..' అని భట్టి వ్యాఖ్యానించారు.

మా ప్రభుత్వం ఐదేళ్లూ ఉంటుంది

మాజీ సీఎం కేసీఆర్ గురువారం చేసిన వ్యాఖ్యలపై మాట్లాడుతూ..'ప్రభుత్వాన్ని అస్థిరత పాలు చేసే ప్రయత్నాలు తెలంగాణ సమాజానికే నష్టం కలిగిస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం చాలా బలంగా ఉంది. తలకిందులుగా తపస్సు చేసినా, ఎన్ని పిల్లేరు గంతులు వేసినా మా ప్రభుత్వానికి వచ్చే ఢోకా లేదు. ఐదేళ్ల పాటు నిశ్చింతగా ఉంటుంది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తుంది..' అని డిప్యూటీ సీఎం చెప్పారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు విరాహత్ అలీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి మరిన్ని చేరికలు!

నేడు హస్తం గూటికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే!

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ అయిన ప్రకాశ్‌గౌడ్!
- బీజేపీ నేత, మాజీ ఎంపీ రవీంద్ర నాయక్, కేటీఆర్ సమీప బంధువు ఎడ్ల రాహుల్‌రావు చేరిక
- మరో నలుగురైదుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా రెడీ
- కేసీఆర్ వ్యాఖ్యలకు కౌంటర్ అంటున్న కాంగ్రెస్ నేతలు


ప్రకాశ్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికలు మళ్లీ మొదలవుతున్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలోని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ హస్తం గూటికి చేరేందుకు సిద్ధమయ్యారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఆయన కలిశారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిలతో కలిసి ఆయన సీఎంను కలిశారు. ప్రకాశ్‌గౌడ్ కాంగ్రెస్‌లో చేరేందుకు సుముఖత వ్యక్తం చేశారని, శనివారం తన అనుచరులతో కలిసి ఆయన అధికారికంగా పార్టీ లో చేరతారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు బీజేపీ నేత, మాజీ ఎంపీ రవీంద్ర నాయక్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డితో కలిసి సీఎం క్యాంపు కార్యాలయానికి వచ్చిన ఆయనకు రేవంత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమీప బంధువు ఎడ్ల రాహుల్‌రావు కూడా కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుల సమక్షంలో ఆయనకు రేవంత్‌రెడ్డి పార్టీ కండువా కప్పారు.

ఎన్నికల క్లైమాక్స్‌లో..: కాంగ్రెస్ ఎమ్మెల్యేలు 20 మంది తనకు టచ్‌లోకి వచ్చారంటూ మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించిన మరుసటిరోజే బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఒకరు కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ పార్లమెంటు ఎన్నికల ఫలితాలను బట్టి పార్టీలోకి చేర్చుకోవాలనే భావనతో సీఎం రేవంత్ ఉన్నారని, కానీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలే బీఆర్ఎస్‌లోకి వెళ్తారనే కోణంలో కేసీఆర్ మాట్లాడిన నేపథ్యంలోనే.. ఆపరేషన్ ఆకర్ష్‌కు ఆయన పదును పెట్టారని గాంధీభవన్ వర్గాలు చెపుతున్నాయి. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీకి చెందిన మరో నలుగురైదుగురు ఎమ్మెల్యేలు కూడా టచ్‌లో ఉన్నారని, లోక్‌సభ ఎన్నికలకు ముందే వారు పార్టీలోకి చేరతారని కాంగ్రెస్ నేతలు చెపుతున్నారు. ఓ మాజీ మంత్రి కూడా ఈ జాబితాలో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

బీఆర్ఎస్‌కు వైరా మాజీ ఎమ్మెల్యే గుడ్‌బై


రాములునాయక్

వైరా: ఖమ్మం జిల్లా వైరా మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ శుక్రవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ అధినేత కేసీఆర్‌కు లేఖ పంపించారు. 2018లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన ఆనాటి బీఆర్ఎస్ అభ్యర్థి మదన్‌లాల్‌పై విజయం సాధించారు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరగా, గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆయనకు కాకుండా మళ్లీ మదన్‌లాల్‌కే టికెట్ కేటాయించింది. మదన్‌లాల్ ఓడిపోయినా.. వైరా ఇన్‌చార్జిగా ఆయననే నియమించడంతో పార్టీలో తనకు సరైన గౌరవం లభించడం లేదని రాములు నాయక్ సన్నిహితుల వద్ద వాపోయారు. ఈ నేపథ్యంలో ఎంపీలు వద్దిరాజు, నామా తదితరులు రాములు నాయక్ ఇంటికి వెళ్లి తగిన గుర్తింపు లభించేలా చూస్తామని హామీ ఇచ్చారు. అయినప్పటికీ ఆయన బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. కాగా కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన చెప్పినట్లు తెలిసింది.

బస్సుయాత్రకు భద్రత కల్పించండి

- 22 నుంచి మే 10 వరకు కేసీఆర్ ప్రచారం
- ఈసీకి వినతిపత్రం సమర్పించిన బీఆర్ఎస్

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 22 నుంచి మే 10వ తేదీ వరకు తమ పార్టీ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేయనున్న బస్సుయాత్రకు తగిన భద్రత కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల సంఘాన్ని కోరింది.ఈ మేరకు రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్ వికాస్‌రాజ్‌ను శుక్రవారం కలిసి బీఆర్ఎస్ అధికార ప్రతినిధి డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి లేఖను అందజేశారు. కేసీఆర్ పర్యటనకు సంబంధించిన వివరాలను వికాస్‌రాజ్‌కు అందజేసిన అనంతరం వాసుదేవరెడ్డి మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ బస్సుయాత్ర నేపథ్యంలో పోలీసులు సహకరించేలా ఆదేశాలు ఇవ్వాల్సిందిగా వికాస్‌రాజ్‌ను కోరామన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ఈసీ ప్రత్యేకంగా దృష్టి సారించాలని, ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా చూడాలని కోరినట్లు వెల్లడించారు. బస్సుయాత్రలో భాగంగా కేసీఆర్ రైతులతో పాటు వివిధ సామాజికవర్గాలతో భేటీ అవుతారని, ధాన్యం కొనుగోలును పరిశీలించేందుకు కళ్లాలు, కొనుగోలు కేంద్రాలకు కూడా కేసీఆర్ వెళ్తారని పేర్కొన్నారు. అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీతో తెలంగాణకు నష్టం తప్ప ప్రయోజనం లేదన్నారు.

ఎమ్మెల్సీ లేదా చైర్మన్ పోస్టులిస్తాం

- లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వండి
- సీపీఎంకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రతిపాదన
- కలిసి పనిచేసేందుకు ఎలాంటి అభ్యంతరం లేదన్న తమ్మినేని
- కానీ భువనగిరి స్థానంలో తమకు మద్దతివ్వాలని వినతి
- అది కూడా కాంగ్రెస్‌కే ఇవ్వండి.. పదవులిస్తామన్న భట్టి
- నేడు తుది నిర్ణయం


మీడియాతో మాట్లాడుతున్న తమ్మినేని. చిత్రంలో భట్టి విక్రమార్క, వీరయ్య, జూలకంటి

సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతిస్తే సీపీఎంకి ఎమ్మెల్సీ లేదా కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీనిచ్చారు. ఈ మేరకు భట్టి శుక్రవారం సీపీఎం రాష్ట్ర కార్యాలయానికి వచ్చి పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. వీరయ్య, జూలకంటి రంగారెడ్డితో భేటీ అయ్యారు. సుమారు 45 నిమిషాలకు పైగా పలు అంశాలపై చర్చించిన మీదట ఎట్టకేలకు పార్లమెంటు ఎన్నికల్లో కలిసి ప్రయాణించాలని ఆ రెండు పార్టీలు అంగీకారానికి వచ్చాయి. ఈ సందర్భంగా భట్టి మీడియాతో మాట్లాడుతూ తెలంగాణకు సంబంధించి పార్టీ ఆదేశాల మేరకు సీపీఎం కార్యాలయానికి వచ్చానని, ఎన్నికల్లో కలిసి ప్రయాణం చేద్దామని కోరానని చెప్పారు. ఇరు పార్టీల పరంగా అభిప్రాయాలు పంచుకున్నామని చెప్పారు. ఇరు వురి అభిప్రాయాలపై సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అధిష్టానంతో మాట్లాడి శనివారం ఓ నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సాధారణ ఎన్నికల్లో కలిసి ప్రయాణించాలని ఇరు పార్టీలు సుహృద్భావ వాతావరణంలో ఓ అంగీకారానికి వచ్చామని అన్నారు.

భువనగిరి స్థానంలో మద్దతు ఇమ్మన్న సీపీఎం

భువనగిరి స్థానానికి కాంగ్రెస్ మద్దతు ఇవ్వాలని సీపీఎం నాయకులు భట్టిని కోరారు. మిగిలిన 16 స్థానాల్లో తాము మద్దతిస్తామని తెలిపారు. అయితే భువనగిరి స్థానంలో కూడా తమకే మద్దతు ఇవ్వాలని భట్టి కోరారు. అందుకు తాము ఎమ్మెల్సీ లేదా చైర్మన్ పదవులు ఇస్తామని హామీ ఇచ్చారు.

భట్టి రావడం హ్యాపీ.. కానీ రేవంత్ అలా మాట్లాడకూడదు: తమ్మినేని

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తమ పార్టీ కార్యాలయానికి రావడం, పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాలంటూ కోరడం సంతోషకరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. ఇది తమ ఆలోచనలకు అనుగుణంగానే ఉందన్నారు. సీట్లు, మద్దతు విషయంలో భట్టితో మాట్లాడామని చెప్పారు. భువనగిరి మినహా మిగతా స్థానాల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతివ్వడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం కలిసి చర్చించినపుడు తుది నిర్ణయానికి వస్తామన్నారు. కేరళలో సీఎం రేవంత్ రెడ్డి అలా మాట్లాడి ఉండాల్సింది కాదని తమ్మినేని వ్యాఖ్యానించారు.

కపటనీతికి మారుపేరు కాంగ్రెస్: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: కపటనీతికి మారుపేరుగా మారిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యంగా యువతకు అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. అధికారంలోకి వచ్చిన 120 రోజుల పాలనలోనే నిరుద్యోగులు సహా కాంగ్రెస్ అందరికీ ద్రోహం చేస్తోందన్నారు. సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'ద్వారా ప్రభుత్వ తీరును కేటీఆర్ ఎండగట్టారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు రూ.4 వేల చొప్పున భృతి ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అలాంటి హామీ ఇవ్వలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పడాన్ని ప్రశ్నించారు. ఫిబ్రవరి 1 నుంచి ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తామని కాంగ్రెస్ జాబ్ కేలండర్‌ను కూడా ప్రకటించిందని గుర్తుచేశారు. బీఆర్ఎస్ హయాంలో భర్తీ చేసిన 30 వేల ఉద్యోగాలకు నియామకపత్రాలు ఇచ్చి నిస్సిగ్గుగా తమ ఖాతాలో వేసుకుంటోందని మండిపడ్డారు. అన్ని పోటీ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తామని ప్రకటించిన కాంగ్రెస్.. యూటర్న్ తీసుకుని టెట్ పరీక్ష ఫీజును రూ.400 నుంచి రూ.2 వేలకు పెంచిందన్నారు. కోర్టులో అనేక కేసులు వేసి పోటీ పరీక్షలు రద్దవడానికి కారణమైన బల్మూరి వెంకట్ ఎమ్మెల్సీ పదవిని అందుకున్నాడని కేటీఆర్ విమర్శించారు. హామీలను విస్మరించి కాంగ్రెస్‌కి నిరుద్యోగ యువత గుణపాఠం చెప్పాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

ఆఖరి నిమిషం దాకా అలర్ట్!

- అప్రమత్తంగా ఉండాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయం
- అభ్యర్థులు చేజారకుండా అన్ని రకాల జాగ్రత్తలు
- ఎక్కడైనా అవసరమైతే తక్షణమే ప్రత్యామ్నాయం ఏర్పాటు
- అధినేత కేసీఆర్‌తో భేటీ అయిన కేటీఆర్, హరీశ్‌రావు
- 22వ తేదీ నుంచి కేసీఆర్ బస్సు యాత్రపై కసరత్తు
- 'పొలం బాట'తరహా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయం
- పార్టీ పర్యవేక్షణలోనే ఎన్నికల నిధుల వ్యయం




సాక్షి, హైదరాబాద్: నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమై లోక్‌సభ ఎన్నికల వాతావరణం వేడెక్కుతున్న నేపథ్యంలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని బీఆర్ఎస్ పార్టీ భావిస్తోంది. పార్టీ అభ్యర్థులుగా ఖరారు చేసిన అభ్యర్థులు కొందరు చివరి నిమిషంలో ఇతర పార్టీల్లో చేరడాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయాన్ని తీసుకుంది. ఎక్కడా అభ్యర్థులు చేజారిపోకుండా చూడాలని, ఒకవేళ ఎక్కడైనా పార్టీ అభ్యర్థుల నామినేషన్ల దాఖలులో ఇబ్బందులు ఎదురైతే వెంటనే ప్రత్యామ్నాయ అభ్యర్థులను బరిలోకి దించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసింది. పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు నందినగర్ నివాసంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు శుక్రవారం ఆయనతో సుదీర్ఘంగా భేటీ అయ్యారు. కేసీఆర్ ఎన్నికల ప్రచార సభలు, బస్సు యాత్ర షెడ్యూల్‌తో పాటు రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులు, పరిణామాలపై లోతుగా చర్చించారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నాటికి ఒకరిద్దరు సిట్టింగ్ ఎమ్మెల్యేలతో పాటు కొందరు కీలక నేతలు కూడా పార్టీని వీడే అవకాశమున్నట్లు అంచనా వేశారు. ఎమ్మెల్యేలు లేదా అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు పార్టీ మారిన చోట లోక్‌సభ ఎన్నికల ప్రచారం, సమన్వయ సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు అనుసరించాల్సిన కార్యాచరణను సిద్ధం చేశారు. గురువారం జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో కేసీఆర్ ప్రస్తావించిన అంశాలు, వాటిపై విపక్ష శిబిరం నుంచి వచ్చిన స్పందనపై కూడా ఈ భేటీలో చర్చించినట్లు సమాచారం. ఈ సందర్భంగా కేసీఆర్ ఇరువురు నేతలకు పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల నిధుల వ్యయం అభ్యర్థుల చేతుల మీదుగా కాకుండా పార్టీ పర్యవేక్షణలోనే జరిగేలా చూడాలని ఆదేశించారు.

కాంగ్రెస్, బీజేపీల కంటే ఓ అడుగు ముందే..!

లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఇప్పటివరకు జరిగిన సన్నాహక భేటీలను, కేడర్‌ను సన్నద్ధం చేసిన తీరుపై కేసీఆర్ సమీక్షించారు. సన్నాహక భేటీలు, సభల నిర్వహణ, ప్రచారంలో బీజేపీ, కాంగ్రెస్‌తో పోలిస్తే ఓ అడుగు ముందు ఉన్నట్లు అంచనాకు వచ్చారు. ఎన్నికల ప్రచారంలో విపక్ష పార్టీలు ప్రస్తావిస్తున్న అంశాలు, ఉపయోగిస్తున్న భాష తదితరాలు భేటీలో ప్రస్తావనకు వచ్చాయి. రెండు జాతీయ పార్టీలను ఇరకాట స్థితిలోకి నెట్టేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. కేసీఆర్ బస్సు యాత్ర కోసం ప్రజలకు చేరువయ్యే రీతిలో కొత్త పాటలను రికార్డు చేసే పనులు సాగుతున్నట్లు పార్టీ నేతలు వెల్లడించారు. ఇలావుండగా శుక్రవారం పలువురు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కేసీఆర్‌ను కలిశారు.

రైతాంగ సమస్యలు ఎత్తిచూపేలా యాత్ర

ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ ఈ నెల 22 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు చేసే బస్సు యాత్ర తీరుతెన్నులపై సుదీర్ఘంగా చర్చించారు. బస్సు యాత్ర చేయాల్సిన మార్గం, ఏయే తేదీల్లో ఏయే ప్రదేశాల్లో సభలు, వీధి మలుపు (స్ట్రీట్ కార్నర్) సమావేశాలు ఏర్పాటు చేయాలనే అంశంపై కసరత్తు చేశారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఉదయం 11 గంటల లోపు ఇటీవల కేసీఆర్ చేసిన 'పొలంబాట'తరహా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. క్షేత్రస్థాయిలో రైతులు, యువత, మహిళలు, మైనారిటీలు ఇతర సామాజిక వర్గాలతో కేసీఆర్ భేటీ అయ్యేలా చేపట్టాల్సిన కార్యక్రమాల జాబితాను సిద్ధం చేశారు. రైతాంగ సమస్యలను ప్రధానంగా ఎత్తి చూపేలా బస్సు యాత్ర ఉదయం పూట షెడ్యూల్‌ను రూపొందిస్తున్నారు. సాయంత్రం సమయంలో రెండు లేదా మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో రోడ్ షోలు, మినీ సభలు నిర్వహించాలని నిర్ణయించారు. తనతో పాటు బస్సు యాత్రలో పాల్గొనే బృందం బస, భోజన వసతి తదితరాల బాధ్యతలు స్థానికంగా ఎవరికి అప్పగించాలనే అంశంపైనా చర్చ జరిగింది. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని సభలు, రోడ్‌షోలకు వచ్చే వారికి మంచినీరు, మజ్జిగ ప్యాకెట్ల సరఫరా చేయాలని నిర్ణయించారు. కాగా బస్సు యాత్ర రూట్‌మ్యాప్‌పై లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఆయా జిల్లాల నేతలు ఇప్పటికే తమ ప్రతిపాదనలు అందజేశారు. ఈ ప్రతిపాదనలను క్రోడీకరించి శనివారం సాయంత్రంలోగా కేసీఆర్ బస్సు యాత్ర షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశముందని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.





ఐదు పాదాలు గలవాడు, పన్నెండు ఆకారాలు గలవాడు, అందరికీ తండ్రియైన వాడు, నీటిని ఉత్పత్తిగావించేవాడు అయిన సూర్యుడు స్వర్గలోకానికి ఇంకా పైన అత్యున్నత స్థానంలో నెలకొని ఉన్నాడని చెబుతారు.

– ప్రశ్నోపనిషత్తు (హిందూ ధర్మం)

సాక్షి

శనివారం, 20 ఏప్రిల్ 2024

పసివాళ్ల ఆహారంతో ఆటలా!

తొమ్మిదేళ్లనాటి మ్యాగీ నూడిల్స్ వివాదం నుంచి బయటపడి రెండు వారాలు గడిచాయో లేదో... నెస్లే కంపెనీ మెడకు కొత్తగా సెరిలాక్ తగువు చుట్టుకుంది. ఈసారి దీని మూలం మన దేశంలో కాదు, స్విట్జర్లాండ్‌లో వుంది. భిన్న రకాల ఉత్పత్తుల ద్వారా లాభాల రూపంలో ఏటా వేలాదికోట్ల రూపాయలు తరలించుకుపోతున్న బహుళజాతి సంస్థలకు ఇక్కడి ప్రజల ఆరోగ్యం విషయం లోగానీ... ఇక్కడి సంస్కృతీ సంప్రదాయాలపైగానీ పెద్దగా పట్టింపు వుండదని చాలామంది చేసే ఆరోపణ. అడపా దడపా వెల్లడవుతున్న అంశాలు వాటిని బలపరిచేవిగానే వుంటున్నాయి. భారత్‌లో పసివాళ్ల ఆకలి తీర్చడానికి తల్లులు ఉపయోగించే సెరిలాక్‌లో అధిక శాతం చక్కెర వుంటున్నదని స్విట్జర్లాండ్‌లోని స్వచ్ఛంద సంస్థ 'పబ్లిక్ ఐ' మరో సంస్థ అంతర్జాతీయ బేబీ ఫుడ్ యాక్షన్ నెట్‌వర్క్ (ఐబీ–ఫాన్)తో కలిసి గురువారం బయటపెట్టాక దేశం నివ్వెరపోయింది. నెస్లే సంస్థ ఒక్క భారత్‌లో మాత్రమే కాదు, యూరప్ దేశాలతోపాటు ఆఫ్రికా, లాటిన్ అమెరికా, దక్షిణాసియా దేశాల్లో కూడా సెరిలాక్ విక్రయిస్తోంది. కానీ యూరప్ దేశాల పిల్లల కోసం తయారుచేసే సెరిలాక్‌కూ, వేరే దేశాల్లో విక్రయించే సెరిలాక్‌కూ చాలా వ్యత్యాసం వుంది. యూరప్ దేశాల్లో విక్రయించే సెరిలాక్‌లో అసలు చక్కెర పదార్థాలే వాడని నెస్లే... ఇతరచోట్ల మాత్రం యథేచ్ఛగా వినియోగిస్తున్నట్టు 'పబ్లిక్ ఐ' తెలిపింది.

మూడేళ్లలోపు పిల్లలు తినే ఆహార పదార్థాల్లో కృత్రిమంగా తీపిని పెంచే సుక్రోజ్, ఫ్రక్టోజ్ వంటి పదార్థాలేవీ కలపరాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసింది. పసిపిల్లల ఆహారోత్పత్తుల్లో కృత్రిమ తీపి పదార్థాలు, అదనపు చక్కెర వుండరాదన్నది 2022 సంవత్సర ప్రధాన నినాదం కూడా. కానీ దురదృష్టమేమంటే మన దేశం వాటి వినియోగాన్ని అనుమతిస్తోంది. తమ చిన్నారులకు అవసరమైన ప్రొటీన్‌లు, విటమిన్లు, ఐరన్ తదితర పోషకాలు లభిస్తాయన్న ఆశతో తల్లులు సెరిలాక్ వంటి ఉత్పత్తులను ఆశ్రయిస్తారు. గత అయిదేళ్లుగా సెరిలాక్‌లో కృత్రిమ తీపి పదార్థాల వాడకాన్ని 30 శాతం తగ్గించామని నెస్లే కంపెనీ తాజా వివాదం తర్వాత సంజాయిషీ ఇస్తోంది. మంచిదే. కానీ అసలు వాడరాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతున్నప్పుడు ఈ తగ్గించటమేమిటి? ఇన్ని దశాబ్దాలుగా వాటిని ఎందుకు కొనసాగించినట్టు? ఇది తప్పించుకునే ధోరణి కాదా? నెస్లే సంస్థ సంగతలావుంచి అసలు మన దేశంలో అమ్ముడవుతున్న బహుళజాతి సంస్థల ఉత్పత్తుల్లో తగిన ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో చూసి నియంత్రించాల్సిన ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఐ) ఏమైనట్టు? ఎక్కడో స్విట్జర్లాండ్‌లోని స్వచ్ఛంద సంస్థలు వివిధ దేశాల్లో విక్రయించే సెరిలాక్ ఉత్పత్తుల నమూనాలను సేకరించి నిగ్గుతేల్చే వరకూ ఆ సంస్థ గాఢ నిద్రపోయిందా అనే సందేహం రావటం సహజం. పసివాళ్లకు అందించే ఆహారంలో పరిమితికి మించి చక్కెర లేదా ఉప్పు ఎక్కువైతే వారి ఆరోగ్యానికి ఎంతో హాని కలుగుతుందనీ, చిన్న వయసునుంచే తీపి పదార్థాలకు వారు అలవాటుపడతారనీ నిపుణులంటారు. ఈ పదార్థాలు ఊబకాయాన్ని పెంచుతాయని, పిల్లలు శ్వాసకోశ వ్యాధులు, గుండె సంబంధ వ్యాధులు, కేన్సర్, మధు మేహంవగైరా వ్యాధులకు లోనవుతారని హెచ్చరిస్తారు. మన పిల్లల్లో ఇటీవలకాలంలో ఊబకాయం లక్షణం పెరుగుతున్నదని అనేక సర్వేలు గొంతు చించుకుంటున్నాయి కూడా. అయినా నియంత్రణ వ్యవస్థల చెవులకు సోకలేదు. ఒక అంచనా ప్రకారం కేవలం సెరిలాక్ అమ్మకాల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా నెస్లే సంస్థ ఏటా వంద కోట్ల డాలర్ల (రూ. 8,400 కోట్లు)కుపైగా ఆర్జిస్తోంది. ఇందులో భారత్, బ్రెజిల్ దేశాల వాటాయే 40 శాతం వుంటుందని అంటారు. ఇంతగా లాభాలొచ్చే ఉత్పత్తి విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలనీ, అంతర్జాతీయ ప్రమాణాలు పాటించాలనీ నెస్లేకు తెలియదా? పోనీ అన్నిచోట్లా ఇలానే చేస్తే అజ్ఞానమో, నిర్లక్ష్యమో అనుకోవచ్చు. కానీ ధనిక దేశాల్లో ఒకరకంగా, వర్ధమాన దేశాల్లో మరో విధంగా ద్వంద్వ ప్రమాణాలు పాటించటం ఏ వ్యాపార నీతి?

ఆహార ఉత్పత్తులు, శీతల పానీయాలు తదితరాల విషయంలో ఏమరుపాటు పనికిరాదు. వాటిని ఎప్పుడో ఒకసారి పరీక్షించి చూసి వదిలేయకూడదు. నిర్ణీత కాలపరిమితుల్లో నిరంతరం వాటి నమూనాలను పరీక్షిస్తూ వుండాలి. మనం తినే తిండి ఆరోగ్యదాయకమేనా, సురక్షితమేనా అని మాత్రమే కాదు... ఉత్పత్తిదారు చెప్పుకుంటున్నవిధంగా అందులో పోషకాలున్నాయో లేదో గమనించాలి. ప్రమాణాలకు అనుగుణంగా లేనివాటిని నిర్దాక్షిణ్యంగా మార్కెట్ నుంచి తొలగించాలి. ప్రపంచంలో చైనా తర్వాత మన దేశమే అతి పెద్ద మార్కెట్. అందుకే బహుళజాతి సంస్థలు సినీతారలనూ, క్రీడా దిగ్గజాలనూ తమ బ్రాండ్ అంబాసిడర్లుగా రంగంలోకి దించి ప్రకటనలతో ఊదరకొడుతూ అచిరకాలంలోనే లాభాల బాట పడుతుంటాయి. ఆ ఉత్పత్తుల్ని వాడటం ఆధునికతకూ, ఉత్తమాభిరుచికీ నిదర్శనమని బ్రాండ్ అంబాసిడర్లు చెప్తే మోసపోవటానికి మన మధ్యతరగతి ఎప్పుడూ సిద్ధంగా వుంటుంది. 2015లో మ్యాగీ నూడిల్స్‌లో అత్యంత హానికరమైన సీసం, మోనోసోడియం గ్లూటామేట్ వంటి పదార్థాలున్నాయని వెల్లడైనప్పుడు గగ్గోలైంది. తీరా తొమ్మిదేళ్లు గడిచాక జాతీయ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార కమిషన్ మ్యాగీ నూడిల్స్ విషయంలో కేంద్రం నిర్ణయం సరికాదని ఈనెల మొదటివారంలో తోసిపుచ్చింది. నెస్లేకు క్లీన్‌చిట్ ఇచ్చింది. భవిష్యత్తులో సెరిలాక్ విషయంలోనూ ఇదే జరుగుతుందా? ఇతరత్రా అంశాల మాటెలావున్నా హానికారక ఆహార పదార్థాలు మార్కెట్‌లోకి రాకుండా చూడాల్సిన కనీస బాధ్యత తమకున్నదని కేంద్ర ప్రభుత్వం గుర్తించటం అవసరం.

సెక్యులరిజం ఒక పాడియావు?

అభిప్రాయం



టంకశాల అశోక్

ఏదైనా రాజకీయ పార్టీ ఒక సిద్ధాంతాన్ని ప్రకటించినపుడు అందుకు త్రికరణశుద్ధిగా కట్టుబడాలి. ఎటువంటి సమస్యలు ఎదురైనా, అధికారం ఉన్నా పోయినా, ఆ సిద్ధాంతంపై రాజీ పడకూడదు. అందుకు బహిరంగంగా గానీ, పరోక్ష రీతిలో గానీ వెసులుబాట్లు చూపరాదు. అప్పుడే ప్రజలకు ఆ పార్టీ పట్ల, ఆ సిద్ధాంతం పట్ల అచంచలమైన విశ్వాసం ఏర్పడుతుంది. కానీ కాంగ్రెస్ పార్టీ నెహ్రూ తర్వాత కాలం నుంచి నేటి వరకు కూడా సెక్యులరిజం విషయమై అటువంటి రాజీలేనితనాన్ని చూపలేదు. ఇందిరాగాంధీ సాఫ్ట్ హిందూత్వ ఎత్తుగడల నుంచి, ప్రస్తుతం పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై విధానం వరకు సెక్యులరిజంతో కాంగ్రెస్ దోబూచులలో కనిపించేది అంతా అధికారం కోసం సాగించే ద్వంద్వ నీతే.

రాహుల్ గాంధీ ఈనెల 17న కర్ణాటకలోని మాండ్యా సభలో మాట్లాడుతూ, ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలు రెండు సిద్ధాంతాల మధ్య పోరాటమని అన్నారు. ఇండియా కూటమి సిద్ధాంతం రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించటం కాగా, బీజేపీ సిద్ధాంతం ఆ రెండింటినీ కూలదోయటమన్నారు. సరిగా అదే 17వ తేదీన అదే ఇండియా కూటమిలో భాగస్వామి అయిన సీపీఎం పార్టీ కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తమ రాష్ట్రంలోని పాలక్కాడ్‌లో ప్రసంగిస్తూ, పౌరసత్వ చట్టం (సీఏఏ) వివాదంపై రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ ఎందుకు మౌనంగా ఉన్నాయని సూటిగా ప్రశ్నించారు. ఈ ప్రశ్న కాంగ్రెస్‌కు సహజంగానే ఇబ్బందికరంగా మారింది. దానితో విజయన్‌పై ఎదురుదాడి జరిపింది. మరునాడు 18న కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్స్‌లో ఒకరైన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేరళ నుంచి రాహుల్ గాంధీ పోటీ చేస్తున్న వయనాడ్ ఎన్నికల సభలో పాల్గొంటూ, విజయన్ పైకి కమ్యూనిస్టు అయినా అంతర్గతంగా మతతత్వవాది అనీ, ఆయనకు ప్రధాని నరేంద్ర మోదీతో రహస్య ఒప్పందం ఉందనీ ఆరోపించారు. అక్కడ అది విన్న వారికీ, కేరళ ప్రజలకూ అదెంత రసవత్తరంగా తోచి ఉంటుందో మనకు తెలియదు.

దానినట్లుంచి రాహుల్, విజయన్‌ల మాటలకు వద్దాము. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించటం అవసరమని, బీజేపీ వల్ల అందుకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందనే భావన దేశంలో విస్తృతంగా ఏర్పడటం నిజం. వాటి పరిరక్షణకు కాంగ్రెస్ గానీ, ఇండియా కూటమి గానీ నిజంగానే కట్టుబడి ఉంటే దానిని స్వాగతించవలసిందే. కానీ, ఇండియా కూటమికి నాయకత్వ స్థానంలోగల కాంగ్రెస్ పార్టీయే అట్లా కట్టుబడి లేదనే సందేహం, కూటమిలో ఒక ముఖ్య భాగస్వామ్య పార్టీకి కలుగుతున్నదంటే మామూలు విషయం కాదు. సీఏఏ గానీ, దాని అమలుకు తదుపరి చర్యగా భావిస్తున్న యూనిఫాం సివిల్ కోడ్ (యూసీసీ) గానీ సెక్యులరిజంతో ముడిబడిన అంశాలనే భావన విస్తృతంగా ఉంది. వీటిపై తీవ్రమైన చర్చలు కొన్ని సంవత్సరాలుగా సాగుతున్నాయి. మోదీ ప్రభుత్వం సీఏఏను ఇటీవల అమలుకు కూడా తెచ్చిన దరిమిలా, ప్రస్తుత ఎన్నికలలో అది వివాదంగా మారింది. దానిని తాము అమలుపరచబోమని బెంగాల్, కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు ప్రకటించాయి. కనుక దాని ప్రాముఖ్యత ఎంతో వేరుగా చెప్పనక్కర లేదు. అటువంటి స్థితిలో సీఏఏపై రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ, వారి ఎన్నికల మేనిఫెస్టో విధానమేమిటో ప్రకటించాలని ఎవరైనా కోరుతారు. కానీ అటునుంచి ఇంతవరకు అంతా మౌనమే. మరొక విశేషం గమనించండి. రాహుల్ గాంధీ ఇటీవల భారత్ జోడో యాత్రలు నిర్వహించారు. దేశంలో బీజేపీ, మోదీ విద్వేషాన్ని వ్యాపింప జేస్తుండగా తాము ప్రేమను సృష్టిస్తున్నామని అడుగడుగునా ప్రకటించారు. మోదీ విద్వేషం ప్రధానంగా అల్పసంఖ్యాక వర్గాలపై అన్నది విమర్శ. ఆ వర్గాల భయం. వారి భయ కారణాలలో ఒకటి సీఏఏ. కానీ రాహుల్ గాంధీ తన యాత్రలో ఒక్కచోటనైనా ఆ ప్రస్తావన చేయలేదు. ఎందుకన్న ప్రశ్నలు చాలా వచ్చాయి. అయినా తను ఎటువంటి వివరణా ఇవ్వలేదు.



ఇవన్నీ గమనించినపుడు కలిగే అభిప్రాయం ఏమిటి? రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కలిపి చూపుతూ వాటి పరిరక్షణ తమ సిద్ధాంతమన్నారు. భారత రాజ్యాంగం సెక్యులరిజాన్ని ప్రవచిస్తున్నది. సమాజంలోని అన్ని వర్గాల పరిరక్షణ ప్రజాస్వామ్యపు మౌలిక లక్షణాలలో ఒకటి. అటువంటప్పుడు, రాహుల్ గాంధీ ఈ విధమైన వైఖరిని తీసుకుంటూ తమ సిద్ధాంతం ఫలానాది అని ప్రకటించటంలో రెండింటికి పొసగేది ఏమైనా ఉందా, లేక అందులో పరస్పర వైరుధ్యం కనిపిస్తుందా? ఇది మర్యాదగా అంటున్న మాట. నిర్మొహమాటంగా అడగాలంటే ఇది కపట నీతి కాదా? ఇది నిస్సందేహంగా కపట నీతే అవుతుంది.

ఎందుకీ కపట నీతి అన్నది తర్వాత ఎదురయే ప్రశ్న. ప్రస్తుత పరిస్థితి గురించి ఒక్క మాటలో చెప్పాలంటే, కాంగ్రెస్ పార్టీ కొంత కాలంగా రెండు పరిస్థితుల మధ్య చిక్కుకుని తనతో తానే యుద్ధం చేసుకుంటున్నది. ఆ పార్టీ ఈ దేశాన్ని, ఈ సమాజాన్ని, వివిధ వర్గాల ప్రజలను తానే చెప్తున్న రాజ్యాంగం ప్రకారం, చట్టాల ప్రకారం, మేనిఫెస్టోల ప్రకారం అభివృద్ధి చేయటంలో అనేక దశాబ్దాల నుంచి విఫలమవుతున్నది. ఆ కారణంగా ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి, ఓట్లు, సీట్లు, అధికారాలను పోగొట్టుకుంటూ అసలు తన ఉనికి ఏమవుతుందోననే భయానికి గురవుతున్నది. ఆ స్థితి నుంచి బయట పడేందుకు పేదలు, మధ్యతరగతి, రైతులు, కూలీలు, వృత్తిపరులు, బడుగు వర్గాలు, మైనారిటీల ఓట్లు ఆధారమన్నది సంప్రదాయికంగా మొదటినుంచి ఉండిన ఆలోచన. కానీ తన అసమర్థ పాలనవల్ల ఒక్కొక్క వర్గమే దూరమవుతూ రాగా, ఒక దశ వచ్చే సరికి, జనరంజక పాలన ద్వారా ఓట్ల సాధన అనే దృష్టి సహజ మరణం చెందుతూ రాగా, కుల–మత ఆధారిత వ్యూహాలు మొదలయ్యాయి. అందులోనూ పలు కులాలు ఆయా కుల పార్టీలపట్ల ఆకర్షితం కావటం ఒక సమస్యగా మారింది. ఇందిరాగాంధీ సాఫ్ట్ హిందూత్వ ప్రధానంగా జమ్మూ–కశ్మీర్‌కు పరిమితం కాగా, రాజీవ్ గాంధీ కాలం నుంచి అది జాతీయమై పోయింది. ఆ ప్రకారం ఆయన ఏమేమి చేశారన్న వివరాలలోకి ఇక్కడ వెళ్లలేము. ఆయన తర్వాత పీవీ నరసింహారావు కూడా అదే పని చేశారు.

ఇందులో కాంగ్రెస్ పార్టీ తనతో తాను చేసుకుంటున్న యుద్ధం ఏమంటే, పరిపాలనా వైఫల్యాలవల్ల ప్రజాసమూహాలు దూరమై ఎన్నికలలో పరాజయాలు ఎదురవుతుండిన స్థితిలో, కొత్త వ్యూహం ప్రకారం తనకు ఇటు ముస్లిముల ఓట్లు, అటు హిందువుల ఓట్లు కావాలి. అద్వానీ రథయాత్ర, బాబ్రీ మసీదు కూల్చివేతతో ఆరంభించి బీజేపీ వేగంగా బలపడుతుండటంతో కాంగ్రెస్ కూడా ఈ చట్రంలో చిక్కుకుపోయింది. ఆ ప్రకారం అటు హిందువుల కోసం, ఇటు ముస్లిముల కోసం రెండు చేతులా కత్తిసాములు చేసినా, రెండు సాములలోనూ ఓడిపోవటం మొదలైంది. అయితే అందులో ఆశ్చర్యం ఎంతమాత్రం లేదు. ఎందుకన్నది జాగ్రత్తగా అర్థం చేసుకోవలసిన విషయం. హిందువుల విషయంలో ఓడటం పొలిటికల్ సోషియాలజీకి సంబంధించినది. సూటిగా చెప్పాలంటే, హిందూవాదాన్ని 1925 నుంచే చేపట్టిన సంస్థలు, వాటికి వారసులైన బీజేపీ, ఇవన్నీ అందుకు అనుగుణంగా చేపడుతున్న కార్యకలాపాలు నిరంతరం తమ ఎదుట ఉన్న స్థితిలో, హిందూ సమాజం అందుకు కాపీరైట్‌ను బీజేపీకి మాత్రమే ఇస్తుంది. కాంగ్రెస్ సాఫ్ట్ హిందూత్వకు గానీ, అంత కు మించిన మరే వైఖరులకుగానీ విలువ ఉండదు. పోతే, ముస్లిములు కూడా కాలం గడిచేకొద్దీ, కాంగ్రెస్ పార్టీ తమను ఓటుబ్యాంకుగా ఉపయోగించుకోవటం తప్ప, తమ అభివృద్ధికి, భద్రతకు నిజంగా చేసింది చాలా తక్కువనే అభిప్రాయానికి వచ్చారు. దానితో కాంగ్రెస్‌ను తిరస్కరించి ఇతర పార్టీల వైపు చూడటం మొదలైంది. ఆ విధంగా కాంగ్రెస్, తనతో తాను యుద్ధం చేసుకుంటూ ఈ రెండు కత్తిసాములలోనూ ఓడి పోతున్నది.

ఈ రోజున కాంగ్రెస్‌ది ఒక దిక్కుతోచని స్థితి. అందుకే, రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ, మొహబ్బత్ కీ దుకాన్ ఖోల్ నా అని యాంత్రికంగా వల్లెవేయటమైతే చేయగలరు గానీ, సీఏఏపై మాట్లాడలేరు, ఆ మాట మేనిఫెస్టోలో పెట్టలేరు. ఎందుకని అడిగేవారిపైనే ఎదురుదాడి చేస్తారు. ఎంతటి దయనీయమైన స్థితి. ఒకప్పటి పాడియావు అయిన సెక్యులరిజం క్రమంగా వట్టిపోయిన ఆవుగా మారుతున్నది.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కొత్త స్నేహం



ఇండియా కేవలం బ్రహ్మోస్ మాత్రమే ఇవ్వలేదు; మనం దాన్ని మిఠాయిలతో ఇచ్చాం. కాకపోతే దీన్ని చూడటానికి కొందరికి చిరచిరగా ఉండొచ్చు. బ్రహ్మోస్ క్షిపణి అప్పగింత సందర్భంగా ఫిలిప్పీన్స్ నౌకాదళ అధికారులకు భారత అధికారులు మిఠాయిలు ఇచ్చారు.

– స్నేహేశ్ అలెక్స్ ఫిలిప్, జర్నలిస్ట్

బోడిగుండుకు...



నూతనంగా నిర్మితమైన హిందూ దేవాలయమే దుబాయ్ వరదలకు కారణమని ఇస్లామిక్ 'వాతావరణ పరిశోధకులు' చెబుతున్నారు; జీన్సు వేసుకునే మహిళలే భూకంపాలకు కారణమని చెప్పినట్టుగానే ఇదీ ఉంది.

– నైలా ఇనాయత్, పాకిస్తాన్ జర్నలిస్ట్

మనస్తత్వం



మనం అందరం రాహుల్ గాంధీలనే పెంచుతున్నాం. ఈ మధ్యతరగతి పిల్లల పెంపకం అనే అంశంలో 'పోలరైజేషన్' లేదు. మధ్యతరగతి అనేది నరేంద్ర మోదీకి ఓటు వేస్తుంది; ఇంట్లో రాహుల్ గాంధీలను పెంచుతుంది.

– మనూ జోసెఫ్, రచయిత

ఆ కాలమూ వస్తుంది!



తమ ప్రజాస్వామిక హక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు బారులు తీరారని ఒక జాతీయ ఛానెల్‌లో ఒక రిపోర్టర్ నివేదిస్తున్నారు. బహుశా భవిష్యత్‌లో ఆయన మాట నిజం అవుతుంది.

– సుమంత్ రామన్, టీవీ హోస్ట్

అసలు ఇల్లు



మనం చాలావరకు మన జీవితాన్ని మన తలలోనే జీవిస్తాం. కాబట్టి దాన్ని తప్పక మంచి ప్రదేశంగా ఉండేలా చూసుకోండి.

– జోయీతా, ఫిజీషియన్

ఇన్ బాక్స్

ఆదివాసీల హక్కులను పరిరక్షించాలి

భారత రాజ్యాంగం ఆదివాసులకు ప్రత్యేక రక్షణలు కల్పించింది. అటవీ ప్రాంతాల్లో ప్రభుత్వం ఏ పనులు చేపట్టాలన్నా గ్రామ సభ అనుమతి తప్పనిసరి. కానీ ప్రభుత్వాలు ఈ నిబంధనలను పాటించడం లేదు. అడవుల్లోకి ఆదివాసీయేతరుల చొరబాటును నియంత్రించడం లేదు. పైగా కార్పొరేట్ సంస్థలకు అక్కడి సహజ వనరులను అప్పగిస్తున్నాయి. దీని వల్ల ఆదివాసుల రాజ్యాంగబద్ధ హక్కులకు ప్రమాదం ఏర్పడింది. ప్రభుత్వం తన రాజకీయార్థిక విధానంగా కార్పొరేటీకరణను తీసుకరావడంతో దేశవ్యాప్తంగా ఆదివాసీ ప్రాంతాల్లో తీవ్రమైన ప్రతిఘటన నడుస్తోంది. ఈ ఘర్షణ ఆదివాసీ ప్రాంతాల్లో అనేక రూపాల్లో వ్యక్తమవుతోంది. న్యాయమైన ప్రజా పోరాటాలను అర్థం చేసుకోవాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్ దోపిడీకి రక్షణ కల్పించడానికి సిద్ధమయ్యాయి. ఇందులో భాగమే ఈ నెల 16న ఛత్తీస్‌గఢ్‌లోని మాడ్ ప్రాంతంలో కేంద్ర భద్రతా బలగాలు 29 మంది మావోయిస్టులను చంపేయడం!

గత ఏడాది మొదటి వారంలో ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఒక పరంపరగా అక్కడ 80 మంది దాకా చంపేశారు. అంతకు ముందు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఈ అణచివేత వైమానిక దాడుల రూపం తీసుకున్నది. అణచివేతను మరింత ఉధృతం చేయడానికి జనవరి 1 నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ఆపరేషన్ కగార్' అనే కొత్త యుద్ధ వ్యూహాన్ని అమలు చేస్తున్నవి.

దేశంలోని సహజ వనరులనూ, ప్రజల శ్రమశక్తినీ కొల్లగొట్టే కార్పొరేట్ తరహా అభివృద్ధి విధానం అమానవీయమైనది. దోపిడీ, అసమానతలు, హింస వంటి వాటి మీద కార్పొరేటీకరణ ఆధారపడి ఉంటుంది. ఇది సమాజాన్నేగాక, ప్రకృతినీ సంక్షోభంలో పడేస్తోంది. తీవ్రమైన పర్యావరణ సంక్షోభాన్ని కార్పొరేటీకరణ తీసుకొస్తోంది.

దీనికి వ్యతిరేకంగా దండకారణ్య ప్రాంతంలో మావోయిస్టుల నాయకత్వంలో ఆదివాసులు అనేక పోరాటాలు చేస్తున్నారు. వాళ్లను అణచివేయడం కోసం అక్కడికి లక్షలాది సైనిక బలగాలను తరలించారు. 'మావోయిస్ట్ ముక్త భారత్'గా దేశాన్ని మార్చేసి కార్పొరేట్ల అభివృద్ధిని తీసుకురావాలనే కేంద్ర హోం మంత్రి అమిత్ షా విధానం వల్ల దేశంలో అత్యంత ప్రమాదకరమైన మార్పులు జరగడానికి అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో 'ఆపరేషన్ కగార్'కు వ్యతిరేకంగా, హిందుత్వ కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా 'ప్రజా సంఘాల ఐక్య వేదిక' ఏప్రిల్ 20, శనివారం ఒంగోలులోని ప్రెస్ క్లబ్‌లో సదస్సు నిర్వహిస్తోంది. ఇందులో వివిధ ప్రజాసంఘాల, పార్టీల నాయకులూ, రచయితలూ, ప్రజాస్వామిక వాదులూ ప్రసంగిస్తారు.

– ప్రజా సంఘాల ఐక్యవేదిక, ఒంగోలు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

కాపీ కొట్టిన మేనిఫెస్టోనే అంతా చెబుతోంది!

అభిప్రాయం



అడుసుమిల్లి జయప్రకాష్

తెలుగు దేశం పార్టీ కోసం పనిచేస్తున్న 'కన్సల్టెన్సీ' హెడ్ రాబిన్ శర్మ ''ఎన్నికల్లో టీడీపీ గెలుపు దుర్లభమనీ, తాము చేసిన ప్రయత్నాలు ఫలించడం లేదనీ, చంద్రబాబుకు ఏమాత్రం విశ్వసనీయత లేక పోవడమే అసలు సమస్య'' అనడం రేపు 'పోలింగ్ బూత్'లో తటస్థ ఓటరుపై గట్టి ప్రభావం చూపిస్తుంది. ఎందుకంటే, ఇది మరొక ప్రత్యర్థి రాజకీయ పార్టీ అంటున్న మాట కాదు. మన కోసం మనం 'ఫీజు' కట్టి పెట్టుకున్న 'సర్వీస్ ప్రొవైడర్' వ్యక్తం చేసిన నిస్సహాయత. ఇది ఎటువంటిది అంటే, మన 'ఫ్యామిలీ డాక్టర్'– ''మీ జబ్బును నేను తగ్గించలేకపోతున్నాను'' అని పెదవి విరవడం వంటిది. వాళ్ళు అటువంటి ముగింపుకు రావడానికి కారణం, ఆరు నెలల క్రితం 'మేనిఫెస్టో'లో నుంచి 'బాబు షూరిటీ – భవిష్యత్తు గ్యారెంటీ' పేరుతో 'సూపర్ సిక్స్' పథకాలు 'ట్రయిల్' కోసం విడుదల చేశారు. ఆ తర్వాత దానికి విస్తృతంగా ప్రచారం చేసినా ప్రజల నుండి స్పందన లేదు.

ఈ 'టీం' ఇటువంటి అభిప్రాయానికి రావడానికి ఇదే ప్రధాన కారణం అయింది. ఈ దశలో 'రిస్క్ మేనేజ్మెంట్' కోసం ప్రశాంత్ కిషోర్ తెరపైకి వచ్చి, తన ప్రకటనకు ముందూ వెనుకా ఎటువంటి వివరణ లేకుండా, 'ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలవదు' అని ఏకవాక్య ప్రకటన చేసి మళ్ళీ ఎక్కడా కనిపించకుండా నిష్క్రమించారు. ఈ ప్రకటన మనం నమ్మడం కోసం ముందుగా – 'ఈ ఎన్నికల్లో నేను టీడీపీ కోసం పనిచేయడం లేదు' అని ప్రకటించాక, 'వైఎస్సార్‌సీపీ గెలవదు' అన్నారు. ఇది జరిగాక కావొచ్చు, చివరి ప్రయత్నంగా ప్రశాంత్ కిషోర్– 'వదలొద్దు మరో ప్రయత్నం చేయండి' అని రాబిన్ శర్మ బృందానికి సూచించారు.

ఇప్పుడు టీడీపీ పూర్తి స్థాయిలో 'మేనిఫెస్టో' వెల్లడించిన తర్వాత కూడా అన్ని 'సర్వే' నివేదికలు జగన్‌కు అనుకూలంగా ఉన్నాయి. సరిగ్గా ఈ కాలంలోనే, చంద్రబాబు తన ప్రసంగాల్లో 'బ్యాలెన్స్' కోల్పోవడం మొదలయింది. సభకు వచ్చినవాళ్లను 'మీ ఊళ్లో గంజాయి దొరుకుతోందా' అని గుచ్చి గుచ్చి అడుగుతూ తనకు అనుకూలమైన సమాధానం పొందేందుకు ఇబ్బంది పెడుతున్నారు. ఎన్నికల్లో రాజకీయ ప్రత్యర్థిని సాధారణంగా శత్రువుగా చూడరు. జగన్ విషయంలో బాబు ఆ హద్దు ఎప్పుడో దాటారు.

ఎప్పుడైనా ఎన్నికల 'నోటిఫికేషన్' అంటే చంద్రబాబుకు ఆయన పార్టీ అభ్యర్థులకు అది 'టెండర్ నోటీస్' వంటిది.



అందుకే ఎన్నికల సమయానికి ఆర్థిక నేరస్థులూ, 'ఎన్నారై'లూ అ పార్టీలో అభ్యర్థులుగా ఉంటారు. వీరి వద్ద నుంచి నిధులను సమీకరించి ముందుగా వాటిని తన నేలమాళిగలో దాచి, అప్పుడు తన పార్టీ 'మేనిఫెస్టో' అంటూ బాబు ప్రజల ముందు 'టెండర్' దాఖలు చేస్తారు. గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేస్తే, ఐదేళ్ళ సంపాదన ముందుగా దాచిన దానికి అదనం. ప్రతి ఎన్నికలో బాబుది ఇదే 'ఫార్ములా'. అందుకే, ప్రతిపక్ష నాయకుడిగా బాబు ఎలాగోలా నెట్టుకుంటూ తన పార్టీ ఉనికిని ఎన్నికల వరకు దొర్లించి, చివరిలో ఎవరో కొందరి మద్దతు తీసుకుని; మళ్ళీ తన టోపీని ఎన్నికల 'ఎరీనా'లోకి విసురుతారు. గెలిస్తే, 'డబల్ బెనిఫిట్'; ఓడిపోతే, 'సింగిల్ బెనిఫిట్'. బాబుకు ఎన్నికలు అంటే, ఇంత 'సింపుల్'.

అందుకే గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను తప్పు పట్టిన బాబు, ఎన్నికల ముందు 'సూపర్ సిక్స్' అంటూ అరువు తెచ్చుకున్న అంశాలతో 'కిచిడీ' మేనిఫెస్టో' ప్రకటించారు. అందులోని అంశాలు: టీడీపీ అధికారంలోకి వస్తే 'మహా శక్తి' పథకం ద్వారా ప్రతి కుటుంబంలో 18 ఏళ్లు నిండిన మహిళలకు 'స్త్రీనిధి' కింద నెలకు 1500 రూపాయలు, 'తల్లికి వందనం' పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే.. వారందరికీ ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.15 వేలు చొప్పున, 'దీపం' పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్ల సరఫరా చేయడం, స్థానిక బస్సుల్లో మహిళలందరికీ టికెట్టులేని ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు.

జగన్ సంక్షేమ పథకాలను తప్పు పట్టి, మళ్ళీ వాటినే పేర్లు మార్చి అమలుచేస్తాననే ఈ 'యూటర్న్' ఏమిటి? అనే ప్రశ్నకు జవాబు మనం మూడు చోట్ల వెతకాలి. మొదటిది అమరావతి. బాబును నమ్మి అక్కడ భూములు కొన్న 'ఎన్నారై'లకు ఈ ఎన్నికల్లో బాబు గెలుపు అవసరం. అది వారికి జీవన్మరణ సమస్య. అందుకే వాళ్ళు స్వయంగా నెల ముందుగా ఇండియా వచ్చి టీడీపీ కోసం ఇక్కడ ప్రచారం చేసే పనిలో ఉన్నారు. రెండవది – 'మార్గదర్శి' రామోజీరావు భవిష్యత్తు. మూడవది – పై రెండింటి కంటే సంక్లిష్టమైన కొడుకు లోకేష్ చుట్టూ అల్లుకుని ఉన్న కుటుంబ చట్రంలో నుంచి బాబు క్షేమంగా బయటపడటం. బయట నుంచి దీన్ని చూస్తున్న మనకే వీటికి పరిష్కారం ఉందని అనిపించడం లేదు. ఇంకా మనకు తెలియనివి ఎన్ని ఉన్నాయో వాటి సంగతి ఏమిటో... మరో నెల రోజులు కాలం తర్వాత తెలుస్తుంది.

వ్యాసకర్త మాజీ శాసన సభ్యులు
మొబైల్: 98481 28844

నమ్మకమే ప్రాణం

ఆత్మవిశ్వాసం, దేవుడి మీద నమ్మకం అనే రెండూ మానవ జీవితానికి ముఖ్యమైనవి. ఆత్మవిశ్వాసం దేహం లాంటిది. దేవుడి మీది నమ్మకం ప్రాణం వంటిది. చుట్టూ చీకటి అలుముకున్నా ఎదలో మాత్రం నమ్మకమనే వెలుగు ఉండాలి. అది మసక బారకుండా చూసుకోవాలి. ఆత్మవిశ్వాసం లేకుండా పురోగమించడం అసాధ్యం. అయితే ఇక్కడో చిక్కు ఉంది. ఆత్మవిశ్వాసం అహంకారంగా మారకుండా జాగ్రత్త పడాలి. అది గానీ తొంగి చూసిందో అంతే సంగతులు. భగవంతుడిని తెలుసుకోలేని విధంగా ఆత్మను అహంకారం అడ్డుకుంటుందనేది పెద్దల మాట.



జ్యోతిర్మయం

ఆత్మవిశ్వాసం కూడా ఒక విధమైన దేవుడి మీది నమ్మకం లాంటిదే. అది అర్థం చేసుకుంటే ప్రపంచాన్ని జయించవచ్చు. 'నాలో ఉన్న జీవశక్తి నన్ను నడిపిస్తోంది. నా మనోశక్తి విజయాన్ని ఇస్తోంది' అనే ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి. పరాశక్తి ప్రతిరూపాలే జీవశక్తి, మనోశక్తులు. అందుకే ఆత్మవిశ్వాసం కూడా దేవుడిమీది నమ్మకం వంటిదే అనేది. అసలు మనకెదురయ్యే కష్టాలకు కారణం మన కల్పనలూ, కలలూ. నిజానికి మనకూ వాటికీ సంబంధమే ఉండదు. అనవసరమైన చోట అనవసరంగా మనల్ని సమస్యలోకి ప్రవేశింపచేసి మనకు మనమే కష్టాలను కొనితెచ్చుకునేలా అవి భ్రమింపచేస్తాయి. కాస్తంత అప్రమత్తంగా ఉంటే చైతన్యవంతులై ప్రశాంతంగా ఉండొచ్చు.

ఈనాడు తమంతట తాము ధ్యానం చేయలేకుంటే అది అలవరచుకోవడానికి అనేక ధ్యాన కేంద్రాలు ఉండనే ఉన్నాయి. అయితే ఇక్కడ కూడా ఓ చిక్కు లేకపోలేదు. ఏ స్థాయి వరకూ అవి మనకు ఉపయోగపడతాయి అనే విషయంలో స్పష్టత ఉండాలి. మనకు వుండు లేని పక్షంలో మన మీద ఒకరు ఎంత ఉప్పు కుమ్మరించినా మనకేమీ మండదు అనేది నిజం. హృదయాన్ని విశాలపరచుకోవాలి. ప్రాణాయామం చేయాలి. నవ్వుల పువ్వులను పెదవులపై పూయనివ్వాలి. ఒత్తిడిని అధిగమించాలి. ఆత్మవిశ్వాసంతో, దైవంపై నమ్మకంతో జీవిత పయనాన్ని విజయవంతం చేసుకోవాలి.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.ద్వాదశి రా.10.45 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** పుబ్బ ప.2.25 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** రా.10.24 నుండి 12.11 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.44 నుండి 7.23 వరకు, **అమృతఘడియలు:** ఉ.7.22 నుండి 9.07 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.45, **సూర్యాస్తమయం:** 6.12.



కాకినాడ జిల్లా అచ్చంపేట జంక్షన్ వద్ద నిర్వహించిన మేమంతా సిద్ధం సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం



సిద్ధం సభలో ప్రసంగిస్తున్న సీఎం జగన్

బాబు గురి గులకరాయిపైనే!

కాకినాడ జిల్లా అచ్చంపేట జంక్షన్‌లో మేమంతా సిద్ధం సభలో సీఎం జగన్ ధ్వజం

- ఫ్యాన్‌కు రెండు ఓట్లు వేస్తేనే పథకాలన్నీ కొనసాగుతాయి
- లేదంటే మళ్లీ కత్తిరింపులు.. అన్నీ ముగింపులే
- మీ బిడ్డ ఒక్కడు.. నక్కలు, తోడేళ్లు మాత్రం అనేకం
- చంద్రబాబు తన చంకలో పిల్లిని పిఠాపురంలో వదిలాడు
- ప్యాకేజీ స్టార్ ఎక్కడ నిలబడాలో నిర్ణయిస్తే కుదిరిన పొత్తులవి
- జగన్‌ను తిట్టు అంటే తిట్టు.. కొట్టు అంటే కొట్టు.. అన్నిటికీ జీ హుజూర్!
- కులాన్ని హోల్‌సేల్‌గా బాబుకు అమ్మేయగలననే భ్రమతో ప్యాకేజీ రాజకీయాలు
- 30 ఏళ్లుగా ఏ పార్టీలో ఉన్నా బాబు కోవర్టుగానే వదినమ్మ
- బీఫామ్ బీజేపీదైనా, కాంగ్రెస్‌దైనా, టీ గ్లాస్‌దైనా యూనిఫామ్ మాత్రం బాబుదే

నగారా కూడా మోగింది. ఇంటింటి ఆత్మగౌరవాన్ని, పేదలు, అక్కచెల్లెమ్మల ఆత్మగౌరవాన్ని కాపాడుతున్న మనందరి ప్రభుత్వానికి మద్దతు పలికేందుకు మీరంతా సిద్ధమేనా? జన్మభూమి కమిటీల నుంచి చంద్రబాబు దాకా పెత్తందార్ల దోపిడీకి, మనందరి పేదల పక్షపాత ప్రభుత్వానికి మధ్య ఈరోజు క్లాస్‌వార్ జరుగుతోంది. చంద్రబాబు సుదీర్ఘకాలం అధికారంలో ఉన్నా ఆయన పేరు చెబితే గుర్తుకొచ్చే మంచి పనిగానీ, పథకాలుగానీ ఒక్కటీ లేవు కాబట్టే నాపై వేయించటానికి బాబుకు, ఆయన కూటమికి చివరకు గులక రాళ్లే మిగిలాయి. ఈ యుద్ధంలో ఆ పేదల వ్యతిరేక కూటమిని చిత్తుగా ఓడించేందుకు మీరంతా సిద్ధమేనా? మరోసారి జైత్రయాత్రకు సింహగర్జనతో సిద్ధం కావాలి. ఫ్యాన్‌కు రెండు ఓట్లు వేసి రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకుందాం''అని ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కాకినాడ జిల్లా అచ్చంపేట జంక్షన్‌లో నిర్వహించిన 'మేమంతా సిద్ధం'బహిరంగ సభలో అశేష జనసందోహాన్ని ఉద్దేశించి సీఎం జగన్ ప్రసంగించారు.

పసుపుపతి నిద్ర లేస్తాడు.. జాగ్రత్త!

అభిమాన సముద్రంగా మారిన వరద గోదావరి ఇవాళ ఇక్కడ కనిపిస్తోంది. ఐదేళ్లుగా మనందరి ఈరోజు మీ అందరిలో కనిపిస్తోంది. ఈ ఎన్నికలు కేవలం ఎమ్మెల్యేలు, ఎంపీలను ఎన్నుకునేవి కాదు. రాబోయే ఐదేళ్లు.. అంటే 1,825 రోజులు.. రాబోయే 60 నెలల పాటు మన బతుకులు ఎలా ఉంటాయి? అనేది నిర్ణయించే మన ఓటు ద్వారా ప్రభుత్వాన్ని ఎన్నుకుంటాం. మీకు ఈరోజు జగన్ ద్వారా అందుతున్న పథకాలు ఇక మీదట కూడా అందాలా? లేక అవి రద్దు కావడం అన్నది మీ ఓటు పైనే ఆధారపడి ఉంటుందని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. జగన్‌కు ఓటు వేస్తే.. ఫ్యాన్‌పై రెండు ఓట్లు వేస్తే పథకాలన్నీ కూడా కొనసాగుతాయి. మాన, పట్టణాల్లో సేవలందిస్తున్న జగన్ మార్కు సచివాలయాలన్నీ కొనసాగుతాయి. లేదంటే సచివాలయాల సేవలకు బాబు మార్కు కత్తిరింపులు, ముగింపు తథ్యం. పొరపాటున చంద్రబాబుకు ఓటు వేస్తే మళ్లీ చంద్రముఖి నిద్ర లేస్తుంది. మళ్లీ పసుపుపతి నిద్ర లేస్తాడు! వదల బొమ్మాళీ.. వదల.. అంటూ మళ్లీ ఐదేళ్లు మీ రక్తం తాగేందుకు ప్రతి ఇంటికీ వస్తాడు. జాగ్రత్త సుమా..!

గతంలో నాకు ఓట్లేయని వారూ ఆలోచించండి..

పొదుపు సంఘాల మహిళలకు బాబు చేసిన ... డి. ఒకటికి పదిసార్లు ఆలోచన చేయండి. ఎవరివల్ల మంచి జరిగింది? ఎవరు ఉంటే మీ ఇంటికి మంచి జరుగుతుందనే ఆలోచనతో ఓటు వేయాలని కోరుతున్నా. కులం కారణం కావచ్చు.. ఎప్పటి నుంచో ఆ పార్టీలో ఉన్నామనే కారణం కావచ్చు.. లేదా ఇతర కారణాలు కావచ్చు.. ఆ అన్నదమ్ములను, అక్కచెల్లెమ్మలను, అవ్వాతాతలను కూడా అడుగుతున్నా. గత ఎన్నికల్లో మీరు నాకు ఓటు వేయకపోయినా ఈ ఐదేళ్లలో మంచి చేసిన ప్రభుత్వం మనది కాదా? అని ఒక్కసారి ఆలోచన చేయమని కోరుతున్నా. మీ ఇంటికి వచ్చిన పసుపు నాయకులు, క్లాస్ నాయకులు అబద్ధాలు చెప్పవచ్చుగానీ మీ కుటుంబానికి, మీ బ్యాంకు ఖాతాల్లోకి గత 58 నెలల పాలనలో జమ అయిన, చేతికి అందిన పథకాల డబ్బులు మీకు నిజాలే చెబుతాయి. ఎవరి పాలనలో మీకు మంచి జరిగిందో ఆలోచన చేసి నిర్ణయం తీసుకోండి.

బాబు సిట్ అంటే సిట్.. స్టాండ్ అంటే స్టాండ్!

ఇంటింటికీ మంచి చేశాడు కాబట్టి ఈ ఎన్నికల యుద్ధానికి మీ బిడ్డ ఒంటరిగా బయల్దేరాడు. అందరినీ మోసం చేశారు కాబట్టి, చెప్పుకునేందుకే ఏ మంచిపనీ లేదు కాబట్టి వారంతా కూటమిగా ఏకమయ్యారు. మిగతా పార్టీల్లోకి చంద్రబాబు తన మనుషులను పంపితే ఏర్పడిన కూటమి అది. చివరికి ఆ ప్యాకేజీ స్టార్ ఎక్కడ నిలబడాలో కూడా బాబు నిర్ణయిస్తేనే కుదిరిన పొత్తులవి. ఆ ప్యాకేజీ స్టార్‌ను భీమవరం.. గాజువాక.. పిఠాపురం.. ఇలా ఎక్కడ నిలబెడితే బాబుకు ప్రయోజనం కలుగుతుందనుకుంటే అక్కడ నిలబెట్టిన పరిస్థితి! ఇక బాబు సిట్ అంటే సిట్.. స్టాండ్ అంటే స్టాండ్! జగన్‌ను తిట్టు అంటే తిట్టు..! కొట్టు అంటే కొట్టు..! దత్తపుత్రా నీకిచ్చేది 80 కాదు.. 20 అంటే అందుకు కూడా జీ హుజూర్! ఇదీ ప్యాకేజీ స్టార్ పరిస్థితి!

కులాన్ని హోల్‌సేల్‌గా అమ్మేయగలననే భ్రమతో..

రాష్ట్రాన్ని హోల్‌సేల్‌గా దోచుకునేందుకు, పంచుకునేందుకు చంద్రబాబు రాజకీయాలు చేస్తుంటే.. కులాన్ని హోల్‌సేల్‌గా బాబుకు అమ్మేయగలననే భ్రమతో ప్యాకేజీ స్టార్ రాజకీయం చేస్తున్నాడు. ఈ ప్యాకేజీ స్టార్‌కు మన రాష్ట్రం అంటే ఎంత చులకన అంటే.. జ్వరం వస్తే పిఠాపురం వదిలి హైదరాబాద్ వెళ్తాడు. ఏ ప్రాంతమన్నా ప్రేమ ఉండదు ఈ మ్యారేజీ స్టార్‌కు. ఏ భార్య అయినా ప్రేమ ఉండదు! పెళ్లిళ్లే కాదు.. నియోజకవర్గాలు కూడా మార్చేశాడు. వెనుకటికి ఒకడు పెళ్లికి పిఠాపురం వెళ్తూ పిల్లిని చంకన బెట్టుకెళ్లాడట! ఆ పిల్లిని చంకన బెట్టుకెళ్లింది ఎవరో ఇంతకాలం ఎవరికీ అర్థం కాలేదు. చంద్రబాబు తన చంకలో ఉన్న పిల్లిని పిఠాపురంలో వదిలినట్లు ఇప్పుడు అర్థమైంది. ఇదీ గాజు గ్లాస్ పార్టీ పరిస్థితి. ఈ గ్లాస్‌తో గటగట తాగేది బాబు.. దాన్ని తోమి, తుడిచి మళ్లీ బాబుకు అందించేది మాత్రం.. ఈ ప్యాకేజీ స్టార్!

బాబు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్‌తో.. బీజేపీలోకి వదినమ్మ

ఈ కూటమిలో వదినమ్మ బాబు చేరమంటే కాంగ్రెస్‌లో చేరింది. ఇదే బాబు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ ఇచ్చిన వెంటనే బీజేపీలో చేరారు. బాబు పొడవమంటే సొంత తండ్రికే వెన్నుపోటు పొడిచేసింది! 30 ఏళ్లుగా ఏ పార్టీలో ఉన్నా.. బాబు కోవర్టుగా అదే పనిలో ఉంది. బీజేపీలో ఉన్నా బాబు ఎవరికి సీటు ఇవ్వమంటే వారికే ఇస్తారు. చంద్రబాబు ప్యాకేజీలు, ప్రలోభాలు ఏ స్థాయిలో ఉంటాయంటే.. బీఫామ్ బీజేపీదైనా, కాంగ్రెస్‌దైనా, టీ గ్లాస్‌దైనా యూనిఫామ్ మాత్రం అంతా చంద్రబాబుదే!

బాబుకు మిగిలింది గులక రాళ్లే...

చంద్రబాబు మేనిఫెస్టో ఎన్నికలు ముగిసేదాకా రంగురంగుల స్వప్నాలను చూపిస్తుంది. ఆ తరువాత చెత్తబుట్టలో మినహా ఎక్కడా కనిపించదు. ఎన్నికల తరువాత మోసాలు చేయడం చంద్రబాబు నైజం! ఆయన పాలనలో చరిత్రలో నిలిచిపోయే మైలు రాళ్లు ఏవీ లేవు. మంచి వ్యవస్థలు గానీ, పథకాలు గానీ, ప్రజలకు చేసిన మంచిగానీ ఒక్కటీ లేవు. మూడుసార్లు ముఖ్యమంత్రిగా 14 ఏళ్ల అధికారంలో ఉన్నా ఆయన పేరు చెబితే గుర్తుకొచ్చే మంచి పనిగానీ, పథకాలుగానీ ఒక్కటీ లేవు. కాబట్టే నాపై వేయించటానికి చంద్రబాబుకు, ఆయన కూటమికి చివరకు గులక రాళ్లే మిగిలాయి.

హ్యాపీ బర్త్ డే అమ్మ

మాతృమూర్తి విజయమ్మకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం జగన్

సాక్షి, అమరావతి: తన మాతృమూర్తి వైఎస్ విజయమ్మ పుట్టినరోజు సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. వైఎస్ విజయమ్మతో కలిసి ఉన్న ఫొటోతో పాటు 'హ్యాపీ బర్త్ డే అమ్మ' అని సీఎం జగన్ ట్వీట్ చేశారు.

రాష్ట్రీయం

నేడు ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ దినం

43 ఏళ్లకు అమరవీరులను గుర్తించిన ప్రభుత్వం... ఉమ్మడి జిల్లా నుంచి తరలిరానున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి (ఆదిలాబాద్ జిల్లా): జల్..జంగల్..జమీన్ నినాదంతో ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో 1981 ఏప్రిల్ 20న ఉద్యమం చేసిన అడవి బిడ్డలపై అప్పటి ప్రభుత్వం తుపాకీ ఎక్కుపెట్టింది. పోలీసు కాల్పుల్లో 15మంది ఆదివాసీలు అమరులయ్యారు. ఇంద్రవెల్లి ఘటనకు 43ఏళ్లు పూర్తైన సందర్భంగా నేడు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించేందుకు ఆదివాసీలు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తొలిసారిగా అమరవీరుల స్తూపం వద్ద స్మృతివనం ఏర్పాటుకు నిధులతో పాటు నాటి అమరవీరులను గుర్తించి బాధిత కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. దీంతో ఈసారి అమరవీరుల కుటుంబాలు సైతం తరలిరానున్నారు. ఆదిలాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఉమ్మడి జిల్లా ఆదివాసీలు తరలివచ్చి అమరవీరులకు నివాళులర్పించనున్నారు. ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

బతుకమ్మ బకాయిలు రూ.50 కోట్లు విడుదల

సిరిసిల్ల: సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారులకు రావాల్సిన రూ.50 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. ఈమేరకు టెస్కోకు నిధులు జమయ్యాయి. సిరిసిల్ల నేతన్నలకు రూ.275 కోట్లు బకాయిలు ఉండగా ప్రభుత్వం రూ.50 కోట్లు విడుదల చేయడం విశేషం. టెస్కో ద్వారా వస్త్రోత్పత్తి చేసిన ఆసాములకు నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని మార్గదర్శకాలు జారీ అయ్యాయి. 45 రోజులుగా బతుకమ్మ బకాయిలు విడుదల చేయాలని సిరిసిల్లలో నేతన్నలు ఆందోళనలు చేసిన నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయడంతో నేతన్నలకు ఊరటనిచ్చినట్లు అయింది.

ఎన్నికలప్పుడే కిషన్‌రెడ్డికి ప్రజలు గుర్తొస్తారు: రావుల

సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తొస్తారని, ఓటమి భయంతోనే నివేదికల పేరిట పత్రాన్ని విడుదల చేశారని బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆయన శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కిషన్‌రెడ్డి ఎన్ని నివేదికలిచ్చినా.. ఆయన అసలైన నివేదిక ప్రజల దగ్గర ఉందని స్పష్టం చేశారు.



దుబ్బాక మార్కెట్ యార్డులో భారీ వర్షానికి తడిసిన ధాన్యం



యాదాద్రి జిల్లా సింగారంలో నేలరాలిన మామిడికాయలు

నేలవాలిన వరి.. కొట్టుకుపోయిన ధాన్యం

- రైతన్నను దెబ్బతీసిన అకాల వర్షం
- మామిడితోటలకూ అపార నష్టం
- రంగారెడ్డి జిల్లాలో పిడుగుపాటుకు రైతు బలి

సాక్షి, నెట్‌వర్క్: అకాల వర్షం రైతన్నకు తీరని నష్టం కలిగించింది. శుక్రవారం సాయంత్రం గంటపాటు దంచికొట్టిన భారీ వర్షంతో మార్కెట్ యార్డుల్లో, కల్లాల్లో ఆరబోసిన ధాన్యం రాశులు తడిసిపోయాయి. కొన్నిచోట్ల కోతకొచ్చిన వరి నేలవాలింది. రంగారెడ్డి జిల్లాలో పిడుగుపాటుకు రైతు దుర్మరణం పాలయ్యాడు. ఉమ్మడి నిజామాబాద్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో బలమైన ఈదురుగాలులు వీయడంతో ధాన్యం కుప్పలపై కప్పిన పట్టాలు ఎగిరిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం వానకు తడిసిపోయింది. కొన్నిచోట్ల ధాన్యం కొట్టుకుపోవడంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. చాలాచోట్ల కోతకొచ్చిన వరి నేలవాలింది. వడగళ్ల వానతో ఒక్క ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనే వెయ్యి ఎకరాల్లో వరిపంట దెబ్బతింది.

రాలిపోయిన మామిడికాయలు: ఈదురుగాలుల దెబ్బకు యాదాద్రి జిల్లాలోని 20 ఎకరాల్లో మామిడికాయలు రాలిపోయాయి. నిజామాబాద్, సిద్దిపేట జిల్లాల్లోనూ మామిడి రైతులు నష్టపోయారు. పలుచోట్ల ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపడ్డాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి.

పిడుగుపాటుతో రైతు మృతి



నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలో పిడుగులు బీభత్సం సృష్టించాయి. రంగారెడ్డి జిల్లా తుమ్మలూరు గ్రామానికి చెందిన మారమోని జంగయ్యయాదవ్ (42) పొలం పనుల్లో ఉండగా, ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. జంగయ్య నిల్చున్న చోట భారీ శబ్దంతో పిడుగుపడింది. దాంతో ఆయన అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కుద్వాన్‌పూర్‌లో పిడుగుపాటుకు మూడు గేదెలు మృతి చెందాయి.



సాగర్ ప్రాజెక్టు దిగువన ఎండిపోయిన కృష్ణానది

సాగర్ ప్రాజెక్టు దిగువన ఎండిన కృష్ణా

గత పదేళ్లలో ఏనాడూ ఎండిపోయిన పరిస్థితి లేదు


నాగార్జునసాగర్: సాగర్ ప్రాజెక్టు దిగువన గల కృష్ణానది ఎండి పోయింది. అడవిదేవులపల్లి దగ్గర టెయిల్‌పాండ్ నిర్మాణం పూర్తైన తర్వాత కృష్ణానదిలో సాగర్ ప్రాజెక్టుకు అనుకుని నీటి నిల్వలు ఉండేవి. టెయిల్‌పాండ్ 7టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉంటుంది. విద్యుత్ అత్యవసర అవసరాలు ఏర్పడిన సమయంలో నాగార్జునసాగర్ నుంచి ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా దిగువకు (టర్బైన్ల ద్వారా)నీటిని వదులుతూ విద్యుదుత్పత్తి చేస్తారు. విద్యుత్ అవసరంలేని సమయంలో.. దిగువకు వదిలిన నీటిని విద్యుదుత్పాదన చేసిన (టర్బైన్‌లు పంప్‌మోడ్‌లోకి మారుతాయి) ఆ పంప్‌ల ద్వారానే జలాశయంలోకి నీటిని ఎత్తిపోసే ప్రక్రియ నిర్వహిస్తారు. ఒక టీఎంసీ మాత్రమే ఎత్తిపోసుకునేందుకు వీలుంటుంది. టెయిల్‌పాండ్‌లో ఎల్లప్పుడూ 6టీఎంసీల నీరు నిల్వ ఉంటుంది.

పదేళ్లలో ఎండిపోయింది ఇప్పుడే...

టెయిల్‌పాండ్ నిర్మాణం పూర్తైన తర్వాత గత పదేళ్లలో ఏనాడూ నది ఎండిపోలేదు. ఈ నెల 15న టెయిల్‌పాండ్ నుంచి దిగువకు 4టీఎంసీల నీటిని విడుదల చేయడంతో నదిలో నీరు లేకుండా పోయింది. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు టెయిల్‌పాండ్ 21 కిలోమీటర్ల దూరంలో ఉంది. సాగర్ దిగువన సుమారు పది కిలోమీటర్ల మేర కృష్ణానది ఎండిపోయింది.

డీఆర్‌డీఏ-ఐకేపీ ఉద్యోగులకు ఊరట

వారిపై ఎన్నికల సంఘం సస్పెన్షన్‌ను ఎత్తివేసిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని సస్పెండ్ చేసిన సిద్దిపేట జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ-ఇందిరా క్రాంతి పథం (డీఆర్‌డీఏ-ఐకేపీ) ఉద్యోగుల్లో పిటిషనర్లు 10 మందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సిద్దిపేట జిల్లాకు చెందిన 106 మంది ఐకేపీ ఉద్యోగులు ఏప్రిల్ 7న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్నారని అభియోగాలు రావడంతో జిల్లా కలెక్టర్ వారిని మరుసటి రోజు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. 'పిటిషనర్లను సస్పెండ్ చేయడానికి జిల్లా ఎన్నికల అధికారి, సిద్దిపేట కలెక్టర్‌కు ఎలాంటి అధికారం లేదు. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 129, 134లోని, సివిల్ సర్వెంట్ల ప్రవర్తనా నియమాలు 1964లోని నిబంధనలు పిటిషనర్లకు వర్తించవు. జిల్లా ఎన్నికల అధికారి ప్రకటించిన సస్పెన్షన్ ఉత్తర్వులను రద్దు చేసేలా ఆదేశాలు జారీ చేయాలి'అని సిద్దిపేట జిల్లా పుల్లూరుకు చెందిన శ్రీనివాస్‌తో పాటు మరో 9 మంది రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ పుల్లా కార్తీక్ శుక్రవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషర్లు 10 మందిని విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించారు.

మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కు 1ప్లస్1 భద్రత

సాక్షి, హైదరాబాద్: వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుతం వరంగల్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆరూరి రమేశ్‌కు 1ప్లస్1 పోలీస్ భద్రత కల్పించాలని డీజీపీ, వరంగల్ పోలీస్ కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. 2ప్లస్2 గన్‌మెన్లతో తనకు రక్షణ కల్పించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వర్ధన్నపేట నుంచి రెండుసార్లు శాసనసభ్యుడిగా విజయం సాధించానని, అసెంబ్లీ ఎన్నికల వరకు 3ప్లస్3 గన్‌మెన్ల భద్రత కల్పించారని పేర్కొన్నారు. ఫలితాల తర్వాత ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే తనకున్న 3ప్లస్3 గన్‌మెన్లను ప్రభుత్వం తొలగించిందని వివరించారు. త్వరలో లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నందున జిల్లావ్యాప్తంగా తిరగాల్సిన అవసరం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని 2ప్లస్2 గన్‌మెన్ల భద్రత కల్పించేలా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. 1ప్లస్1 పోలీస్ భద్రత కల్పించాలని ఆదేశించారు.

నేడు టీ-సాట్ ముఖాముఖిలో మహేశ్ భగవత్

సాక్షి, హైదరాబాద్: సివిల్స్‌కు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు మెంటారుగా పేరుపొందిన సీనియర్ ఐపీఎస్ అధికారి, రైల్వే, రోడ్డు భద్రత అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ శనివారం టి-సాట్ ముఖాముఖి (టీ.సాట్-సాఫ్ట్ నెట్) కార్యక్రమంలో పాల్గొంటారని టీ-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయనతో పాటు ఇటీవల ప్రకటించిన సివిల్స్ ఫలితాల్లో 50వ ర్యాంకు సాధించిన జాహ్నవి కూడా స్టూడియోలో అందుబాటులో ఉంటారని వెల్లడించారు. అభ్యర్థులు తమ సందేహాలను టీ-సాట్ నిపుణ చానల్‌లో శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమయ్యే లైవ్ చర్చలో నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న వారు 040-23540326,726 టోల్ ఫ్రీ నంబర్లు, 1800 425 4039 నంబర్లకు ఫోన్ చేయాలని వేణుగోపాల్ రెడ్డి కోరారు.

బతికుండగానే సమాధి నిర్మాణం

కాజీపేట: ఎవరికెవరు ఈలోకంలో ఎవరికి ఎరుక.. అన్నాడొక కవి. అందుకేనేమో.. ఒక వ్యక్తి బతికి ఉండగానే తన సమాధిని నిర్మించుకుంటున్నాడు. హనుమకొండ జిల్లా కాజీపేట అంబేడ్కర్ నగర్ కాలనీకి చెందిన బీఆర్ఎస్ నేత సిరిపాక కుమార్ (57)కు ఇద్దరు కుమారులు ఉన్నారు. తాను చనిపోయాక పిల్లలు సమాధి నిర్మిస్తారో లేదోనన్న ఆలోచనతో.. బతికి ఉండగానే సమాధిని నిర్మించుకుంటున్నాడు. స్థానిక ఆర్‌ఆర్ నగర్ కాలనీలోని హిందూ శ్మశానవాటికలో సమాధి నిర్మాణాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.



సిరిపాక కుమార్



నిర్మాణంలో ఉన్న సమాధి

దుమ్ము రేపుతున్న సోషల్ మీడియా

ఎన్నికల్లో నెట్టింట పార్టీల హోరాహోరీ


ఎక్స్, యూట్యూబ్, ఇన్‌స్టాల్లో బీజేపీ, మోదీ హవా


నయా యూజర్లను పెంచుకుంటున్న రాహుల్, కేజ్రీవాల్

ఇన్‌స్టా, యూట్యూబ్‌లో ఆప్, కాంగ్రెస్‌కు భారీగా లైకులు

కుక్కపిల్ల.. అగ్గిపుల్ల.. సబ్బుబిళ్ల.. కాదేదీ సోషల్ మీడియా ప్రచారానికనర్హం! జనాలంతా ఆ స్థాయిలో 'సోషల్' జీవులుగా మారిపోయారు. అందుకే ఎన్నికల పోరులో పార్టీలు కూడా సోషల్ మీడియానే ఎక్కువగా నమ్ముకుంటున్నాయి. ప్రజల మూడ్‌తో పాటు క్షేత్రస్థాయిలో ఓటర్ల నాడిని పసిగట్టేందుకు 'లైక్ చేయండి.. షేర్ చేయండి.. సబ్‌స్క్రయిబ్ చేసుకోండి' అంటూ నెట్టింట్లో హల్‌చల్ చేస్తున్నాయి. ఎడాపెడా యాడ్‌లు కుమ్మరిస్తూ డిజిటల్ ప్రచారంతో హోరెత్తిస్తున్నాయి. పలు పార్టీలు లోక్‌సభ ఎన్నికల సీజన్‌లో సామాజిక మాధ్యమాలను షేక్ చేస్తున్నాయి..!

- సాక్షి, నేషనల్ డెస్క్





పదేళ్లుగా దేశాన్నేలుతున్న బీజేపీయే సోషల్ మీడియాలోనూ రాజ్యమేలుతోంది. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లో కొత్త యూజర్లను ఆకట్టుకోవడంలో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ ముందున్నాయి. ప్రస్తుత లోక్‌సభలో మూడో అతి పెద్ద పార్టీ అయిన తృణమూల్ కాంగ్రెస్‌కు పెద్దగా సోషల్ ప్రాతినిధ్యం లేకపోవడం విశేషం. నేతల విషయానికొస్తే ప్రధాని నరేంద్ర మోదీ తన రాజకీయ ప్రత్యర్థులెవరికీ అందనంత ఎత్తులో మూడు లైక్‌లు.. ఆరు షేర్‌లు అన్నట్టుగా 'సోషల్' జర్నీలో దూసుకుపోతున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు పార్టీలు, నేతల సోషల్ మీడియా పేజీలు/ఖాతాల్లో యూజర్ల సంఖ్య పెరుగుదల, డిజిటల్ యాడ్ వ్యయాలు తదితరాలను 'సోషల్ బ్లేడ్' అనే ఎనలిటిక్స్ సంస్థ విశ్లేషించింది. అందులో పలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి.

'ఎక్స్' ఫ్యాక్టర్!

సోషల్ సైట్ 'ఎక్స్' (గతంలో ట్విటర్)లో ప్రతి పార్టీ నిలకడగా యూజర్లను పెంచుకుంటూ వస్తోంది. బీజేపీ ఎక్స్ ఖాతాకు గత మూడు నెల్లలో 4 లక్షల పైచిలుకు యూజర్లు జై కొట్టారు. కాంగ్రెస్ 2.37 లక్షల కొత్త ఫాలోవర్లను సాధించింది. ఆప్‌కు 12,000 మంది నయా యూజర్లు దక్కారు. టీఎంసీని కొత్తగా ఫాలో అయిన వారి సంఖ్య 9,800. మైక్రో బ్లాగింగ్‌కు కీలక వేదికగా నిలుస్తున్న ఈ సోషల్ వేదికలో బీజేపీకి ఏకంగా 2.18 కోట్ల ఫాలోవర్లున్నారు! కాంగ్రెస్‌ను 1.04 కోట్లు, ఆప్‌ను 65 లక్షల ఎక్స్ యూజర్లు ఫాలో అవుతున్నారు. టీఎంసీ మాత్రం 6.9 లక్షలతో వెనకబడి ఉంది.

యూట్యూబ్‌లో 'ఆప్' షో

పార్టీల ప్రసంగాలు, ప్రచార వీడియోలు, మీడియా సమావేశాలకు కీలక వేదికగా నిలుస్తున్న యూట్యూబ్‌లో ఆప్ 'చీపురు' తిరగేస్తోంది. కొత్త సబ్‌స్క్రయిబర్లను పెంచుకోవడంలో ఆప్‌తో పాటు కాంగ్రెస్ కూడా ముందుండగా బీజేపీకి మాత్రం క్రమంగా తగ్గుముఖం పట్టారు. గత మూడు నెలల్లో కేజ్రీవాల్ పార్టీ ఏకంగా 5.9 లక్షల కొత్త యూజర్లను దక్కించుకుంది. లిక్కర్ స్కాం ఆరోపణలతో మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేయడం తెలిసిందే. ఒక్క మార్చిలోనే ఆప్ యూట్యూబ్ చానల్‌ను ఏకంగా 3.6 లక్షల మంది సబ్‌స్క్రయిబ్ చేసుకున్నారు! బీజేపీ మాత్రం జనవరిలో 3 లక్షలకు పైగా కొత్త యూజర్లు జతయినా ఫిబ్రవరి, మార్చిల్లో భారీగా తగ్గారు. మొత్తమ్మీద 3 నెలల్లో బీజేపీ చానల్‌కు 5.3 లక్షలు, కాంగ్రెస్‌క 5 లక్షల మంది కొత్త యూజర్లు చేరారు. టీఎంసీ 28,000 మంది యూజర్లను సంపాదించింది. అయితే బీజేపీ వీడియోలను చూస్తున్న వారి సంఖ్య మాత్రం భారీగా పెరిగింది. జనవరి–మార్చి మధ్య ఏకంగా 43.2 కోట్ల వీక్షణలు దక్కాయి. తర్వాతి స్థానంలో ఆప్ (30.78 కోట్లు), కాంగ్రెస్ (16.69 కోట్లు), టీఎంసీ (93 లక్షలు) ఉన్నాయి. 59.9 లక్షల సబ్‌స్క్రయిబర్లు, 10 వేలకు పైగా వీడియోలతో యూట్యూబ్‌ను ఆప్ ఊడ్చేస్తోంది. బీజేపీ యూట్యూబ్ చానల్ 58.2 లక్షల సబ్‌స్క్రయిబర్లు, 41 వేల వీడియోలతో 'టాప్' లేపుతోంది. కాంగ్రెస్‌కు 44.8 లక్షలు, తృణమూల్‌ను 5.91 లక్షల మంది సబ్‌స్క్రయిబ్ చేసుకున్నారు.

ఎదురులేని మోదీ...

సోషల్ మీడియా వేదికేదైనా దేశంలోనే గాక ప్రపంచంలోనే తిరుగులేని నాయకునిగా మోదీ దుమ్మురేపుతున్నారు. భారత్‌లో ఏ నాయకుడూ ఆయన దరిదాపుల్లో కూడా లేరు! గత మూడు నెలల్లో మోదీ 'ఎక్స్' యూజర్ల సంఖ్య 26 లక్షలు పెరిగి 9.73 కోట్లకు చేరింది. కేజ్రీవాల్‌ను ఫాలో అవుతున్న వారి సంఖ్య లక్ష పెరిగి 2.74 కోట్లుగా ఉంది. రాహుల్‌గాంధీకి కొత్తగా 5 లక్షల మంది జతయ్యారు. ఆయన యూజర్ల సంఖ్య 2.54 కోట్లకు పెరిగింది. తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీకి స్వల్పంగా 52,000 మంది యూజర్లు దక్కారు. ఎక్స్‌లో ఆమెను 74 లక్షల మంది ఫాలో అవుతున్నారు. ఇక ఎక్స్‌లో అత్యంత యాక్టివ్‌గా ఉండే రాజకీయవేత్తగా కూడా మోదీ నిలుస్తున్నారు. గత మూడు నెలల్లో మోదీ 1,367 పోస్టులు పబ్లిష్ చేశారు. కేజ్రీవాల్ 270, రాహుల్ 187 పోస్టులతో తర్వాతి స్థానాల్లో నిలిచారు. ఇన్‌స్టాలోనూ మోదీకి ఏకంగా 8.85 కోట్ల మంది ఫాలోవర్లున్నారు. అందులో గత మూణ్నెల్లలోనే 52 లక్షల మంది మోదీని కొత్తగా ఫాలో కావడం జెన్ జెడ్‌లోనూ ఆయన క్రేజ్‌కు అద్దం పడుతోంది. ఇన్‌స్టాలో రాహుల్‌కు 68 లక్షలు, కేజ్రీవాల్‌కు 22 లక్షలు, మమతాకు కేవలం 3.84 లక్షల ఫాలోవర్లు మాత్రమే ఉన్నారు! ఇక యూట్యూబ్‌లోనూ మోదీదే హవా! 2.29 కోట్ల మంది సబ్‌స్క్రయిబర్లు ఆయన సొంతం. రాహుల్ (44.7 లక్షలు), కేజ్రీవాల్ (7.58 లక్షలు) మోదీకి ఆమడ దూరంలో ఉన్నారు. గత మూడు నెలల్లో మోదీ చానల్లో పబ్లిషైన వీడియోలకు అత్యధికంగా 47.7 కోట్ల వ్యూస్ దక్కాయి! ఇది రాహుల్, కేజ్రీవాల్ వీడియోల కంటే రెట్టింపు కావడం విశేషం.

ఇన్‌స్టా.. జెన్-జెడ్ ఓటర్ల 'డెన్'

ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్.. స్టోరీస్.. పోస్టులు.. లైవ్ వీడియోలతో చెలరేగిపోతున్న నవతరం యువత (జెనరేషన్ జెడ్)కు చేరువయ్యేందుకు పార్టీలూ పోటీ పడుతున్నాయి. ముఖ్యంగా తొలిసారి ఓటేయనున్న యూత్‌కు అడ్డగా మారిన ఈ సోషల్ వేదికపై మరింతగా ఫోకస్ చేస్తున్నాయి. తాజా డేటా ప్రకారం మెటా ప్లాట్‌ఫాంలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టా, వాట్సాప్‌ల్లో బీజేపీ, కాంగ్రెస్ గత నాలుగు నెలల్లో చేసిన యాడ్ వ్యయాల్లో సింహభాగం ఇన్‌స్టాపైనే వెచ్చించడం దీని ప్రాధాన్యానికి నిదర్శనం. గత మూడు నెలల్లో ఈ ప్లాట్‌ఫాంలో కాంగ్రెస్ 13.2 లక్షల మంది ఫాలోవర్లను పెంచుకోగా బీజేపీ (8.5 లక్షలు), ఆప్ (2.3 లక్షల)తో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. టీఎంసీకి 6,000 మంది కొత్త యూజర్లు దక్కారు. మొత్తం ఫాలోవర్ల విషయానికొస్తే, బీజేపీకి 76 లక్షలు, కాంగ్రెస్‌కు 43 లక్షలు, ఆప్‌కు 12 లక్షలు, తృణమూల్‌కు కేవలం 1.1 లక్షల మంది ఉన్నారు.



ఓటెత్తారు

కొత్త ఓటర్లు



జమ్మూకశ్మీర్‌లోని కథువాలో..

గిరిజనులు



మధ్యప్రదేశ్‌లోని డిండోరిలో..

బౌద్ధులు



సిక్కింలోని గాంగ్‌టక్‌లో..

సాధువులు



ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో..

ముస్లింలు



ఉత్తర ప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో..

నవ దంపతులు



మహారాష్ట్రలోని గోండియాలో..

మరుగుజ్జు మహిళ



మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో..

ట్రాన్స్‌జెండర్



మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో..

ఇజ్రాయెల్ ప్రతీకార దాడి

దుబాయ్: ప్రతీకార దాడితో పశ్చిమాసియా మళ్లీ భగ్గున మండింది. తమ భూభాగంపై ఇరాన్ దాడికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇప్పటికే ప్రకటించిన ఇజ్రాయెల్ అనుకున్నంత పని చేసి చూపించింది. తమ డ్రోన్‌లను రంగంలోకి దింపింది. అమెరికా తయారీ ఎఫ్–14 టామ్‌క్యాట్స్ యుద్ధవిమానాలు ఉన్న ఇరాన్‌లోని ఇస్ఫహాన్ సిటీ వైమానిక స్థావరం, అణు కార్యక్రమాల ప్రాంతం వద్ద శుక్రవారం ఉదయం భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. అయితే ఇస్ఫహాన్ నగర గగనతలంలో చక్కర్లు కొడుతున్న డ్రోన్లను కూల్చేశామని, దాడిని విజయవంతంగా అడ్డుకున్నామని ఇరాన్ ప్రకటించింది. ఇరాన్‌పై దాడి పని ఇజ్రాయెల్‌దేనని అమెరికా సైన్యాధికారులు ప్రకటించారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయాతొల్లా అలీ ఖమేనీ 85వ పుట్టినరోజు జరుపుకుంటున్న శుక్రవారం రోజే ఇజ్రాయెల్ ఈ దాడులు చేయడం గమనార్హం. అణుకార్యక్రమాలు జరిగే ఆగ్నేయ జెర్దెంజన్ ప్రాంతంలో శత్రు విమానాలు, డ్రోన్లను నేలమట్టం చేసే అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలను ఇరాన్ క్రియాశీలం చేసింది. ఈ అణుకేంద్రంలో చైనా సరఫరాచేసిన స్వల్పస్థాయి అణు పరిశోధనా రియాక్టర్లు ఉన్నాయి. పౌర అణు అవసరాల కోసం అణు ఇంధనాన్ని ఇక్కడ ఉత్పత్తిచేస్తారు. ఇదే నగరంలో భూగర్భ అణు శుద్ధి కర్మాగారం ఉంది. దీనిని లక్ష్యంగా చేసుకునే ఇజ్రాయెల్ ఈ దాడి చేసి ఉంటుందని భావిస్తున్నారు.

ఎన్‌ఎస్‌జీ చీఫ్‌గా నళిన్ ప్రభాత్



న్యూఢిల్లీ: దేశ ఉగ్రవాద వ్యతిరేక దళం నేషనల్ సెక్యూరిటీ గార్డ్(ఎన్‌ఎస్‌జీ) అధిపతిగా సీనియర్ ఐపీఎస్ అధికారి నళిన్ ప్రభాత్ నియమితులయ్యారు. ఆయన నియామకానికి కేబినెట్‌లోని నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. 1992 బ్యాచ్ ఆంధ్రప్రదేశ్ కేడర్ ఐపీఎస్ అయిన ప్రభాత్ సీఆర్‌పీఎఫ్ అదనపు డైరెక్టర్ జనరల్‌గా ఉన్నారు. 2028 ఆగస్టు 31వ తేదీ వరకు ఎన్‌ఎస్‌జీ చీఫ్‌గా ఆయన కొనసాగుతారని సిబ్బంది వ్యవహారాల శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

నావికా దళాధిపతిగా దినేశ్ త్రిపాఠీ



న్యూఢిల్లీ: భారత నావికా దళం నూతన అధిపతిగా వైస్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠీ నియమితులయ్యారు. ప్రస్తుతం నేవీ స్టాఫ్ వైస్ చీఫ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వైస్ అడ్మిరల్ త్రిపాఠీ ఈ నెల 30వ తేదీ మధ్యాహ్నం నేవీ చీఫ్‌గా బాధ్యతలు చేపడతారని రక్షణ శాఖ తెలిపింది. 1964 మే 15వ తేదీన జన్మించిన వైస్ అడ్మిరల్ త్రిపాఠీ 1985 జులై ఒకటో తేదీన భారత నేవీ ఎగ్జిక్యూటివ్ విభాగంలో చేరారు. కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ నిపుణుడిగా గత 30 ఏళ్లుగా బాధ్యతల్లో ఉన్నారు.

మూడు మామిడి పండ్లే తిన్నా..

ఢిల్లీ కోర్టులో కేజ్రీవాల్ వాదన

న్యూఢిల్లీ: జైలులో తాను తీసుకుంటున్న ఆహారాన్ని ఈడీ రాజకీయం చేస్తోందని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ విమర్శించారు. డయాబెటిస్ బాధితుడినైన తనకు జైలులో ఇన్సులిన్ ఇవ్వాలని కోరుతూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ రౌస్‌అవెన్యూ కోర్టులో శుక్రవారం వాదనలు కొనసాగాయి. మెడికల్ బెయిల్ పొందడానికి లేదా చికిత్స పేరిట ఆసుపత్రిలో చేరడానికి వీలుగా రక్తంలో చక్కెర స్థాయిలు పెంచుకోవడానికి కేజ్రీవాల్ ఉద్దేశపూర్వకంగా మామిడి పండ్లు, స్వీట్లు తింటున్నారని ఈడీ గురువారం కోర్టు దృష్టికి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈడీ వాదనపై కేజ్రీవాల్ శుక్రవారం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జైలులో ఉన్న తనకు ఇప్పటిదాకా 48 సార్లు ఇంటి నుంచి భోజనం పంపగా, కేవలం మూడుసార్లు మాత్రమే మామిడిపండ్లు తిన్నానని కేజ్రీవాల్ తెలిపారు. కేవలం ఒకే ఒక్కసారి ఆలూ పూరీ తీసుకున్నానని, అది కూడా నవరాత్రి ప్రసాదంగా స్వీకరించానని కోర్టుకు తెలియజేశారు. వైట్ రైస్, బ్రౌన్ రైస్ కంటే మామిడి పండ్లలో చక్కెర స్థాయి తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. షుగర్ లేని స్వీట్లు ఆరు సార్లు తిన్నానని, షుగర్ లేకుండా టీ తాగుతున్నానని వెల్లడించారు. తనకు చికిత్స అందించే రెగ్యులర్ వైద్యుడు సూచించిన డైట్ చార్ట్ ప్రకారమే ఆహారం తీసుకుంటున్నానని వివరించారు. ప్రతిరోజూ 15 నిమిషాల పాటు డాక్టర్‌ను సంప్రదించడానికి అనుమతి ఇవ్వాలంటూ శుక్రవారం మరో పిటిషన్ దాఖలు చేశారు. ఇన్సులిన్ కోసం దాఖలు చేసిన పిటిషన్‌తోపాటు ఈ పిటిషన్‌పై తీర్పును న్యాయస్థానం రిజర్వ్ చేసింది.

తొలి దశ పోలింగ్ ప్రశాంతం

- ఓటింగ్ 62.37 శాతం
- ఓటేసిన దిగ్గజ నేతలు
- ఛత్తీస్‌గఢ్‌లో గ్రెనేడ్ పేలి సీఆర్‌పీఎఫ్ జవాను మృతి
- పశ్చిమబెంగాల్‌లో స్వల్ప ఘర్షణలు

న్యూఢిల్లీ: పలు చోట్ల స్వల్ప హింసాత్మక ఘటనలు మినహా లోక్‌సభ ఎన్నికల తొలి దశ పోలింగ్ శుక్రవారం 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రశాంతంగా ముగిసింది. ఇప్పటిదాకా అందిన గణాంకాల ప్రకారం ఈ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలోని 102 స్థానాల్లో మొత్తంగా శుక్రవారం రాత్రి తొమ్మిది గంటలకు అందిన సమాచారం మేరకు 62.37 శాతం మేర పోలింగ్ నమోదైందని కేంద్ర ఎన్నికల కమిషన్ అధికార ప్రతినిధి చెప్పారు. పోలింగ్ శాతం ఇంకా పెరగవచ్చని తెలిపారు. మొత్తం లోక్‌సభ స్థానాలకు ఏడు దశల్లో పోలింగ్ నిర్వహిస్తుండగా తొలి దశలోనే అత్యధిక స్థానాలకు పోలింగ్ జరిగింది. 2019లో ఇవే లోక్‌సభ స్థానాల్లో 69.43 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల దాకా పోలింగ్‌ను అనుమతించారు.

యువ ఓటర్లు.. నవ దంపతులు

ఓటు హక్కు వచ్చాక తొలిసారి ఓటేసేందుకు భారీ సంఖ్యలో యువత ఆసక్తి చూపారు. కొత్త దంపతులు, వృద్ధులు, దివ్యాంగులు సైతం పోలింగ్ స్టేషన్లకు వచ్చి ఓటు వేశారు. తమిళనాడు, అరుణాచల్ ప్రదేశ్, అండమాన్, నికోబార్ దీవులు, అస్సాంలోని కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు అందిన సమాచారం ప్రకారం త్రిపురలో 80.17 శాతం, పశ్చిమబెంగాల్‌లో 77.57 శాతం, తమిళనాడులో 72.09 శాతం, అస్సాంలో 70.77 శాతం, మేఘాలయలో 74.21 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 58 శాతం, మహారాష్ట్రలో 61.06 శాతం పోలింగ్ నమోదైంది. ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌తో గిరిజన సంఘాల కూటమి ఇచ్చిన పిలుపు మేరకు నాగాలాండ్‌లోని ఆరు జిల్లాల ప్రజలు అసలు పోలింగ్ కేంద్రాల వైపే రాలేదు.

మణిపూర్‌లో 69 శాతానికి పైగా

జాతుల మధ్య వైరంతో రావణకాష్టంలా రగిలిపోయిన మణిపూర్‌లో ఆశాజనకంగా 69.13 శాతం పోలింగ్ నమోదైంది. ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్‌లోని నాలుగు పోలింగ్‌బూత్‌లలో ఆగంతకులు ఈవీఎంలను ధ్వంసంచేశారు. ఒక బూత్‌ను నాశనం చేశారు. తరచూ మావోలు, బలగాల ఎదురుకాల్పుల మోతతో దద్దరిల్లే బస్తర్ ప్రాంతం ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో 63.41 శాతం పోలింగ్ నమోదైంది. రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా గాల్గమ్ గ్రామంలో పోలింగ్ కేంద్రం సమీపంలో అండర్ బ్యారెల్ గ్రనేడ్ లాంచర్ పొరపాటున పేలడంతో సీఆర్‌పీఎఫ్ జవాను దేవేంద్ర తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ కన్నుమూశారు.



రజనీకాంత్



స్టాలిన్



అగాథ సంగ్మా



నితిన్ గడ్కరీ

తమిళనాడులో 72.09% ఓటింగ్

రాష్ట్రంలోని మొత్తం 39 లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 72.09 శాతం పోలింగ్ నమోదైంది. తాంబరంసహా కొన్ని పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలలో సాంకేతిక కారణాలతో పోలింగ్ గంట ఆలస్యంగా ఆరంభమైంది. సేలంలో ఇద్దరు వృద్ధులు ఓటేసేందుకు పోలింగ్‌కేంద్రానికొచ్చి మరణించారు. తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి, ముఖ్యమంత్రి స్టాలిన్, మాజీ సీఎంలు పన్నీర్‌సెల్వం, కె.పళనిస్వామి, తమిళసూపర్‌స్టార్ రజనీకాంత్, కమల్‌హాసన్, విజయ్, అజిత్ కుమార్ తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. తమిళనాడులో 2019 ఎన్నికల్లో 72.44 శాతం పోలింగ్‌నమోదైంది. తమిళనాడుసహా, ఉత్తరాఖండ్, అరుణాచల్, మేఘాలయ, అండమాన్ నికోబార్ దీవులు, మిజోరం, నాగాలాండ్, పుదుచ్చేరి, సిక్కిం, లక్షద్వీప్‌లలో ఒకే దఫాగా అన్ని స్థానాల్లో శుక్రవారం పోలింగ్ జరిగింది. రాజస్తాన్, యూపీ, మధ్యప్రదేశ్, అస్సాం, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమబెంగాల్, మణిపూర్, త్రిపుర, జమ్మూకశ్మీర్, ఛత్తీస్‌గఢ్‌లోని కొన్ని స్థానాలకు పోలింగ్ జరిగింది.

అరుణాచల్ అసెంబ్లీకి 65.79%

అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. శుక్రవారం మధ్యాహ్నం అందిన సమాచారం ప్రకారం అరుణాచల్ ప్రదేశ్‌లో 65.79 శాతం పోలింగ్ నమోదైంది. 60 అసెంబ్లీ స్థానాలకుగాను 50 నియోజకవర్గాలకు పోలింగ్ జరిగింది. మిగతా పది చోట్ల బీజేపీ ఇప్పటికే ఏకగ్రీవంగా విజయం సాధించింది. సిక్కింలోని మొత్తం 32 శాసన సభ స్థానాలకు శుక్రవారం జరిగిన ఎన్నికల్లో 67.95 శాతం పోలింగ్ నమోదైంది.

హైలైట్స్

- జమ్మూకశ్మీర్ దోడా జిల్లాలో పెళ్లింట అప్పగింతల కార్యక్రమం ఆలస్యంకావడంతో వధువు మోనికా శర్మ ఆలోపు పోలింగ్‌స్టేషన్‌కు వెళ్లి ఓటేసి వచ్చింది
- జైపూర్‌లో 95 ఏళ్ల నేవీ మాజీ అధికారి ఆర్‌ఎన్ సింగ్, ఔరంగాబాద్‌లో 92 ఏళ్ల రిటైర్డ్ ప్రొఫెసర్ ఉదయ్ సింగ్ వీల్‌చైర్‌లో వచ్చి ఓటేశారు
- అండమాన్ నికోబార్ దీవుల్లో అత్యంత అణగారిన షోంపెన్ గిరిజన తెగకుచెందిన ఏడుగురు తొలిసారిగా ఓటేశారు.
- బస్తర్ పరిధిలో తొలిసారిగా 56 గ్రామాలకు చెందిన ఓటర్లు తమ సొంత ఊళ్లలోనే బూత్‌లు ఏర్పాటుచేయడంతో ఓటేశారు.
- బిహార్, యూపీ, తమిళనాడులోని కొన్ని గ్రామల ప్రజలు తమకు కనీస సదుపాయాలు లేవంటూ పోలింగ్‌ను బహిష్కరించారు
- అస్సాంలోని లఖీంపూర్ స్థానంలో ఈవీఎంలున్న కారును తరలిస్తున్న పడవ నీటిలో మునిగింది
- కశ్మీర్‌లో సైలెంట్ విలేజ్ నుంచి తొలిసారిగా ముగ్గురు మూగ, చెవిటి అక్కాచెల్లెళ్లు ఓటేశారు
- ప్రపంచంలోనే అత్యంత పొట్టి మహిళగా పేరొందిన జ్యోతి ఆమ్గే నాగ్‌పూర్ పట్టణంలో ఓటేశారు
- నాగ్‌పూర్‌లో 27 మంది ఉమ్మడి కుటుంబసభ్యులంతా ఒకేసారి ఓటు హక్కును వినియోగించుకున్నారు
- బ్యాలెట్ పేపర్ అయితేనే ఓటేస్తానంటూ హరిద్వార్‌లో ఓ వృద్ధుడు ఈవీఎంను నేలకేసి కొట్టాడు
- ఛత్తీస్‌గఢ్‌లోని 102 నియోజకవర్గాల్లో మహిళా సిబ్బంది 'పింక్' దుస్తుల్లో హాజరయ్యారు
- అరుణాచల్‌ప్రదేశ్‌లోని అంజా జిల్లాలో పోలింగ్ సిబ్బంది 40 కిలోమీటర్లు కాలినడకన కొండకోనలు ఎక్కిమరీ మారుమూల ప్రాంతంలో ఏర్పాటుచేసిన మాలోగామ్ పోలింగ్ స్టేషన్‌లో ఏకైక ఓటరైన 44 ఏళ్ల మహిళ సోకేలా తయాంగ్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

సాక్షి కరీంనగర్

శనివారం | 20 | ఏప్రిల్ | 2024



రాజన్న సన్నిధిలో రద్దీ

వేములవాడ: రాజన్నను శుక్రవారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.18 లక్షల ఆదాయం సమకూరింది.



భక్తుల పుణ్యస్నానం

ధర్మపురి: పవిత్ర గోదావరినదిలో శుక్రవారం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. గంగమ్మ, గౌరమ్మకు నైవేద్యాలు, తెప్పల రూపంలో మొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
41.0/27.0

వాతావరణం

వాతావరణం ఎండగా ఉంటుంది. వడ గాలులు వీస్తాయి. తీవ్ర ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు హైకోర్టు న్యాయమూర్తి రాక



జస్టిస్ ఇ.వి.వేణుగోపాల్

కరీంనగర్‌క్రైం: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇ.వి వేణుగోపాల్ శనివారం కరీంనగర్‌కు రానున్నారు. ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి 11.30గంటలకు మైసమ్మగూడ కొంపల్లిలోని నరసింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల 13వ గ్రాడ్యుయేషన్‌డేలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. మధ్యాహ్నం 3:30 గంటలకు మంకమ్మతోటలోని ఆయన నివాసానికి చేరుకుంటారు. సాయంత్రం 5గంటలకు కరీంనగర్‌లోని వెంకట్ ఫౌండేషన్ (బాలగోకులం) కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఆదివారం మంకమ్మతోటలోని ఆయన నివాసంలో సివిల్ సర్వీసెస్–2023 ఫలితాలలో విజయం సాధించిన కరీంనగర్ జిల్లాకు చెందిన నందాల సాయికిరణ్, కొలనుపాక సహనకు అభినందనలు తెలిపి, వారితో అల్పాహార విందులో పాల్గొంటారు. ఉదయం 11గంటలకు చింతకుంటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగే ఒక వివాహానికి హాజరై అనంతరం హైదరాబాద్ వెళ్తారు.

ధాన్యం కొనుగోళ్లపై నజర్

- పర్యవేక్షణకు ప్రత్యేక అధికారుల నియామకం

కరీంనగర్ అర్బన్: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసేలా కలెక్టర్ పమేలా సత్పతి ప్రత్యేక అధికారులను నియమించారు. మందకొడిగా కొనుగోళ్లు సాగుతుండటం.. మేఘాలు కమ్ముకోవడంతో అకాల వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ ప్రకటించడంతో చర్యలను ముమ్మరం చేశారు. జిల్లాలో 341 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా డీసీఎంఎస్, ప్యాక్స్, ఐకేపీ, హాకా కొనుగోలు చేస్తోంది. ఈ క్రమంలో జిల్లాలో 4.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉండగా ఇప్పటికి కొనుగోలు చేసింది అరకొరే. ఈ నేపథ్యంలో కలెక్టర్ ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారులను నియమించారు. డీఆర్డీవో వి.శ్రీధర్‌కు గంగాధర, రామడుగు మండలాలు కేటాయించగా జిల్లా పౌరసరఫరాల అధికారి యం.గౌరీశంకర్‌కు హుజూరాబాద్, శంకరపట్నం, పౌరసరఫరాల సంస్థ డీఎం ఎం.రజినీకాంత్‌కు తిమ్మాపూర్, మానకొండూరు, జిల్లా మార్కెటింగ్ అధికారి యం.పద్మావతికి కొత్తపల్లి, కరీంనగర్ రూరల్, చొప్పదండి, జిల్లా వ్యవసాయ అధికారి బి.శ్రీనివాస్‌కు గన్నేరువరం, చిగురుమామిడి, ఎస్.రామానుజచార్యను సైదాపూర్, వీణవంక, డీసీయంఎస్ ఆర్.వెంకటేశ్వర్‌రావును ఇల్లందకుంట, జమ్మికుంట మండలాలకు ప్రత్యేక అధికారులుగా నియమించారు.

క్వింటాల్ పత్తి రూ.7,350



వేలంలో పాల్గొన్న వ్యాపారులు

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ.7,350 పలికింది. శుక్రవారం మార్కెట్‌కు 43 వాహనాల్లో 565 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకొచ్చారు. క్వింటాల్‌కు మోడల్ ధర రూ.7,250, కనిష్ట ధర రూ.6,800 పలికింది. గన్నీ సంచుల్లో ఏడుగురు రైతులు ఆరు క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకొచ్చారు. క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.6,000, మోడల్ ధర రూ.5,500, కనిష్ట ధర రూ.5,000కు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. మార్కెట్‌కు శని, ఆదివారాలు సాధారణ సెలవులు ఉంటాయని సోమవారం యార్డులో యథావిధిగా క్రయవిక్రయాలు కొనసాగుతాయని కార్యదర్శి గుగులోతు రెడ్డినాయక్ పేర్కొన్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్ అభ్యర్థికి నాలుగు ఉద్యోగాలు



కార్తీక్

కరీంనగర్: జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో 2019 బ్యాచ్‌కు చెందిన గొర్రె కార్తీక్ యూనియన్ బ్యాంకు కరీంనగర్‌లో ప్రొబెషనరీ ఆఫీసర్(పీవో)గా ఎంపికై, అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారని స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఆయన ఐబీపీఎస్ ద్వారా యూనియన్ బ్యాంక్‌లో క్లర్క్, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా ఆఫీస్ అసిస్టెంట్, కరీంనగర్ డీసీసీబీలో స్టాఫ్ అసిస్టెంట్ ఉద్యోగాలూ సాధించాడన్నారు. కార్తీక్‌ను ఎస్సీ అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ నతా నియేల్, స్టడీ సర్కిల్ స్టాఫ్, అధ్యాపకులు అభినందించారు. కరీంనగర్ బ్రాంచి నుంచి ఇప్పటివరకు 9 బ్యాచ్‌లలో 900 మందికి ఉచిత శిక్షణ ఇవ్వగా 224 ఉద్యోగాలు సాధించారని డైరెక్టర్ పేర్కొన్నారు.

బండి, గంగుల ఒక్కటే

- వినోద్‌ను ఓడించింది వాళ్లే
- ఇద్దరూ కలిసే నగరాన్ని దోచుకున్నారు
- తీగలవంతెనపై విచారణ జరుగుతోంది
- మంత్రి పొన్నం ప్రభాకర్



అంబేద్కర్ గ్రౌండ్‌లో మాట్లాడుతున్న మంత్రి ప్రభాకర్

కరీంనగర్ కార్పొరేషన్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఒక్కటేనని, ఇద్దరు కలిసి నగరాన్ని దోచుకున్నారని బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. నగరంలోని అంబేడ్కర్ స్టేడియంలో శుక్రవారం ఉదయం మంత్రి మార్నింగ్ వాక్ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఉప్పు నిప్పులా ఉన్న గంగుల, బండి పాలు నీళ్లలా ఎందుకు కలిసిపోయారో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. గత ఎంపీ ఎన్నికల్లో ఇద్దరు కలిసి వినోద్‌కుమార్‌ను ఓడించారన్నారు. నగరంలో భూ కబ్జాలపై స్థానిక ఎంపీగా సంజయ్ ఎందుకు మాట్లాడడంలేదన్నారు. స్మార్ట్‌సిటీ, గ్రానైట్ అక్రమాలపై ప్రశ్నించాల్సిన ఎంపీ ఎందుకు మౌనంగా ఉన్నాడని, ఎంపీ విధానాలను నిలదీయాల్సిన ఎమ్మెల్యే ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. ఎన్నిలకు ముందు సంజయ్ ఆస్కార్‌అవార్డు స్థాయిలో నటిస్తారని, ఒకసారి భార్య తాళి అమ్ముకున్నానని, మరోసారి ఎంఐఎం దాడి చేసిందని, ఇంకోసారి మూర్ఛవచ్చి పడిపోతాడన్నారు. నగరాన్ని లండన్ చేస్తాం, అద్దంలా మారుస్తామని కేసీఆర్ చెప్పారని ఏమైందన్నారు. తీగలవంతెన నిర్మాణ అక్రమాలపై విచారణ జరుగుతోందని, తప్పు చేసిన వాళ్లు లోపలికి పోవుడేనన్నారు. తాము అధికారంలోకి రాగానే భూ ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని చెప్పి చేసి చూపిస్తున్నామని, అదే కాంగ్రెస్ పాలన అని చెప్పారు. భూ కబ్జాల్లో ఎవరు జైలుకు వెళ్తున్నారో ప్రజలు చూస్తున్నారన్నారు. ఏ పార్టీ వాళ్లయినా భూ ఆక్రమణలకు పాల్పడితే వాపసు ఇవ్వాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ ముగిశాక నగరంలో పెండింగ్ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. డీసీసీ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, నాయకులు వెలిచాల రాజేందర్‌రావు, వైద్యుల అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంజయ్ నయాపైసా తేలే

- వినోద్‌కుమార్ ప్రజల గొంతుకవుతాడు
- మేయర్ వై.సునీల్‌రావు



మాట్లాడుతున్న మేయర్ వై.సునీల్‌రావు

కరీంనగర్: కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ నయాపైసా తేలేదని, పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌ను ప్రజలు గెలిపిస్తే తమ సమస్యలపై పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకవుతాడని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని ఒకటో డివిజన్ తీగలగుట్టపల్లి విజేత గ్రీన్‌హోమ్స్ కాలనీవాసులతో కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ సమావేశం అయ్యారు. మేయర్ సునీల్ రావు మాట్లాడుతూ.. ఎన్నికలు వస్తేనే బండికి ప్రజలు గుర్తుకువస్తున్నారని అన్నారు. వినోద్ కుమార్ 2014 నుంచి 2019వరకు ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్‌కు వెయ్యికోట్లతో స్మార్ట్‌సిటీ తీసుకొచ్చారని అన్నారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ తాను ఎంపీగా ఉన్న సమయంలోనే తీగలగుట్టపల్లిని మున్సిపల్ కార్పొరేషన్‌లో కలిపి రైల్వే ఓవర్ బ్రిడ్జి తీసుకురావడం జరిగిందన్నారు. మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, కార్పొరేటర్ కల్యాణి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సాగర్, మాజీ సర్పంచ్ కిష్టయ్య, శంకరయ్య, కరుణాకర్ గుప్తా, వాసుదేవరావు పాల్గొన్నారు.

'పొన్నం'.. దమ్ముంటే ఎంపీగా పోటీ చెయ్

- మంత్రి పదవికి రాజీనామా చేసిరా.. ఎవరికి ప్రజాదరణ ఉందో తేల్చుకుందాం
- బండి సంజయ్ తరఫున నామినేషన్ దాఖలు చేసిన బీజేపీ లీడర్లు



నామినేషన్ వేసిన అనంతరం మాట్లాడుతున్న బీజేపీ నేతలు

కరీంనగర్‌టౌన్: గత కొద్ది రోజులుగా బీజేపీ, బండి సంజయ్‌పైన మంత్రి పొన్నం ప్రభాకర్ చేస్తున్న అనుచిత వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు తీవ్రంగా స్పందించారు. ఇకనైనా పిచ్చివాగుడు మానుకోవాలని హెచ్చరించారు. పొన్నంకు దమ్ముంటే నేరుగా పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయాలని సవాల్ విసిరారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బండి సంజయ్ కుమార్ తరఫున పార్టీ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, ప్రతాప రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, మాజీ మేయర్ డి.శంకర్, కార్పొరేటర్ రమణారెడ్డి తదితరులు శుక్రవారం మధ్యాహ్నం కరీంనగర్ కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మంత్రిగా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నాననే విషయాన్ని పొన్నం మరిచిపోయారని అన్నారు. చివరకు న్యాయస్థానాలపై కూడా ఆరోపణలు చేస్తూ లిక్కర్‌స్కాం నిందితుడు శరత్ చంద్రారెడ్డి బీజేపీకి రూ.500 కోట్ల ఎలక్ట్రోబాండ్స్ ఇయ్యగానే... కోర్టు ఆయనకు బెయిల్ ఇచ్చిందని వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. శరత్ చంద్రారెడ్డికి బెయిల్ ఇచ్చింది గౌరవ సుప్రీంకోర్టు అని, బెయిల్‌కు, బాండ్స్‌కు సంబంధం ఏంటని ప్రశ్నించారు. వెంటనే సుప్రీంకోర్టు పొన్నం వ్యాఖ్యలను సుమోటోగా తీసుకుని నోటీసులు జారీ చేయాలని కోరారు. ఏ సర్వే చూసినా బండి సంజయ్ బంపర్ మెజారిటీతో గెలవబోతున్నరని తేలడంతో పొన్నంకు ఫ్రస్టేషన్ ఎక్కువైందని, అందుకే కరీంనగర్ నుంచి అభ్యర్థి ఎవరో కూడా తేల్చలేకపోతున్నరని విమర్శించారు. ఘోరంగా కాంగ్రెస్ ఓడిపోతే మంత్రి పదవికే ఎసరొస్తుందనే భయం పొన్నంకు పట్టుకుందన్నారు. మంత్రిని అని మరిచిపోయి పొన్నం అడ్డగోలుగా ఆరోపణలు చేస్తూ సభ్యసమాజం అసహ్యించుకునేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పొన్నం ప్రభాకర్ ఇకనైనా బండి సంజయ్‌పై అవాకులు చవాకులు మానుకోవాలని ఈ సందర్భంగా హితవు పలికారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి.. రాజకీయ నాయకులతో కలిసి స్ట్రాంగ్‌రూం పరిశీలిస్తున్న కలెక్టర్

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు

- ఓటింగ్‌శాతం పెరిగేలా ప్రత్యేక చర్యలు
- పార్లమెంటు నియోజకవర్గంలో 2,194 పోలింగ్ కేంద్రాలు
- ఎన్నికల విధులకు 5,500 మంది సిబ్బంది
- 'సువిధ'కు వచ్చిన దరఖాస్తులు 168
- తనిఖీల్లో రూ.7కోట్లు స్వాధీనం
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

ప్రశాంత వాతావరణంలో పార్లమెంట్ ఎన్నికలు జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ నియోజకవర్గపరిధిలో 17,92,000 మంది ఓటర్లు ఉన్నారని, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఐదు జిల్లాల పరిధిలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం ఉందని వెల్లడించారు. పురుషుల కన్నా మహిళా ఓటర్లు 50వేలు అధికంగా ఉండడం విశేషమని అన్నారు. 46,000 మంది కొత్త ఓటర్లు నమోదు అయ్యారని, 13,200మంది 85ఏళ్ల పైబడిన వృద్ధులు ఉన్నారని తెలిపారు. 41,500 మంది దివ్యాంగులు ఉన్నారని, వీరి కోసం ప్రత్యేకంగా వీల్‌చైర్లు అందుబాటులో ఉంచుతున్నామని వెల్లడించారు.

8,552 ఈవీఎంలు.. 5,500 సిబ్బంది

ఎన్నికల్లో 8552 ఈవీఎంలు ఉపయోగిస్తున్నామని చెప్పారు. 2,194 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో 5500 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని వెల్లడించారు. 85ఏళ్లు దాటిన వృద్ధులు ఇంటినుంచే ఓటు వేసేలా ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. 12వేల మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. శుక్రవారం వరకు 3 నామినేషన్లు దాఖలు అయ్యాయని, ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్ల గడువు ముగుస్తుందని, 26న నామినేషన్ల పరిశీలన, 29 వరకు ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. సీ విజిల్ యాప్ ద్వారా ఇప్పటివరకు 68 ఫిర్యాదులు వచ్చాయని, వీటిపై చర్యలు తీసుకున్నామని అన్నారు. సువిధ పోర్టల్ ద్వారా సభలు, సమావేశాలు, ప్రచారానికి అనుమతుల కోసం 168 దరఖాస్తులు వచ్చాయని, దాదాపు 105 దరఖాస్తులకు అనుమతులు ఇచ్చామని వెల్లడించారు. పోలీసు తనిఖీల్లో భాగంగా దాదాపు రూ.7కోట్ల వరకు నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎన్నికల్లో అర్హులందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, డీఆర్వో పవన్ కుమార్, సమాచార పౌరసంబంధాలశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్ కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ కొండయ్య, ఏపీఆర్‌ఓ వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఓటర్ స్లిప్పుల పంపిణీ

కరీంనగర్/కరీంనగర్ అర్బన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇంటింటికీ ఓ టరు స్లిప్పులు పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఓటరు స్లిప్పులు పంపిణీ చేసే సమయంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు సిబ్బందితో వెంట ఉండి ఓటరు జాబితాను చెక్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో బెల్ట్‌షాపులు మూసివేస్తామని అన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను రాజకీయ పార్టీల నేతలు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. పరిష్కరిస్తామని అన్నారు.

ఖర్చులపై ఫిర్యాదు చేయొచ్చు

కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల వ్యయ ఫిర్యాదులు సూచనలు, సలహాల కోసం ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల వ్యయ పరిశీలకులను సంప్రదించవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు అశ్విని కుమార్ పాండే మొబైల్ నంబర్ 9032659531కు ఎన్నికల వ్యయానికి సంబంధించిన అంశాలపై ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు.ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యే వరకు పరిశీలకులు జిల్లాలోనే ఉండి ఎన్నికల వ్యయానికి సంబంధించిన అన్ని అంశాలను పరిశీలిస్తారని తెలిపారు. కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ పమేలా సత్పతిని ఎన్నికల వ్యయ పరిశీలకులు అశ్వినీ కుమార్ పాండే శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు.

ఈవీఎంల తరలింపులో జాగ్రత్తలు తప్పనిసరి

మొదటి ర్యాండమైజేషన్‌లో భాగంగా కేటాయించిన ఈవీఎంలు, వీవీ ప్యాట్లను ఆయా నియోజకవర్గాల్లోని స్ట్రాంగ్‌రూంలకు అప్రమత్తంగా తరలించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. శుక్రవారం కరీంనగర్‌లోని ఈవీఎం గోదాంను సందర్శించారు. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎంలు, వీవీప్యాట్ల తరలింపు ప్రక్రియను పరిశీలించారు. ఈవీఎంల తరలింపులో ఎక్కడా తప్పిదాలు జరగకుండా చూసుకోవాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఎన్నికల వ్యయ వివరాలు పారదర్శకంగా ఉండాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకుడు అశ్విని కుమార్ పాండే



మీడియా సెంటర్‌ను పరిశీలిస్తున్న అశ్వినికుమార్ పాండే

కరీంనగర్: ఎన్నికల వ్యయ వివరాలు పారదర్శకంగా నమోదు చేయాలని ఎంసీఎంసీ కమిటీ సభ్యులకు కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు అశ్వినికుమార్ పాండే సూచించారు. శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్‌లోని మీడియా సెంటర్, కంట్రోల్‌రూంను పరిశీలించారు. మీడియా సెంటర్ పనితీరుతో పాటు పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాలో వచ్చే ఎన్నికల ప్రకటనలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పెయిడ్ ఆర్టికల్స్‌ను పర్యవేక్షిస్తూ వ్యయ వివరాలు నమోదు చేయాలన్నారు. కంట్రోల్‌రూం పనితీరును అడిగి తెలుసుకున్నారు. సీ విజిల్ యాప్ ద్వారా వచ్చిన కేసులు, తీసుకున్న చర్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. సమాచార, పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్ కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ కొండయ్య, ఏపీఆర్‌ఓ వీరాంజనేయులు, కంట్రోల్ రూమ్ నోడల్ ఆఫీసర్ ఎస్.నాగార్జున పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటింటికీ కాంగ్రెస్



మాట్లాడుతున్న కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, పక్కన కాంగ్రెస్ నాయకులు

- సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన పంచ న్యాయాల (పాంచ్‌న్యాయ్) గ్యారంటీ కార్డులను నగరంలోని ప్రతీ గడపకు తీసుకెళ్తామని సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం నుంచి ఇంటింటికి వెళ్లి పంచ న్యాయాలు అందజేస్తూ, బీఆర్ఎస్, బీజేపీ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామన్నారు. శుక్రవారం నగరంలోని సిటీ కాంగ్రెస్ కార్యాలయంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల తరహాలోనే కేంద్రంలో కాంగ్రెస్ పాంచ్‌న్యాయ్‌ను అమలు చేయనుందన్నారు. ఇటీవల తుక్కుగూడ సభలో రాహుల్‌గాంధీ ప్రకటించిన ఈ పంచన్యాయాల గ్యారంటీ కార్డులను ప్రతీ గడపకు చేరుస్తామన్నారు. కేంద్రం నుంచి రొటీన్‌గా వచ్చే నిధులు కాకుండా, సొంతంగా తీసుకొచ్చినవేమిటో, పనులేమిటో బీజేపీ అభ్యర్థి, ఎంపీ బండి సంజయ్ వెల్లడించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ ఎంపీగా, ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడిగా పూర్తిగా వి ఫలమయ్యారని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించడం వల్లే నగరం స్మార్ట్‌సిటీకి అర్హత సాధించిందన్నారు. వీటిని ప్రజలకు వివరిస్తామని, కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తామన్నారు. పార్టీలో అంతర్గతంగా చిన్న చిన్న సమస్యలుంటే సర్దుకుపోతామన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ బిజీ షెడ్యూల్ వల్ల, సమాచారలోపంతో తాను కార్యక్రమానికి హాజరుకాలేకపోయానన్నారు. నాయకులు ఎండీ.తాజొద్దీన్, శ్రవణ్‌నాయక్, బొబ్బిలి విక్టర్, సమద్ నవాబ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

రైతులు నష్టపోకుండా చర్యలు

- జిల్లా మార్కెటింగ్ అధికారి పద్మావతి



ధాన్యం తూకం పరిశీలిస్తున్న డీఎంవో పద్మావతి

కరీంనగర్‌రూరల్/చొప్పదండి: ధాన్యం తూకంలో కోతలేకుండా రైతులకు నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రాల నిర్వాహకులపై ఉందని జిల్లా మార్కెటింగ్ అధికారి వి.పద్మావతి అన్నారు. శుక్రవారం కరీంనగర్ మండలం నగునూరు, చొప్పదండి మండలం కొలిమికుంట, గుమ్లాపూర్, భూపాలపట్నం, వెదురుగట్టలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ప్రతీకేంద్రంలో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. ప్యాడీక్లీనర్ల ద్వారా ధాన్యాన్ని శుభ్రపరుచుకోవాలని కోరారు. తూకంలో కోత లేకుండా చూడాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందని, రైసుమిల్లర్లు ధాన్యం దింపుకోవడంలో ఇబ్బందులకు గురిచేసినట్లయితే సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం డీఎంవో చొప్పదండి మార్కెట్‌యార్డును సందర్శించారు. మొక్కజొన్న, పప్పు ధాన్యాలు, ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. ఏఎంసీ నర్మదతోపాటు స్థానిక పీఏసీఎస్, ఐకేపీ అధికారులు ఉన్నారు.

కంగ్రాట్స్.. సహన

- సివిల్స్ ర్యాంకర్‌కు టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు 'మారం' అభినందన



సహనను అభినందిస్తున్న మారం జగదీశ్, టీఎన్జీవో నాయకులు

కరీంనగర్ అర్బన్: సివిల్స్‌లో ర్యాంకు సాధించిన కొలనుపాక సహనకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని టీఎన్జీవో భవనంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన టీఎన్జీవోల రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో సివిల్స్‌లో కరీంనగర్ యువత సత్తా చాటుతోందని హర్షం వ్యక్తం చేశారు. సహన సివిల్స్‌లో ప్రతిభ చాటడం అభినందనీయమని కొనియాడారు. దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సహన మంచి అధికారిగా సేవలందించి కరీంనగర్ పేరును చిరస్థాయిగా నిలపాలని ఆకాంక్షించారు. టీఎన్జీవోల జిల్లా కార్యదర్శి సంఘం లక్ష్మణరావు, నాగుల నరసింహస్వామి, అసోసియేట్ అధ్యక్షుడు రాగి శ్రీనివాస్, జిల్లా కోశాధికారి కిరణ్ కుమార్‌రెడ్డి, మహిళా జేఏసీ చైర్‌పర్సన్ ఐరుమల్ల శారద, సబిత, సునీత, శైలజ, సుస్మిత, అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మిందర్ సింగ్, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, కార్యదర్శి వెలిచాల సుమంతరావు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

దమ్ముంటే కాంగ్రెస్‌ను టచ్ చేయండి

- బీఆర్ఎస్ అభ్యర్థులే ఆ పార్టీని వీడుతున్నారు..
- రాష్ట్ర విభజన హామీలేవీ బీజేపీ నెరవేర్చలేదు..
- ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారు..
- మంత్రి పొన్నం ప్రభాకర్


సిరిసిల్లలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సిరిసిల్లటౌన్/కరీంనగర్ కార్పొరేషన్: అధికారం నుంచి ప్రజలు తిరస్కరించినా కేసీఆర్, కేటీఆర్‌లకు అహం పోలేదని, తమ ప్రభుత్వాన్ని కూల్చుతామంటుండ్రని.. దమ్ముంటే కాంగ్రెస్‌ను టచ్ చేయండని మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. సిరిసిల్లలో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటు అభ్యర్థులుగా నిలబెట్టిన వారే ఆ పార్టీ అవినీతి, నియంతృత్వంపై ఛీత్కరించుకుంటూ పార్టీని వీడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజాపాలన అందించే కాంగ్రెస్‌పైనే ప్రజల ఆశీర్వాదం ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలేవీ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నెరవేర్చలేదన్నారు. ప్రజాస్వామ్య విలువలు తెలువనోళ్లు రాజకీయం చేస్తే.. ఇట్లానే ఉంటుందని బీఆర్ఎస్, బీజేపీలను ఉద్దేశించి విమర్శించారు. ఆ పార్టీల నియంతృత్వంపై ప్రజలు విసిగిపోయారని, రాహుల్ నేతృత్వంలో అందించే ప్రజాపాలనకే రానున్న ఎన్నికల్లో ప్రజలు పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కటై సిరిసిల్లకు కేటాయించిన మెగా టెక్స్‌టైల్ క్లస్టర్‌ను వరంగల్‌కు తరలించి ఇక్కడి కార్మికుల ఉసురు పోసుకున్నారని ధ్వజమెత్తారు. కరీంనగర్ నుంచి పార్టీ అభ్యర్థి గెలుపునకు కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలని కోరారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, స్థానిక నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, సంగీతం శ్రీనివాస్, చొప్పదండి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కూడబల్కొనే బీజేపీ, బీఆర్ఎస్ వ్యాఖ్యలు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రభుత్వం కూలిపోతుందని బీఆర్ఎస్, బీజేపీ కూడబల్కొని చెబుతున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లో మాట్లాడారు. 20 మంది ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. కేసీఆర్ అసహనంతో, పిచ్చిపట్టి మాట్లాడుతున్నారన్నారు. రైతుల సమస్యలు, ప్రభుత్వం కూలిపోవడం, రేవంత్‌రెడ్డి బీజేపీతో కలవడం..ఏ అంశమైనా ఈ రెండు పార్టీలు ఒకే మాట మాట్లాడుతున్నాయని, కుమ్మక్కుకు ఇదే నిదర్శనమన్నారు. ఉత్తర భారత్‌లో బలంగా ఉన్నామనుకొన్న బీజేపీ కోటలకు బీటలువారుతున్నాయని, అందుకే దక్షిణ భారత్ మీద అమిత్‌షా దృష్టి పెట్టారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పనులు పూర్తి చేసి ఇవ్వాల్సిన టోకెన్ బిల్లులు రూ.40 వేల కోట్ల నుంచి రూ.50 వేల కోట్లున్నాయన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలను సంతృప్తి పరచడానికి వందల జీవోలు తెచ్చారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఎప్‌సెట్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

- స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బట్టు మల్లయ్య


మాట్లాడుతున్న డైరెక్టర్ మల్లయ్య

కరీంనగర్: నగరంలోని సప్తగిరికాలనీ కేజీబీవీలో నిర్వహిస్తున్న ఎప్‌సెట్ ప్రత్యేక శిక్షణ తరగతులను స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బట్టు మల్లయ్య శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. వేసవి సెలవుల్లో నిర్వహిస్తున్న ఎప్‌సెట్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సబ్జెక్టులకు సంబంధించిన అనుమానాలను శిక్షకులను అడిగి, నివృత్తి చేసుకుంటూ, కష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధించాలన్నారు. కేజీబీవీల్లో చదివేవారు చాలా పేదరికం నుంచి వస్తారని, వారికి ఇబ్బందులు కలగకుండా మన సొంత పిల్లల్లా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో డీఈవో జనార్దన్‌రావు, జిల్లా జెండర్ అండ్ ఈక్విటీ కో–ఆర్డినేటర్ డాక్టర్ డెబోరా కృపారాణి, కేజీబీవీ ప్రత్యేక అధికారి పుష్పరాణి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ


రోడ్డుపై పడిన ధాన్యం

సుల్తానాబాద్‌రూరల్: కాట్నపల్లి గ్రామ శివారులోని రాజీవ్ రహదారిపై ధాన్యం లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓ లారీ వెనుక నుంచి ఢీకొంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గర్రెపల్లిలోని ఐకేపీ కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం లోడ్‌తో ట్రాక్టర్ సుల్తానాబాద్‌కు వస్తోంది. ఈక్రమంలో కరీంనగర్ నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి ట్రాక్టర్‌ను ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ బోల్తాపడగా డ్రైవర్ ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. అయితే, అందులో ధాన్యం రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయింది. దాదాపు గంటకుపైగానే వాహనాలు నిలిచి ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

వేంకటేశ్వరస్వామి ఫొటోలు ధ్వంసం

- జగదేవుపేట ఆలయంలో దుండగుల దుశ్చర్య


పంట పొలాల్లో స్వామివారి ఫొటో

వెల్గటూర్ (ధర్మపురి): మండలంలోని జగదేవుపేట శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో దుండగులు ప్రవేశించి, స్వామివారి ఫొటోలు, పూజా సామగ్రి ధ్వంసం చేశారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి వెళ్లి, స్వామివారి ఫొటోలు, కలశం, ఆలయ ప్రాంగణంలోని తులసి గద్దెను పక్కనున్న కాలువలో, పంట పొలాల్లో పడేశారు. ఈ ఘటనపై ఆలయ కమిటీవారు, దీక్షా స్వాములు శుక్రవారం ఉదయం వెల్గటూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై ఉమాసాగర్ ఆలయాన్ని సందర్శించి, వివరాలు సేకరించారు. గ్రామానికి చెందిన కొందరు అన్యమతస్తులే ఇలా చేసి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆరోగ్య క్రమశిక్షణతో అవయవాలు భద్రం

- మేయర్ వై.సునీల్‌రావు
- మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వరల్డ్ లివర్ డే


మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌టౌన్: మనిషి ఆరోగ్య క్రమశిక్షణ పాటిస్తే అన్ని అవయవాలు భద్రంగా ఉండి, ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని మేయర్ వై.సునీల్‌రావు అన్నారు. వరల్డ్ లివర్ డే సందర్భంగా శుక్రవారం కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ఆహారం మితంగా తీసుకుంటూ ప్రతీరోజు ఒక గంట వ్యాయామం చేయాలన్నారు. ముఖ్యంగా లివర్ పనితీరును బట్టే శరీరంలోని జీవ, జీర్ణక్రియలు సక్రమంగా జరుగుతాయని పేర్కొన్నారు. మెడికవర్ ఆస్పత్రి వైద్యులు ప్రజల ఆరోగ్యం కోసం తమ వంతు బాధ్యతగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ ప్రణీత్, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ.. మానవ శరీరంలో గుండె, మెదడు తర్వాత అతి ముఖ్యమైన అవయవం లివర్ అని తెలిపారు. అతిగా ఆల్కహాల్ సేవించడం వల్ల అది దెబ్బతింటుందని, ఆల్కహాల్ మానాలని సూచించారు. ఆస్పత్రి సిబ్బందికి జుంబా డ్యాన్స్‌పై శిక్షణతోపాటు ప్రదర్శన నిర్వహించారు. హాస్పిటల్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మేచినేని వనజ, మేచినేని పవన్‌రావు, వైద్యులు వినయ్‌కుమార్, ఉపేందర్‌రెడ్డి, రవిమల్లారెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ కర్ణాకర్, ఆపరేషన్స్ మేనేజర్ సాయిచరణ్ పాల్గొన్నారు.

ఆరుగురు ఆర్టీసీ ఉద్యోగుల సరెండర్!

- ఆర్ఎం ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించినట్లు సమాచారం
- ఏసీబీకి చిక్కిన హుజూరాబాద్ డీఎంకు సహకరించడమే కారణం?

హుజూరాబాద్: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో విధులు నిర్వహించే ఆరుగురు ఉద్యోగులను ఆర్ఎం కార్యాలయానికి సరెండర్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. దీంతో వారు శుక్రవారం ఆర్ఎం ఆఫీస్‌లో రిపోర్టు చేసినట్లు సమాచారం. ఇటీవల ఓ ఆర్టీసీ డ్రైవర్ వద్ద హుజూరాబాద్ డిపో మేనేజర్ సామల శ్రీకాంత్ రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం విధితమే. ఈ క్రమంలో డిపోలో విజిలెన్స్ అధికారులు రెండు రోజులపాటు విచారణ చేపట్టారు. ఇందులో డీఎం శ్రీకాంత్ అవినీతి అక్రమాలకు సహకరించినట్లు తేలిన డిపో పరిధిలోని ఆరుగురు ఉద్యోగులపై చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. డీఎం శ్రీకాంత్ చిన్న చిన్న కారణాలు చూపుతూ, అనుమతి లేకుండా అత్యవసరంగా సెలవులు తీసుకున్న ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసి, డబ్బులు డిమాండ్ చేయడం, ఇవ్వని పక్షంలో పలువురికి చార్జీ మెమోలు ఇచ్చినట్లు తేల్చారని సమాచారం. వాటిని విజిలెన్స్ అధికారులు సీజ్ చేసి, కరీంనగర్ ఆర్ఎం కార్యాలయానికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

ఇన్‌చార్జి డీఎంగా వెంకటేశ్వర్లు..

హుజూరాబాద్ ఇన్‌చార్జి డీఎంగా హుస్నాబాద్ డీఎం వెంకటేశ్వర్లును నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు.

తనిఖీల్లో భారీగా నగదు పట్టివేత


నగదు చూపుతున్న కరీంనగర్ పోలీసులు


వేములవాడలో..

కరీంనగర్ క్రైం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు కరీంనగర్ నగరంలోని వివిధ ఠాణాల పరిధిలో శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. రూ.15.82 లక్షలు పట్టుకున్నట్లు తెలిపారు. బడింది. వారి వివరాల ప్రకారం.. కరీంనగర్ వన్ టౌన్ పరిధిలోని రాజీవ్ చౌక్‌లో కరీంనగర్ దుర్గమ్మగడ్డకు చెందిన జనగం సుమన్ కల్యాణ్ వద్ద రూ.7 లక్షలు, కరీంనగర్ టూ టౌన్ పరిధిలోని గీతాభవన్ చౌరస్తా వద్ద మానకొండూర్‌కు చెందిన నెల్లి భాస్కర్ వద్ద రూ.1,11,900, ఐబీ చౌరస్తా వద్ద కరీంనగర్‌లోని కోతిరాంపూర్‌కు చెందిన కోల ప్రదీప్‌కుమార్ వద్ద రూ.5,70,900, కరీంనగర్ త్రీ టౌన్ పరిధిలో కట్టరాంపూర్‌కు చెందిన గాండ్ల సురేశ్ వద్ద రూ.2 లక్షలు స్వాధీనం చేసుకొని, సీజ్ చేశారు.

వేములవాడలో రూ.5.67 లక్షలు..

వేములవాడ: పట్టణ పరిధిలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ టీం శుక్రవారం ఓ వ్యక్తి వద్ద రూ.5.67 లక్షలు పట్టుకుంది. వ్యాపార లావాదేవీల్లో భాగంగా బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు వెళ్తున్నట్లు అతను తెలిపాడన్నారు. కానీ, సంబంధిత ఆధారాలు చూపించకపోవడంతో నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో అందజేశామన్నారు. ఏఈఈ వెంకటరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ భిక్షపతి, హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్, కానిస్టేబుల్ శ్రీనివాస్ తదితరులున్నారు.

అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద రూ.93 వేలు..

మెట్‌పల్లిరూరల్: బండలింగాపూర్ గండి హనుమాన్ ఆలయ సమీపంలోని అంతర్‌జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఇబ్రహీంపట్నం పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఓ కారులో తరలిస్తున్న రూ.93 వేలను పట్టుకున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. సంబంధిత ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసి, జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించామన్నారు.

రాయపట్నం చెక్‌పోస్టు వద్ద రూ.2 లక్షలు..

ధర్మపురి: రాయపట్నం చెక్‌పోస్టు వద్ద రూ.2 లక్షలు పట్టుకున్నట్లు ధర్మపురి పోలీసులు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో శుక్రవారం రాయపట్నం వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఆ సమయంలో ఓ వ్యక్తి ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా నగదు తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. తదుపరి చర్యల నిమిత్తం డబ్బులను సంబంధిత అధికారులకు పంపించినట్లు తెలిపారు. సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై ఉదయ్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్వగ్రామానికి వలసజీవి మృతదేహం

మేడిపల్లి(జగిత్యాల): మండలంలోని దమ్మన్నపేటవాసి నిమ్మ రాజశేఖర్ ఈ నెల 3న సౌదీ అరేబియాలో గుండెపోటుతో మృతి చెందగా ఆయన మృతదేహం శుక్రవారం స్వగ్రామం చేరింది. ఉపాధి కోసం వెళ్లి, విగతజీవుడై రావడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. శనివారం అంత్యక్రియలు నిర్వహిస్తామని బంధువులు తెలిపారు. రాజశేఖర్‌ది నిరుపేద కుటుంబం. ఇద్దరు ఆడపిల్లలున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సోషల్ వెల్ఫేర్ స్కూల్లో ఫుడ్ పాయిజన్

- 20 మంది విద్యార్థులకు అస్వస్థత

సుల్తానాబాద్: సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కావడంతో 20 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రినగర్ ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో శుక్రవారం ఉదయం టిఫిన్ చేసిన విద్యార్థులకు వాంతులు, విరేచనాలయ్యాయి. సిబ్బంది వెంటనే వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నలుగురు నలుగురు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో సెలైన్ ఎక్కించారు. మిగిలిన వారి ఆరోగ్యం సాయంత్రం వరకు కుదుటపడటంతో హాస్టల్‌కు తరలించినట్లు డాక్టర్ వెంకటేశ్ తెలిపారు. అల్పాహారంలో ఆయిల్ ఎక్కువ వాడటం వల్ల పిల్లలు అస్వస్థతకు గురైనట్లు వైద్యులు తెలిపారు. హాస్టల్‌కు పంపించిన పిల్లలకు స్టాఫ్ నర్స్ ఆధ్వర్యంలో కొబ్బరి బోండాలు, గ్లూకోజ్ అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సత్యప్రసాద్ రాజు పేర్కొన్నారు.

పిడుగు పడి ఒకరికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న రమేశ్

మెట్‌పల్లిరూరల్: మండలంలోని ఆత్మకూర్‌లో పిడుగు పడి, ఒకరికి తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. ఆత్మకూర్‌కు చెందిన కోరుట్ల రమేశ్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుండటంతోపాటు ఖాళీగా ఉన్న సమయంలో కూలీ పనులకు వెళ్తున్నాడు. శుక్రవారం సాయంత్రం గాలిదుమారం వచ్చి, ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో అతను గ్రామంలో చెట్టు కింద ఆగాడు. అదే సమయంలో పిడుగు పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు హుటాహుటిన మెట్‌పల్లిలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు

సిరిసిల్ల క్రైం: సిరిసిల్ల పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన రెండు ద్విచక్ర వాహనాలను ఎత్తుకెళ్లిన దొంగను శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ రఘుపతి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఈ నెల 10న సిరిసిల్ల పాత బస్టాండ్ ఏరియాలోని బార్ అండ్ రెస్టారెంట్ ఎదుట నిలిపిన, సినారె గ్రంథాలయం ఎదుట పార్కింగ్ చేసిన బైకులు చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేసిన పోలీసులు సిరిసిల్ల పట్టణం వెంకంపేటలో ఉండే చెందిన కోల రవిగౌడ్‌ను దొంగగా తేల్చారు. ఇతను కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం పరీద్‌పేటకు చెందినవాడని, ఉపాధి నిమిత్తం సిరిసిల్లలో ఉంటున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఎత్తుకెళ్లిన వాహనాల్లో ఒకటి పొదల్లో దాచిపెట్టాడని, మరోదానిపై సిరిసిల్ల బైపాస్ రోడ్డుమీదుగా వెళ్తుంటే పట్టుకున్నామని తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది విధుల బహిష్కరణ



పెద్దపల్లిరూరల్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి వెంటనే వేతనాలను ఇప్పించాలంటూ సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి, కేవీపీఎస్ నాయకులు అశోక్, రవీందర్ డిమాండ్ చేశారు. వీరి ఆధ్వర్యంలో శుక్రవారం సిబ్బంది విధులు బహిష్కరించారు. శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ తదితర విభాగాల్లో పని చేసే కార్మికులకు ఏడాదిగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకుని సదరు కాంట్రాక్టర్‌తో మాట్లాడి కార్మికుల సమస్యకు పరిష్కారం చూపాలని వారు కోరారు.

ఒలింపియాడ్‌లో ‘పారమిత’ ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

కొత్తపల్లి(కరీంనగర్): ఇటీవల నిర్వహించిన ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్(ఐటీవో)లో కొత్తపల్లి మండలంలోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. రాష్ట్రస్థాయిలో గణితంలో వెల్ది హర్షిణి(ఏడోతరగతి) 4వ ర్యాంకు, అర్హాన్ లతీఫ్ (ఎనిమిదో తరగతి) 4వ ర్యాంకు, సామాన్యశాస్త్ర విభాగంలో ఎస్.రుషిక(తొమ్మిదో తరగతి) 7వ ర్యాంకు సాధించి, పతకాలు, బహుమతులు గెలుపొందారని హెచ్‌ఎం రితేశ్ మెహతా తెలిపారు. మరో ఐదుగురు విద్యార్థులు స్ఫూర్తి(గణితం), జి.సహస్ర, ఎస్.సిరి(సామాన్య శాస్త్రం), యశ్మిత్ పటేల్, రిధి పబ్బతి(ఆంగ్లం) మెడల్ ఆఫ్ ఎక్సలెన్స్ సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పారమిత విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావు శుక్రవారం అభినందించారు. డైరెక్టర్లు రశ్మిత, ప్రసూన, అనూకర్‌రావు, రాకేశ్, వి.యు.ఎం.ప్రసాద్, వినోద్‌రావు, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, కో–ఆర్డినేటర్ రాము, గైడ్ టీచర్లు ప్రదీప్ కుమార్, చంద్రమౌళి శర్మ, హరీశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగ్గురు ‘ఉపాధి’ కూలీలకు గాయాలు




ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బుర్ర స్వరూప, ఆవునూరి తార, కాల్వల లింగమ్మ


సంఘటన స్థలంలో బండరాయి

సుల్తానాబాద్‌రూరల్/సుల్తానాబాద్(పెద్దపల్లి): ఉపాధిహామీ ద్వారా సుద్దాల పెద్దమ్మకుంటలో శుక్రవారం పూడికతీస్తున్న కూలీలపై బండరాయి దొర్లి, మట్టిపెళ్లలు పడ్డాయి. ఈఘటనలో ముగ్గురు మహిళా కూలీలకు గాయాలయ్యాయి. ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, స్థానికుల కథనం ప్రకారం.. పెద్దమ్మకుంట పూడికతీత పనుల్లో 163 మంది కూలీలు పనిచేస్తున్నారు. అందులో 20 మంది ఒక బృందంగా ఏర్పడి పూడిక తీస్తుండగా గట్టు కుంగి దానిపై ఉన్న బండరాయి కిందకు జారిపడింది. ఆ క్రమంలోనే మట్టిపెళ్లలు తగిలి అక్కడ పనిచేస్తున్న మహిళా కూలీలు ఆవునూరి తార, కల్వల లింగమ్మ, బుర్ర స్వరూపకు గాయాలయ్యాయి. తోటికూలీలు వెంటనే సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోని మరో ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న ఈజీఎస్ ఏపీడీ సత్యనారాయణ ఆస్పత్రికి వెళ్లి కూలీలను పరామర్శించారు.

నీటితొట్టెలో పడి బాలుడి మృతి


పరమేశ్వర్ మృతదేహం

మేడిపల్లి(జగిత్యాల): ఓ బాలుడు నీటితొట్టిలో పడి మృతిచెందిన ఘటన మేడిపల్లి మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని బేల గ్రామానికి చెందిన బైగాని సాంబారి ఉపాధి నిమిత్తం తన ఇద్దరు పిల్లలను తీసుకొని, 4 నెలల క్రితం మేడిపల్లికి వచ్చింది. స్థానిక ఇటుకల బట్టీలో పని చేస్తోంది. ఆమె కుమారుడు పరమేశ్వర్(7) గురువారం రాత్రి సమయంలో తోటి పిల్లలతో ఆడుకుంటూ వెళ్లి, దగ్గరలో ఉన్న నీటితొట్టిలో పడిపోయాడు. మిగతా పిల్లలు ఈ విషయాన్ని స్థానికులకు చెప్పడంతో వచ్చి, పరమేశ్వర్‌ని బయటకు తీసి, జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆ బాలుడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తల్లి సాంబారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

నెల రోజుల్లో ముగ్గురు..

నెల రోజుల్లో ఒక వలస కార్మికుడు, ఇద్దరు కార్మికుల పిల్లలు మృతిచెందారు. దీంతో వలస కార్మికులకు రక్షణ చర్యలు కరువయ్యాయని ప్రజలు చర్చించుకుంటున్నారు.


వ్యవసాయ బావిలో పడి వృద్ధురాలు..


ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓదెల గ్రామానికి చెందిన చింతం లక్ష్మి(74) వ్యవసాయబావిలో పడి మృతిచెందింది. ఏఎస్సై లక్ష్మీరాజం తెలిపిన వివరాల ప్రకారం.. ఓదెల గ్రామానికి చెందిన చింతం లక్ష్మి రెండు సంవత్సరాల నుంచి కీళ్లనొప్పులతో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా నయం కాలేదు. శుక్రవారం బహిర్భూమికి వెళ్లి బావిలో పడి మృతిచెందింది. మృతురాలి కుమారుడు రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కొత్తపల్లి(కరీంనగర్): బైక్‌ను మరో బైక్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కొత్తపల్లి మండలంలోని చింతకుంట శాంతినగర్‌కు చెందిన తాకు విశాల్ శుక్రవారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై కమాన్‌పూర్ పెట్రోల్ బంకుకు వెళ్లాడు. పెట్రోల్ కొట్టించుకొని, తిరిగి వస్తూ డివైడర్ దాటుతుండగా భూమి రాకేశ్ బైక్‌పై వేగంగా వచ్చి, ఢీకొట్టాడు. ఈ ఘటనలో విశాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో కరీంనగర్ వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మృతుడి తల్లి కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అప్పుల బాధతో గొర్రెల కాపరి ఆత్మహత్య


మల్లయ్య (ఫైల్)


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అప్పుల బాధతో ఓ గొర్రెల కాపరి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్లారెడ్డిపేట మండలంలోని రాగట్లపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై రమాకాంత్, గ్రామస్తుల వివరాల ప్రకారం.. రాగట్లపల్లికి చెందిన నెత్తెట్ల చిన్న మల్లయ్య(48) ఇల్లు నిర్మించుకునేందుకు, భూమిని అభివృద్ధి చేయడం కోసం సుమారు రూ.20 లక్షల వరకు అప్పులు చేశాడు. వ్యవసాయం, గొర్రెల పెంపకం ద్వారా ఆదాయం అంతంత మాత్రంగానే వస్తుండటంతో అప్పులు తీర్చే మార్గం కనిపించలేదు. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య సత్తవ్వ, కుమారుడు అజయ్, కూతురు అమ్ములు ఉన్నారు. మల్లయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ దాసరి సుజాత, గ్రామస్తులు కోరారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు కింద పడి బాలిక బలవన్మరణం

జగిత్యాల క్రైం: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామ శివారులోని రైల్వే బ్రిడ్జిపై ఒడిశా రాష్ట్రానికి చెందిన కైకేయి(15) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుందని ఎస్సై సదాకర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన మన్మధ తన కుటుంబ సభ్యులతో కలిసి చల్‌గల్ శివారులోని ఇటుక బట్టీల్లో పని చేస్తోంది. గురువారం జగిత్యాల మార్కెట్‌కు వచ్చి, సాయంత్రం తిరిగి వెళ్తున్నప్పుడు కైకేయి అదృశ్యమైంది. రాత్రి ఆమె కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. కొన్ని రోజులుగా కైకేయి మానసిక పరిస్థితి సరిగా ఉండటం లేదని కుటుంబసభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం రైల్వేట్రాక్‌పై ఆమె మృతదేహం ఉందన్న సమాచారంతో ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని, విచారణ చేపట్టారు. మృతురాలి తల్లి మన్మధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి పేర్కొన్నారు.

47 పెండింగ్ చలాన్ల వాహనం పట్టివేత

- రూ.12,805 చెల్లించిన యజమాని

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల వద్ద జగిత్యాల పట్టణ సీఐ వేణుగోపాల్, ఎస్సై మన్మదరావు ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రాయికల్ మండలంలోని కిష్టంపేటకు చెందిన జనార్దన్ తన బైక్‌పై వస్తుండగా ఆపారు. ఆ వాహనంపై 47 పెండింగ్ చలాన్లు ఉన్నట్లు గుర్తించి, సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో యజమాని జనార్దన్ మొత్తం రూ.12,805 చెల్లించి, సంబంధిత రసీదును పోలీసులకు అందజేయడంతో వాహనాన్ని అప్పగించారు.



షటిల్ ఆడుతూ..



వ్యాయామం చేస్తూ..



యోగా చేస్తూ..

'పొన్నం' మార్నింగ్ వాక్

రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ఉదయం నగరంలోని అంబేడ్కర్ స్టేడియంలో మార్నింగ్ వాక్ చేశారు. ఈ సందర్భంగా ఇండోర్ స్టేడియంలో షటిల్ ఆడారు. ఓపెన్‌జిమ్‌లో వ్యాయామం చేసి యోగాసనాలు వేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్



ట్రాఫిక్.. క్లియర్!

కరీంనగర్‌క్రైం:నగరంలోని మార్కెట్ ఏరియాల్లో విపరీతమైన రద్దీ ఉంటోంది. వాహనాలు వెళ్లడం కష్టతరమవడంతో పాటు పార్కింగ్ ప్రదేశాలు లేక ప్రజలు ఇన్ని రోజులు నరకం చూశారు. నో పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు నిలిపితే ఫైన్‌లు పడడం, పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు లేకపోవడంతో నానా తిప్పలు పడేవారు. ముఖ్యంగా టవర్‌సర్కిల్, ప్రధాన కూరగాయాల మార్కెట్, ప్రకాశం గంజ్‌కు వచ్చే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడంతో వాహనాలు నిలపడం కష్టంగా మారింది. ఈ తరుణంలో పోలీసులు పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు కేటాయించి పార్కింగ్ కష్టాలకు పోలీసులు పరిష్కారం చూపడంతో వాహనదారులకు ఊరట కలిగింది.

- నగరంలో టవర్‌సర్కిల్, మార్కెట్ ప్రాంతంలో రద్దీ
- పెరుగుతున్న వాహనాలు
- కష్టాలకు బ్రేక్ వేసిన ట్రాఫిక్ పోలీసులు
- పార్కింగ్‌కు స్థలాలు కేటాయింపు

రెండు ప్రదేశాల్లో పార్కింగ్

నగరంలో అతి ఎక్కువ రద్దీగా ఉండే ప్రాంతమంటేనే టవర్‌సర్కిల్, ప్రధాన కూరగాయల మార్కెట్, ప్రకాశం గంజ్‌లు. ఈ ప్రాంతాలు దుస్తులు, కూరగాయాలు, భవన నిర్మాణ సామగ్రి, ప్లాస్టిక్ దుకాణాలు, నూనె, ఇతరత్రా వ్యాపారాలకు నిలయం. ఎక్కువగా ఈ ప్రాంతాలకు నగరవ్యాప్తంగా ఉండే ప్రజలతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు, వ్యాపారులు వస్తుంటారు. దీంతో సుమారుగా రోజు ఉదయం నుంచి రాత్రి వరకు సుమారుగా 1 లక్ష మంది వరకు వచ్చిపోతుండగా 40 వేలకు పైగా వాహనాలు వచ్చి వెళ్తుంటాయి. గతంలో పాత టెలిఫోన్ భవన్ వద్ద గల చౌరస్తా వద్ద రోడ్డు మీదనే కార్లు పార్కింగ్ చేయడం, బైకులు రోడ్డు మధ్యలోనే పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ రద్దీ పెరిగి వాహనాలు నిలిచిపోతుండేవి. కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఎదురుగా గల మున్సిపల్ స్థలంతో పాటు ఇంటిగ్రెటెడ్ మార్కెట్‌లలో రెండు ప్రదేశాల్లో ప్రత్యేకంగా వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ ప్లేస్‌లు ఏర్పాటు చేశారు. వాహనదారులు గతంలో ఎదుర్కొన్న ట్రాఫిక్ సమస్యలైన ట్రాఫిక్ సిగ్నల్, పార్కింగ్ ప్లేస్‌లు లేక పడిన రెండు సమస్యలకు పోలీసులు పరిష్కారం చూపారు.



మార్కెట్ ప్రాంత పార్కింగ్ స్థలంలో పోలీసులు

ప్రత్యేకంగా పార్కింగ్ కోసం



నగరంలో వాహనదారులు ఎదుర్కొంటున్న పార్కింగ్ సమస్యకు ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం రెండు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశాం. గతంలోని మున్సిపల్ స్థలం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కోసం ఏర్పాటు చేసిన స్థలాల్లో పార్కింగ్ చేపిస్తున్నాం. రోడ్ల మీద, రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకుంటున్నాం. వాహనదారులు ప్రత్యేకంగా పార్కింగ్ ఏర్పాటు చేసిన స్థలంలోనే పార్కింగ్ చేయాలి.

– ఎండీ. కరీం ఉల్లా ఖాన్, ట్రాఫిక్ సీఐ



వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో శ్రీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేదపండితులు సుధాకర్‌శర్మ, కమలాకర్, శ్రీనివాస్‌శర్మల ఆధ్వర్యంలో శ్రీ భూనీలా–చెన్నకేశవ స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బుర్ర తిరుపతిగౌడ్, కరీంనగర్ సింగిల్‌విండో చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు కూర నరేశ్‌రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, అనంతరెడ్డి, మాసగోని రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది'

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్ జనార్దన్‌రావు అన్నారు. శుక్రవారం నగరంలోని సుభాష్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అల్లాడి లక్ష్మణమూర్తి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా లక్ష్మణమూర్తి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఖాజా నజీరొద్దీన్, మండల విద్యాధికారి మధుసూదనాచారి, గోగులకొండ మోహన్, కటకం రమేశ్, గాజుల రవీందర్, మోతె చంద్రశేఖర్‌రెడ్డి, జాన్ సుధాకర్, రాజిరెడ్డి, మహేందర్ రెడ్డి, ప్రభాకర్‌రావు, ఖాజా మంజూర్ అలీ, అశోక్ రావు తదితరులు, పాల్గొన్నారు.



లక్ష్మణమూర్తిని సన్మానిస్తున్న డీఈవో జనార్దన్

హుస్నాబాద్‌లో పిచ్చాస్పత్రిని ఏర్పాటు చేయించండి

- బండి సంజయ్‌కు హుస్నాబాద్ తాజా మాజీ సర్పంచుల వినతి

కరీంనగర్‌టౌన్: హుస్నాబాద్‌లో పిచ్చాసుపత్రిని ఏర్పాటు చేయించాలని హుస్నాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు తాజా మాజీ సర్పంచులు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్‌ను కోరారు. శుక్రవారం కరీంనగర్‌కు వచ్చిన పలువురు తాజా మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత నుంచి హుస్నాబాద్ నియోజకవర్గం సహా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతూ ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, పిచ్చిపిచ్చి చేష్టలతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. సొంత పార్టీ నేతలు కూడా పొన్నం ప్రభాకర్ వద్దకు వెళ్లాలంటనే భయపడే పరిస్థితి నెలకొందన్నారు. పొన్నం ప్రభాకర్ తీరును చూస్తుంటే ఆయనకు మతి స్థిమితం కోల్పోయినట్లుందని, ఆయన మెప్పు పొందేందుకు మరికొందరు కాంగ్రెస్ నాయకులు కూడా ఇదే తీరులో వ్యవహరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని వెల్లడించారు. ఇలాంటి వారికి మానసిక చికిత్స అవసరమని భావిస్తున్నటు పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా సమీపంలో ఎక్కడా మెంటల్ ఆసుపత్రి లేనందున భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెంటల్ ఆసుపత్రిని ఏర్పాటు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని వినతిలో పేర్కొన్నారు.



ఎంపీ బండి సంజయ్‌కు వినతిపత్రం ఇస్తున్న తాజా మాజీ సర్పంచులు

'మానేరు'లో మట్టి దందా

- అనుమతుల్లేకుండా యథేచ్ఛగా తవ్వకాలు, అక్రమ రవాణా
- ఎన్నికల విధుల్లో అధికారులు.. మట్టి దోపిడీలో అక్రమార్కులు



ఎలగందుల శివారులోని మానేరు రిజర్వాయర్‌లో ట్రాక్టర్‌లో మట్టి నింపుతున్న జేసీబీ

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం ఎలగందుల శివారులోని పాత రోడ్డు సమీపంలో గల మానేరు రిజర్వాయర్‌లో మట్టి దందా జోరుగా సా...గుతోంది. కొద్ది రోజులుగా రాత్రింబవళ్లు అనే తేడా లేకుండా యథేచ్ఛగా మట్టి తవ్వకాలు చేపడుతూ అక్రమ రవాణాకు తెరతీశారు. మానేరు రిజర్వాయర్‌లో నీరు అడుగంటడంతో పాటు అధికారులు ఎన్నికల విధుల్లో ఉండటం అక్రమార్కులకు వరంగా మారింది. నీటిపారుదల, మైనింగ్, రెవెన్యూ, పోలీస్, రవాణా, ప్రత్యేక అధికారులెవ్వరూ ఈ అక్రమ మట్టి రవాణాపై దృష్టి సారించకపోవడంతో వారికి అడ్డూ అదుపులేకుండా పోయింది. జేసీబీల సహాయంతో మట్టిని తవ్వుతూ టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ఆ ప్రాంతంలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదకరంగా పరిణమిస్తోంది. అనుమతుల్లేకుండా అక్రమ తవ్వకాలతో లక్షలాది రూపాయల ఖనిజ సంపద అక్రమార్కుల పాలవుతోంది. తవ్విన మట్టిని కరీంనగర్ తదితర ప్రాంతాలకు తరలిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలను నిలుపుదల చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



తవ్వకాలతో ఏర్పడ్డ గుంతలు

అక్రమ మట్టి రవాణాను ఉపేక్షించం

మానేరు రిజర్వాయర్ నుంచి అక్రమ మట్టి రవాణాను ఉపేక్షించం. అధికారులు ఎన్నికల విధుల్లో ఉండగా అక్రమ మట్టి రవాణా జరుగుతోంది. ఎక్కడైనా మట్టి రవాణా జరుగుతున్న సమాచారం అందజేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటాం.

– రాజేశ్, తహసీల్దార్, కొత్తపల్లి

అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సభ

కరీంనగర్‌రూరల్: కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాల మేరకు కరీంనగర్ మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సభ నిర్వహించారు. జూబ్లీనగర్‌లో జరిగిన సభలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.నిర్మల, డాక్టర్ శ్రీకాంత్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పిల్లలు, తల్లులు సరైన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతీ శుక్రవారం సభ నిర్వహించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి, ఎంపీడీవో సంజీవరావు, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌రావు, అంగన్‌వాడీ టీచరు స్వరూపరాణి, ఏఎన్ఎం సుగుణ, ఆశావర్కర్ వసంత తదితరులు పాల్గొన్నారు.



జూబ్లీనగర్‌లో సమావేశమైన అధికారులు

మోడల్ ఈఏపీసెట్, నీట్‌లను జయప్రదం చేయండి

కరీంనగర్: జిల్లాలో ఈనెల 26 నుంచి 28వరకు నిర్వహించనున్న మోడల్ ఈఏపీసెట్, నీట్‌లను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ అన్నారు. శుక్రవారం సంఘ కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ అధ్యక్షతన జరిగిన జిల్లా ఆఫీసు బేరర్ సమావేశంలో పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్ఎస్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మోడల్ ఈఏపీసెట్, నీట్ పరీక్షను 19 ఏళ్లుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారని అన్నారు. విద్యార్థులకు ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో పరీక్షపై అవగాహన కల్పించి పేద విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కలిగి ఉండేలా చేసేందుకే ఎస్ఎఫ్ఐ ప్రయత్నం చేస్తోందని తెలిపారు. దీనిని ప్రతీ ఒక్క విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గరల్స్ కన్వీనర్ పూజ, జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, ఉపాధ్యక్షులు శ్రీజ, రోహిత్, వినయ్, సహాయ కార్యదర్శులు ఇశాక్, నాగుల శ్రీజ, బొగేశ్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రెండు లక్షల రుణమాఫీ చేయాలి



కొనుగోలు కేంద్రం వద్ద మాట్లాడుతున్న నాయకులు

చిగురుమామిడి: ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని, తక్షణం రెండు లక్షల రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని సీతారాంపూర్‌లో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల వ్యాప్తంగా అన్ని కొనుగోలు కేంద్రాల్లో 42 కిలోలు తూకం వేస్తున్నారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి 40 కిలోలు మాత్రమే తూకం వేయాలని ఆదేశాలు జారీ చేసినా కిందిస్థాయి సిబ్బంది పట్టించుకోకుండా రైతులను దోపిడీ చేస్తున్నారని అన్నారు. అనంతరం గ్రామంలోని ఈజీఎస్ కూలీలవద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. సకాలంలో వేతనాలు విడుదల చేసి కూలీలను ఆదుకోని పక్షంలో ఆందోళనలు చేపడతామన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజయ్య, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు భేతి రాజిరెడ్డి, నాయకులు కొంరయ్య, శ్యామకూర సంపత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నాయకులున్నారు.

న్యూ మిలీనియం స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి

కరీంనగర్: పదో తరగతి పరీక్షల ఫలితాలు రాకముందే గతేడాది ఫలితాలతో హోర్డింగ్‌లు పెట్టి ప్రచారం చేస్తున్న న్యూమిలీనియం స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం డీఈవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సంధ గణేశ్ మాట్లాడుతూ ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న జమ్మికుంటలోని న్యూ మిలియన్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని కోరారు. జిల్లా అధికారుల నిర్లక్ష్యం వల్లనే ప్రైవేట్ పాఠశాల యజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సాయి, తిరుపతి, కుమార్‌లు ఉన్నారు.



వినతిపత్రం ఇస్తున్న యూఎస్ఎఫ్ఐ నాయకులు

ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శివసాయి



శివసాయి

కరీంనగర్‌రూరల్: ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కరీంనగర్ మండలం బొమ్మకల్‌కు చెందిన కుడిదల శివసాయిని నియమిస్తూ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ నర్సింగరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శివసాయి మాట్లాడుతూ.. విద్యార్థులను సమీకరించి జిల్లాలో ఎన్ఎస్‌యూఐని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, ఏఐసీసీ రీసెర్చ్ సెంటర్ జాతీయ కో ఆర్డినేటర్ కాశిపాక రాజేశ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మునిగంటి అనిల్, కరీంనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్‌రావు

హుజూరాబాద్: ప్రముఖ న్యాయవాది, ప్రజా సంఘాల నాయకుడు అందె వెంకటేశ్వర్‌రావును ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వినయ్ కుమార్, మహేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మధు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా నియామకానికి సహకరించిన వినయ్ కుమార్, మధు, మహేశ్, రామచందర్, సతీశ్‌కు వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు.

నియామకం



మహేందర్

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా జేరిపోతుల మహేందర్ నియామకమయ్యారు. ఈమేరకు శుక్రవారం కరీంనగర్‌లో జరిగిన ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం విస్తృతస్థాయి సమావేశంలో మహేందర్‌కు జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాల్వల రామచంద్రంలు నియమాక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

కల్లు గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్ కార్పొరేషన్: కల్లు గీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. చెట్టు మీద నుంచి ప్రమాదవశాత్తు పడి మరణించిన, శాశ్వత అంగ వికలాంగులైన వారికి ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచాలన్నారు. ఎక్స్‌గ్రేషియా బకాయిలను చెల్లించాలన్నారు. గీత కార్మికులకు రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలని కోరారు.

22న పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

చిగురుమామిడి: మండలంలోని ముదిమాణిక్యం గ్రామంలో 22న పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు జక్కుల బాబు తెలిపారు. చిగురుమామిడిలో శుక్రవారం మాట్లాడారు. 20 నుంచి ప్రత్యేక కార్యక్రమాలుంటాయన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం అన్నదానం, అదే రోజు సాయంత్రం పోచమ్మతల్లి బోనాలు, తర్వాత రోజు ఉదయం పెద్దమ్మ తల్లి బోనాలు, 24న జాతర నిర్వహిస్తామన్నారు. ఐదు గుంటల స్థలంలో దాదాపు రూ. నలభై లక్షలతో ఆలయాన్ని అన్ని హంగులతో నిర్మించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ జక్కుల రవీందర్, కార్యదర్శి మల్లేశం, స్వామి, సమ్మయ్య, వెంకటయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఒగ్గుపూజారులు

క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చామనపల్లిలో శుక్రవారం మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని పద్మశాలీ సంఘం అధ్యక్షుడు జి.శ్రీకాంత్ ప్రారంభించారు. జనరల్ ఫిజిషియన్ డాక్టర్ రావికంటి నాగరాజు ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది సుమారు 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జి గుర్రం కిరణ్, పద్మశాలీ సంఘం ప్రతినిధులు ఎం.మల్లేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రేవీయార్డ్ పనుల్లో అక్రమాలపై విచారణ జరిపించాలి

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని పాత బజార్ శివాలయం సమీపంలో గల గ్రేవీయార్డ్‌లో జరిగిన రోడ్ల పనుల్లో నాణ్యతపై విచారణ జరిపించాలని హ్యూమన్‌రైట్స్ జిల్లా అధ్యక్షుడు మొగిలి సతీశ్ నగర పాలక సంస్థ కమిషనర్‌ను కోరారు. నిర్మాణ పనుల్లో దొడ్డు ఇసుక, నాసిరకం ఇటుకలు వాడారని ఆరోపించారు. ఈ పనులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా సంతోష్‌రాజ్



నియామకపత్రం అందుకుంటున్న సంతోష్‌రాజ్

కరీంనగర్‌టౌన్: బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా కరీంనగర్‌కు చెందిన అల్లెంకి సంతోష్ రాజ్ నియమితులయ్యారు. ఈమేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి శుక్రవారం నియామకపు పత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకంతో బీజేపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పదవికి అవకాశం కల్పించిన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు సంతోష్ రాజ్ తెలిపారు. కరీంనగర్‌లో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి, త్వరలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ గెలుపు కోసం శాయశక్తుల కృషి చేస్తానన్నారు.

కమలదళం.. వికేంద్రీకరణం!

డబుల్ డిజిట్ సీట్ల కోసం బీజేపీ వ్యూహం

క్షేత్రస్థాయిలో పోలింగ్ బూత్‌లు కేంద్రంగా ప్రచార ప్రణాళికలు

వీలైనన్ని ఎక్కువసార్లు ఓటర్లను కలిసేలా సన్నాహాలు

అగ్రనేతలు వచ్చినప్పుడే పెద్ద బహిరంగ సభలు

ఇంటింటి ప్రచారంపైనే ప్రధానంగా దృష్టి

వీధి మలుపు సమావేశాలు, 'ఔట్‌రీచ్'కు ప్రాధాన్యత

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో డబుల్ డిజిట్ ఎంపీ సీట్లు గెలుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న కమలదళం ఇందుకోసం వికేంద్రీకరణ వ్యూహాన్ని అమలు చేస్తోంది. క్షేత్రస్థాయిలో పోలింగ్ బూత్‌లు కేంద్రంగా ప్రణాళికలు రచించింది. గత నెల ఎల్‌బీ స్టేడియంలో రాష్ట్రవ్యాప్తంగా 30 వేల మంది పోలింగ్ బూత్ కమిటీల అధ్యక్షులు, ఆపై మండల, జిల్లా స్థాయి అధ్యక్షులకు పార్టీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన దిశానిర్దేశానికి అనుగుణంగా ముందుకు సాగనుంది. పోలింగ్ బూత్‌ల కేంద్రంగా కార్యకలాపాలపై ప్రత్యేకంగా దృష్టిని కేంద్రీకరిస్తోంది. వికేంద్రీకరణ పద్ధతిలో క్షేత్రస్థాయికి ప్రాధాన్యతనిస్తూ వివిధ స్థాయిల్లో వివిధ రకాల ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతోంది.

ఓటర్లను పలుమార్లు కలిసేలా..

వచ్చేనెల 13న పోలింగ్ జరిగేలోగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పోలింగ్ బూత్ పరిధిలోని ప్రతి ఇంటి తలుపు మూడుమార్లు తట్టి ఓటర్లను కలుసుకుని బీజేపీకి మద్దతు కోరాలని ఇప్పటికే నిర్ణయించారు. దీనితో పాటు ఒక్కో లోక్‌సభ సీటు పరిధిలో కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేసుకుని బూత్ కమిటీలను పరవేక్షించనున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల నుంచి క్రమం తప్పకుండా ఫీడ్‌బ్యాక్ తీసుకోవడం, తమ వద్దనున్న డేటాతో సరి చూసుకోవడం లాంటివి చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఈ నెల 15, 16, 17 తేదీల్లో తొలివిడత కార్యక్రమం ముగిసింది. ఈ నెల 28, 29, 30 తేదీల్లో రెండో విడత, సరిగ్గా పోలింగ్‌కు ముందు మే 9, 10, 11 తేదీల్లో మూడోవిడతలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రతి ఓటర్‌ను కలిసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధమవుతున్నారు. బూత్ స్థాయిలో కేంద్ర ప్రభుత్వ లబ్ధిదారులను కలిసి పూర్తిస్థాయిలో మద్దతు కూడగట్టాలని, ఈ నెల 29న నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిశాక క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయాలని నిర్ణయించారు.

నామినేషన్ కార్యక్రమాలకు కేంద్ర మంత్రులు

ఈ నెల 25 నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ కాగా 22 నుంచి బీజేపీ అభ్యర్థుల నామినేషన్ పత్రాల సమర్పణ ఊపందుకోనుంది. తొలి రెండురోజుల్లో సికింద్రాబాద్ (కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి) సహా ఐదుచోట్ల అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఇక 22న జహీరాబాద్‌లో బీబీ పాటిల్, చేవెళ్లలో కొండా విశ్వేశ్వరరెడ్డి, నల్లగొండలో సైదిరెడ్డి, మహబుబాబాద్‌లో సీతారాం నాయక్ నామినేషన్లు దాఖలు చేయనున్నారు. 23న భువనగిరిలో బూర నర్సయ్య, 24న పెద్దపల్లిలో గోమాస శ్రీనివాస్, ఆదిలాబాద్‌లో నగేష్, హైదరాబాద్ మాధవీలత, వరంగల్‌లో ఆరూరి రమేష్, చివరిరోజు 25న కరీంనగర్‌లో బండి సంజయ్, నిజామాబాద్‌లో అర్వింద్, నాగర్‌కర్నూల్‌లో భరత్ ప్రసాద్ నామినేషన్లు వేస్తారు. ఈ కార్యక్రమాల్లో కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, జైశంకర్, అనురాగ్ ఠాకూర్, కిరణ్ రిజిజు, గుజరాత్, ఉత్తరాఖండ్ సీఎంలు భూపేంద్ర పటేల్, పుష్కర్‌సింగ్‌లు పాల్గొననున్నారు.

మే మొదటి వారంలో కార్నర్ మీటింగులు

ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేయడంలో భాగంగా మే 1 నుంచి 8 దాకా కార్నర్ మీటింగులు నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. మూడు, నాలుగు పోలింగ్ బూత్‌లకు కలిపి ఓ కార్నర్ మీట్‌ను నిర్వహించి ఓటర్లను స్వయంగా కలుసుకోవడం ద్వారా పార్టీ అభ్యర్థి గెలుపు కోసం మరోసారి అప్పీల్ చేయనున్నారు. పోలింగ్‌కు ముందు పదిరోజులు అభ్యర్థులు పూర్తిగా క్షేత్రస్థాయి సమావేశాలు, బూత్ పర్యటనల్లో పాల్గొనేలా వ్యూహ రచన చేస్తున్నారు. పోలింగ్ బూత్ స్థాయిలో కేడర్‌తో ప్రచారం, ఓటర్ ఔట్ రీచ్ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే 17 ఎంపీ స్థానాలకు పార్లమెంట్ కన్వీనర్లు, ఇన్‌చార్జిలు, పొలిటికల్ ఇన్‌చార్జిల నియామకం పూర్తికావడంతో వారంతా తమకు అప్పగించిన విధుల్లో నిమగ్నమయ్యారు. మే మొదటి వారం నుంచి 11వ తేదీ మధ్య మోదీ, అమిత్‌షా, నడ్డా, ఇతర ముఖ్యనేతలు ఎన్నికల ప్రచారానికి రానున్నారు. వారు వచ్చినప్పుడే పెద్ద బహిరంగ సభలు ఉంటాయి. వికేంద్రీకరణ వ్యూహంలో భాగంగా మిగతా ప్రచారమంతా పలుమార్లు క్షేత్రస్థాయిలో ఓటర్లను కలుసుకోవడం, చిన్న చిన్న సభలు, సమావేశాలు, వీధి చివర మీటింగ్‌లు లాంటి వాటిపైనే పూర్తి స్థాయిలో దృష్టి పెట్టి నిర్వహించనున్నారు.



బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లవి అవినీతి ప్రభుత్వాలు

కేంద్రంలో గత పదేళ్లలో ఒక్క రూపాయి అవినీతి జరగలేదు

కిషన్‌రెడ్డి నామినేషన్ సభలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

రాంగోపాల్‌పేట /సికింద్రాబాద్/సాక్షిప్రతినిధి, ఖమ్మం: తెలంగాణ ఏర్పడితే నీతివంతమైన పాలన అందుతుందని ప్రజలు ఆశించారని, కానీ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అవినీతిమయంగా మారాయని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ విమర్శించారు. గత పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో ఒక్క రూపాయి అవినీతి కూడా జరగలేదని, తమది అవినీతి రహిత ప్రభుత్వమని అన్నారు. శుక్రవారం కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా ప్యాట్నీ సెంటర్‌లో నిర్వహించిన విజయసంకల్ప యాత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ మాట్లాడుతూ కేంద్రంలో ఎప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందో అప్పుడు అవినీతి పెరిగిపోయిందని, ఆ పార్టీ నాయకుల మీద అవినీతి కేసులు నమోదై మంత్రులు కూడా జైలుకు వెళ్లారని ఆయన గుర్తుచేశారు. కానీ బీజేపీ అధికారంలో వచ్చిన పదేళ్లలో ఎక్కడా అవినీతి జరగలేదన్నారు. ఎంతో మంది బలిదానాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని కానీ, రాష్ట్రం ఏర్పడ్డాక అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవినీతిని పెంచి పోషించి రాష్ట్రాన్ని దోచుకుందని ఆయన ధ్వజమెత్తారు. కాగా, కిషన్‌రెడ్డికి మనుషులు మాత్రమే తెలుసని కులం, మతం, రంగును ఆయన చూడరని, ఇన్నేళ్ల రాజకీయాల్లో ఎలాంటి అవినీతి మరక ఆయనకు అంటలేదని అన్నారు. సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానాల నుంచి కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

పదేళ్లలో పది లక్షల కోట్లు ఖర్చు పెట్టాం: కిషన్‌రెడ్డి

గత పదేళ్ల కాలంలో తెలంగాణ అభివృద్ధి కోసం రూ.10 లక్షల కోట్లు ఖర్చు చేశామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం రూ.719 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా తాను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని, నైతిక విలువలకు కట్టుబడి ప్రజల సంక్షేమం కోసం మాత్రమే పని చేశానని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలను మరో మారు ఓటు అడిగే హక్కు కాంగ్రెస్ పార్టీ కోల్పోయిందని, అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన వంద రోజుల్లో అమలు చేస్తామన్న గ్యారంటీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. రైతులు, మహిళలు, యువతకు ఆ పార్టీ వెన్నుపోటు పొడిచిందన్నారు. తెలంగాణలో 17 స్థానాల్లో బీజేపీ గెలుస్తుందని, మరో మారు మోదీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీకి రేపు అనేది లేదని, కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనేది బీజేపీ మాత్రమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ కె. లక్ష్మణ్, మాజీ మంత్రి కృష్ణయాదవ్, ఈటల రాజేందర్, మర్రి శశిధర్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, ప్రేమ్‌సింగ్ రాథోడ్, శ్యాంసుందర్‌గౌడ్, చీర శ్రీకాంత్ పాల్గొన్నారు.

కోలాహలంగా నామినేషన్ దాఖలు చేసిన కిషన్‌రెడ్డి

కిషన్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమం శుక్రవారం కోలాహలంగా సాగింది. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పార్టీ నేతలు లక్ష్మణ్ తదితరులతో కలసి కిషన్‌రెడ్డి దంపతులు ఉజ్జయిని మహంకాళి అమ్మవారి దేవాలయంలో పూజలు చేశారు. అనంతరం ఎస్వీఐటీ ఆడిటోరియం వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ సభలో మాట్లాడారు. తర్వాత సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయానికి వెళ్లి సికింద్రాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా కిషన్‌రెడ్డి నామినేషన్ వేశారు. ఆయన నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి సమర్పించారు. పార్టీ నేతలు లక్ష్మణ్, శ్యాంసుందర్‌గౌడ్, శారదామల్లేశ్, అజయ్‌కుమార్ ఆయన వెంట ఉన్నారు. కాగా, ఖమ్మంలో బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు నామినేషన్ సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీలో కూడా రాజ్‌నాథ్‌సింగ్ పాల్గొన్నారు.


ఆర్‌ఓ అనుదీప్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న అసదుద్దీన్ ఒవైసీ


ఆర్‌ఓ ఉదయ్‌కుమార్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ప్రవీణ్‌కుమార్


మెడలో పసుపుకొమ్ముల దండతో నామినేషన్ వేసేందుకు వస్తున్న అర్వింద్

రెండో రోజు 57 నామినేషన్లు

మంచి రోజు కావడంతో నామినేషన్లు వేసిన ఎంపీ అభ్యర్థులు

లోక్‌సభ ఎన్నికల కోసం రెండు రోజుల్లో 117 సెట్ల నామినేషన్లు దాఖలు

భారీ ర్యాలీలు, హంగూ ఆర్భాటాలతో అభ్యర్థుల బల ప్రదర్శనలు

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల నామినేషన్లు శుక్రవారం ఊపందుకున్నాయి. ఏకాదశి మంచిరోజు కావడంతో ప్రధాన పార్టీల నుంచి కీలక నేతలతోపాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా పెద్ద సంఖ్యలో నామినేషన్లు వేశారు. మొత్తంగా రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకుగాను.. రెండో రోజున 57 మంది అభ్యర్థులు 69 సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు అందించారు. తొలిరోజున 42 మంది అభ్యర్థులు వేసిన 48 సెట్ల నామినేషన్లు కలిపి.. మొత్తంగా 117 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి.

భారీ ర్యాలీలు, బల ప్రదర్శనతో..: నామినేషన్ల సందర్భంగా అభ్యర్థులు పెద్ద సంఖ్యలో జనాన్ని సమీకరించి భారీ ర్యాలీలు నిర్వహించారు. హంగూ ఆర్భాటాలతో బల ప్రదర్శన చేశారు. దీంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారుల కార్యాలయానికి వెళ్లే రహదారుల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. సికింద్రాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఖమ్మంలో బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు నామినేషన్లు వేశారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఈ కార్యక్రమాల్లో పాల్గొని, అనంతరం నిర్వహించిన సభల్లో మాట్లాడారు. సికింద్రాబాద్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పద్మారావుగౌడ్ నామినేషన్ వేశారు. మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా వంశీచంద్‌రెడ్డి నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పలువురు సీనియర్ల నామినేషన్లు..: శుక్రవారం నామినేషన్లు దాఖలు చేసిన వారిలో కాంగ్రెస్ నుంచి పోరిక బలరాం నాయక్ (మహబూబాబాద్), గడ్డం వంశీ (పెద్దపల్లి), చల్లా వంశీచంద్‌రెడ్డి (మహబూబ్‌నగర్) ఆత్రం సుగుణ (ఆదిలాబాద్) ఉన్నారు. బీఆర్‌ఎస్ నుంచి కొప్పుల ఈశ్వర్ (పెద్దపల్లి), బాజిరెడ్డి గోవర్ధన్ (నిజామాబాద్), మన్నె శ్రీనివాస్‌రెడ్డి (మహబూబ్‌నగర్), ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ (నాగర్ కర్నూల్).. బీజేపీ తరపున బూర నర్సయ్యగౌడ్ (భువనగిరి), ధర్మపురి అర్వింద్ (నిజామాబాద్).. సీపీఎం నుంచి ఎండీ జహంగీర్ (భువనగిరి) నామినేషన్లు వేశారు. పలు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలతో పాటు బీఎస్పీ, ధర్మ సమాజ్ పార్టీ, స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీలు కాకుండా.. భువనగిరి నుంచి ఇద్దరు, మహబూబాబాద్‌లో ఐదుగురు, నల్గొండలో నలుగురు, పెద్దపల్లిలో ముగ్గురు, మహబూబ్‌నగర్‌లో ఐదుగురు, వరంగల్‌లో ముగ్గురు, నిజామాబాద్‌లో ఆరుగురు చొప్పున నామినేషన్లు సమర్పించారు.

రాష్ట్రంలో రెండు కాంగ్రెస్‌లు

రేవంత్ కాంగ్రెస్ ఒకటి.. రాహుల్ కాంగ్రెస్ మరొకటి

మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలు



జహీరాబాద్: రాష్ట్రంలో రెండు కాంగ్రెస్ పార్టీలు నడుస్తున్నాయని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఒకటి రాహుల్ గాంధీ కాంగ్రెస్ అయితే, మరొకటి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌గా వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి ఒరిజినల్ కాంగ్రెస్ కాదని, రేవంత్ ఎజెండా వేరు, రాహుల్ ఎజెండా వేరుగా ఉందన్నారు. గుజరాత్ మోడల్‌ను పీఎం మోదీ ఎదుట రేవంత్ పొగిడారని, రాహుల్ మాత్రం గుజరాత్ మోడల్ డొల్ల అని విమర్శిస్తున్నారని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి బీజేపీ కనుసన్నల్లో పనిచేస్తున్నారని, ఆయన రాజకీయ పునాదులు ఆర్‌ఎస్‌ఎస్‌తో ఉన్నాయని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో ఏ కాంగ్రెస్‌కైనా మూడో స్థానమే దిక్కు అని హరీశ్ జోస్యం చెప్పారు. కేరళ సీఎం, సీపీఎం నేత పినరయి విజయన్‌ను రేవంత్ బీజేపీ తొత్తు అని విమర్శించారని, సీపీఎం ఏనాడైనా బీజేపీతో కలుస్తుందా? అని హరీశ్ ప్రశ్నించారు.

అబద్ధాల్లో రేవంత్, భట్టి పోటీ

అబద్ధాలు ఆడటంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు పోటీ పడుతున్నారని హరీశ్‌రావు విమర్శించారు. శుక్రవారం రాత్రి సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఈద్‌మిలాప్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. నిరుద్యోగ భృతిపై ప్రియాంక గాంధీ మాట ఇచ్చారని,, కాంగ్రెస్ మేనిఫెస్టోలో కూడా పెట్టిందని గుర్తు చేశారు. భట్టి విక్రమార్క మాత్రం తాము నిరుద్యోగభృతి ఇస్తామని ఎక్కడా చెప్పలేదని నిండు అసెంబ్లీలో అబద్ధం ఆడారని ఆరోపించారు. తాజాగా రైతుల రుణమాఫీపై భట్టి విక్రమార్క నాలుక మడత పెట్టారని విమర్శించారు. ఇది రాష్ట్రంలోని 70లక్షల మంది రైతులను ఘోరంగా అవమానించడమేనని విమర్శించారు.

ఏపీలో బాబు మాదిరే.. ఇక్కడ కూడా

ఆంధ్రలో టీడీపీ, బీజేపీ కలిశాయని, అదే విధానం మేరకు చంద్రబాబు మిత్రుడు ఇక్కడ బీజేపీతో మిలాఖత్ అయ్యారని హరీశ్‌రావు సీఎం రేవంత్‌ను ఉద్దేశించి విమర్శించారు. బీజేపీని వ్యతిరేకిస్తూ వచ్చింది బీఆర్‌ఎస్సేనని గుర్తు చేశారు. మళ్లీ కాంగ్రెస్ వచ్చాకే బీజేపీ బలపడుతోందన్నారు. సికింద్రాబాద్, చేవెళ్ల, మల్కాజిగిరి లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ బలహీన అభ్యర్థులను పెట్టి బీజేపీని గెలిపించే ప్రయత్నం చేస్తోందని హరీశ్ ఆరోపించారు.

బీజేపీపై పోరాడే సమయం లేదా?

సీఎం రేవంత్‌పై సీపీఎం నేత రాఘవులు ధ్వజం

బీజేపీని అడ్డుకోవడానికి కాంగ్రెస్‌తో కలసి పనిచేసేందుకు సిద్ధం


జహంగీర్ నామినేషన్ దాఖలు సందర్భంగా డప్పు వాయిస్తున్న బీవీ రాఘవులు

సాక్షి, యాదాద్రి: కేరళకు వెళ్లి సీపీఎంను తిట్టేంత సమయం ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీజేపీపై పోరాడటానికి మాత్రం లేదని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు విమర్శించారు. పేనుకు పెత్తనం ఇస్తే తలంతా కొరికినట్లు.. కేరళకు వెళ్లి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయ్‌ని రేవంత్ విమర్శిస్తున్నారని ధ్వజమెత్తారు. ఆయన ఓటుకు నోటు సంగతి ఏమైందని ప్రశ్నించారు. భువనగిరి లోక్‌సభ స్థానం నుంచి సీపీఎం అభ్యర్థిగా ఎండీ జహంగీర్ నామినేషన్ దాఖలు సందర్భంగా జరిగిన బహిరంగసభలో రాఘవులు పాల్గొన్నారు. ఈ సభలో మాట్లాడుతూ, నోరు పారేసుకోవద్దని రేవంత్‌రెడ్డికి సూచించారు. కేసీఆర్ అహంకారంతోనే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారని, సీఎం రేవంత్ ఆ బాటలో నడవద్దని అన్నారు. కేరళలో బీజేపీ, కమ్యూనిస్టులు కలసి పనిచేస్తున్నారని రేవంత్ పేర్కొనడం అతని అవివేకం అని అన్నారు. కేరళ ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్లి సమస్యల పరిష్కారం కోసం ధర్నా చేసిన విషయం మర్చిపోయారా అని ప్రశ్నించారు. కవితను బీజేపీ జైల్లో పెట్టిందని, ఇప్పటికైనా బీఆర్‌ఎస్ ఇండియా కూటమిలోకి రావాలని సూచించారు. కేంద్రంలో ప్రత్యామ్నాయ లౌకిక ప్రభుత్వ ఏర్పాటుకు తోడ్పడాలని ఆయన ప్రజలను కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీని అడ్డుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్‌తో కలసి పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని రాఘవులు అన్నారు.

మమ్మల్ని కలుస్తామని కాంగ్రెస్ సమాచారం ఇచ్చింది : తమ్మినేని

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. బీజేపీని ఓడించడానికి అందరితో కలసి వెళ్తామని, ఇండియా కూటమి పార్టీలను కాంగ్రెస్ సంప్రదిస్తూ పెద్దన్న పాత్ర పోషించాలని అన్నారు. ఈ నెల 21న కాంగ్రెస్ నాయకత్వం సీపీఎంను కలవనున్నట్లు సమాచారం ఇచ్చిందని వెల్లడించారు. అయినప్పటికీ తెలంగాణలో భువనగిరి నుంచి సీపీఎం పోటీచేయడం ఖాయమన్నారు.

కేసీఆర్ ఆడితే రేవంత్ ఆడరా?

ఆయన వ్యూహాలను తిప్పికొట్టే శక్తి కాంగ్రెస్ దగ్గర ఉంది: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: అధికారంలో లేని కేసీఆర్ గేమ్ ఆడితే సీఎం హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డి గేమ్ ఆడకుండా ఉంటారా? అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని కేసీఆర్ ఏ ఆలోచనతో అన్నారో తనకు తెలియదు కానీ ఆయన వ్యూహాన్ని తిప్పికొట్టే శక్తియుక్తులు తమ వద్ద ఉన్నాయని వ్యాఖ్యానించారు. శుక్రవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధులు బైకాని లింగం యాదవ్, చనగాని దయాకర్‌తో కలిసి జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యేలు పార్టీలో చేరే అంశం తన పరిధిలో లేదని, ఎంత మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు తమ పార్టీలోకి వస్తారనేది లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలుస్తుందన్నారు. వందమంది కౌరవులను ఐదుగురు పాండవులు ఓడించారని, తెలంగాణలో తాము పాండవులమని జగ్గారెడ్డి అభివర్ణించారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మూడో స్థానంలో ఉందని చెప్పిన ఆయన సోషల్ మీడియాలో మాత్రం ఆ పార్టీ ముందంజలో ఉందని ఎద్దేవా చేశారు. ఉత్తరాదిలో బీజేపీ గ్రాఫ్ పడిపోతోందని, లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి సీట్లు తగ్గుతాయన్నారు.

Affidavit

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బరిలో ఉన్న అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా అఫిడవిట్‌లో స్థిర,చర ఆస్తులు.. అప్పులు, బంగారం, వాహన వివరాలన్నీ పొందుపరిచారు. అవేంటో చూద్దాం. - సాక్షి నెట్‌వర్క్

కిషన్‌రెడ్డి కారు.. మారుతి-800

సికింద్రాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి తనపేరిట 1995లో కొనుగోలు చేసిన మారుతి-800 కారు మాత్రమే ఉందని, తన భార్య, పిల్లల పేరిట వాహనాలేమీ లేవని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తనకు ఎలాంటి అప్పులు లేవని, భార్య కావ్యకు మాత్రం రూ.1.63 కోట్ల మేర వివిధ రుణాలు ఉన్నాయని తెలిపారు. తన పేరిట చరాస్తులు 69,23 లక్షలు, స్థిర ఆస్తులు రూ.1.73 కోట్లు భార్య పేరిట చరాస్తులు రూ. 3.84 కోట్లు, స్థిర ఆస్తులు రూ.7.93 కోట్లుగా చూపారు.

బంగారం లేని 'బండి'

కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ తన పేరిట రూ.65.70లక్షలు, తన భార్య పేరిట రూ.47.05లక్షల విలువైన చరాస్తులు ఉన్నట్టు అఫిడవిట్‌లో చూపారు. తనకు రూ.5లక్షలు, తన భార్య వద్ద రూ.లక్ష నగదు ఉందని, తన వద్ద బంగారు ఆభరణాలు లేవని, తన భార్యకు 43 తులాల బంగారం ఉన్నట్టు పొందుపరిచారు.

కేసులు లేని కొప్పుల

పెద్దపల్లి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ తన కుటుంబానికి రూ.5.22కోట్ల ఆస్తులు ఉన్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తనపై కేసులు లేవని, తనకు రూ.20వేలు, తన భార్యకు రూ.15వేల నగదు ఉన్నట్టు చూపారు. తన వద్ద 60గ్రాముల బంగారం, తన భార్య వద్ద 200 గ్రాముల బంగారం, వెయ్యి గ్రాముల వెండి ఉన్నట్లు పేర్కొన్నారు. తనపేరిట 6 ఎకరాలు, తన భార్య పేరిట 12.31 ఎకరాల వ్యవసాయ భూమి ఉందన్నారు.

కారు లేని వంశీకృష్ణ

తనకు, తన భార్యకు కలిపి రూ.24.09కోట్లు ఆస్తులు ఉన్నట్టు పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తనకు కారు లేదని, కేసులు నమోదు కాలేదని తెలిపారు. తన వద్ద రూ.లక్ష, తన భార్య పేరిట రూ.50వేల నగదు ఉందన్నారు. తనపేరిట 14.27 ఎకరాల భూమి ఉందని, దానివిలువ రూ.4.17కోట్లు చూపారు.

అసద్‌కు సొంత వాహనం లేదట

హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ తన కుటుంబానికి రూ.23.87 కోట్ల ఆస్తులు, రూ.7.05 కోట్ల అప్పులు ఉన్నట్టు అఫిడవిట్‌లో వెల్లడించారు. తనకు, తన భార్యకు ఎలాంటి వాహనం లేదని అందులో పొందుపరిచారు. తన చేతిలో రూ.2.లక్షలు, తన భార్య చేతిలో రూ.50 వేల నగదు, భార్యకు 20 తులాల బంగారం ఉన్నట్టు పేర్కొన్నారు. తన పేరు మీద రూ. 4.30 కోట్ల అప్పులు, తన భార్య పేరిట రూ. 2.75 కోట్ల అప్పులు ఉన్నట్టు వివరించారు.

సొంతిల్లు లేని బలరాం

తనకు సొంతిల్లు, కారు కూడా లేదని కాంగ్రెస్ మహబూబాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. భార్య పేరిట హైదరాబాద్ బంజరాహిల్స్‌లో ఇల్లుతోపాటు కారు ఉందని తెలిపారు. తనకు ఉమ్మడిగా సంక్రమించిన వ్యవసాయ భూమి ఉందని, ప్రసుత్తం దాని విలువ రూ.2కోట్లుగా చూపారు.

అర్వింద్‌కు అగ్రికల్చర్ ల్యాండ్ లేదు

నిజామాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ తన పేరిట ఎలాంటి వ్యవసాయ భూమి లేదని, రూ.47.71 కోట్ల విలువైన చరాస్తులు, రూ.49.81 కోట్ల స్థిరాస్తులు, తన భార్య పేరుపై రూ.12.11 కోట్ల చరాస్తులు ఉన్నాయని అఫిడవిట్‌లో తెలిపారు. వివిధ బ్యాంకుల్లో తన పేరుపై రూ.19.17 కోట్లు, భార్య పేరుతో రూ.11.49 కోట్ల అప్పులు ఉన్నట్టు చూపారు.

అప్పులు లేని 'ఆర్‌ఎస్'

నాగర్‌కర్నూలు బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ తన పేరిట అప్పులు లేవని, భార్య పేరిట రూ. 51,80,897 బ్యాంకులో రుణం ఉన్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన భార్య లక్ష్మీబాయి పేరిట నాగోల్‌లో రూ.55 లక్షల విలువైన ఇంటి స్థలం, తన పేరిట రూ.4,93,225, భార్య పేరిట రూ.43,75,505 విలువ గల ఆస్తులు ఉన్నట్టు చూపారు.

వంశీచంద్ ఆస్తులూ..అప్పులు

మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి తన పేరిట రూ.71,28,903, తన భార్య అశ్లేషరెడ్డి రూ.1,90,42,146 విలువైన ఆస్తులతోపాటు తనపేరిట రూ.20,76,372, భార్య పేరిట రూ.2,66,000 అప్పులు ఉన్నట్టు అఫిడవిట్‌లో తెలిపారు. శేరిఅప్పారెడ్డిపల్లిలో 5 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్టు చూపారు.

డీకే.అరుణ.. 1,540 గ్రాముల బంగారం

మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే.అరుణ తనకు రూ.89.30 లక్షల విలువైన 1,540 గ్రాముల బంగారం ఉన్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన పేరిట ఆస్తులు రూ.3,21,73,518, తన భర్త పేరిట స్థిర ఆస్తులు రూ. 23,26,16,353, తన పేరిట రూ. 22,52,745, భర్త పేరిట రూ.1,38,79,691 అప్పులు ఉన్నట్టు చూపారు. 88.13 ఎకరాలు వ్యవసాయ భూమి ఉందని తెలిపారు.

స్లోగన్ పేలింది

ఎన్నికల్లో దుమ్మురేపిన నినాదాలు

గెలిపించినవి కొన్ని పుట్టి ముంచినవి మరికొన్ని



సినిమాల్లో 'పంచ్' పడితే కలెక్షన్ల సునామీ! అదే పొలిటికల్ 'పంచ్' పేలితే? గెలుపు గ్యారంటీ! రాజకీయ పార్టీలు అదిరిపోయే నినాదాలతో జనాల్లోకి వెళ్తున్నాయి. సూటిగా, సుత్తి లేకుండా ఉండే ఈ 'స్లోగన్స్' ప్రచారాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నాయి. విపరీతంగా వైరలై ప్రజల మనసులతో పాటు ఓటు బ్యాంకులనూ కొల్లగొడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 2019 ఎన్నికల్లో 'రావాలి జగన్, కావాలి జగన్' ఎలా ఊపేసిందో తెలిసిందే. భారత ఎన్నికల చరిత్ర తిరగేస్తే లాల్ బహదూర్ శాస్త్రి మొదలుకుని ఇందిరాగాంధీ, వాజ్‌పేయి, మోదీ, కేజ్రీవాల్ దాకా ప్రతి ఒక్కరి జమానాలోనూ ఆయా పార్టీల విజయాలకు దన్నుగా నిలిచి, రాజకీయాలను మలుపు తిప్పిన నినాదాలెన్నో...

- సాక్షి, నేషనల్ డెస్క్

జై జవాన్, జై కిసాన్

లాల్ బహదూర్ శాస్త్రి ఇచ్చిన ఈ నినాదం ఇప్పటికీ మార్మోగుతూనే ఉంది. 1964లో నెహ్రూ మరణంతో ప్రధాని పదవి చేపట్టిన శాస్త్రికి యుద్ధం స్వాగతం పలికింది. 1965 భారత్–పాక్ వార్‌లో పోరాడుతున్న సైనికుల్లో జోష్ నింపేందుకు, మరోపక్క దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి దేశంలో తిండిగింజల ఉత్పత్తిని పెంచేలా రైతుల్లో స్థైర్యాన్ని పెంచేందుకు ఆయన ఈ నినాదమిచ్చారు. హరిత విప్లవానికి కూడా ఇది దన్నుగా నిలిచింది. తాష్కెంట్‌లో శాస్త్రి మరణానంతరం 1967లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఇందిర సారథ్యంలో కాంగ్రెస్‌కు మళ్లీ విజయం సాధించిపెట్టిందీ ఇదే నినాదం!

గరీబీ హటావో

1971లో ప్రతిపక్షాలు, సొంత పార్టీ చీలిక వర్గం ఏకమై ఎన్నికల పోరుకు దిగినా కూడా ఒంటిచేత్తో కాంగ్రెస్(ఆర్)ను గెలిపించుకున్నారు ఇందిరా గాంధీ. 'పేదరికాన్ని నిర్మూలిద్దామంటూ ఆ ఎన్నికల సందర్భంగా ఆమె ఇచ్చిన ఈ స్లోగన్ జనాల్లోకి బలంగా వెళ్లింది.

ఇందిర హటావో, దేశ్ బచావో

ఎమర్జెన్సీలో అష్టకష్టాలు పడ్డ ప్రతిపక్షాలన్నీ జనతా పార్టీ పేరిట ఏకమై ఇచ్చిన సమైక్య నినాదం. ఇందిరను తొలగించి దేశాన్ని కాపాడాలన్న పిలుపు ఓటర్లను ఆలోచింపజేసింది. దాంతో 1977 సార్వత్రిక ఎన్నికల్లో జనతా పార్టీ ఘనవిజయం సాధించింది. ఇందిరతోపాటు ఆమె తనయుడు సంజీవ్ గాంధీ కూడా ఓటమి చవిచూశారు. దాంతో కాంగ్రెస్ మళ్లీ చీలింది. కాంగ్రెస్(ఐ) సారథిగా 1978 ఉప ఎన్నికలో కర్నాటకలోని చిక్‌మగుళూరు లోక్‌సభ స్థానం నుంచి ఇందిర ఘన విజయం సాధించారు. ఆ సందర్భంగా 'ఏక్ షేర్నీ, సౌ లంగూర్; చిక్‌మగళూరు భాయ్ చిక్‌మగళూరు' (ఇటు ఒక్క ఆడపులి, అటు వంద కోతులు) స్లోగన్ మారుమోగింది.

జబ్ తక్ సూరజ్ చాంద్ రహేగా, ఇందిరా తేరా నామ్ రహేగా

1984లో ఇందిర హత్యానంతరం రాజీవ్ ప్రధాని అయ్యారు. వెంటనే లోక్‌సభను రద్దు చేసి ముందస్తుకు వెళ్లారు. కాంగ్రెస్(ఐ)కి దేశవ్యాప్తంగా మద్దతు వెల్లువెత్తింది. 'సూర్యచంద్రులు ఉన్నంతదాకా ఇందిర పేరు నిలిచి ఉంటుంది' అంటూ ప్రజల్లోకి వెళ్లిన రాజీవ్ ఏకంగా 413 సీట్లతో క్లీన్ స్వీప్ చేసి మళ్లీ ప్రధాని అయ్యారు.

జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్

1996 సార్వత్రిక ఎన్నికల్లో 'బారీ బారీ సబ్ కీ బారీ, అబ్ కీ బారీ అటల్ బిహారీ' (అందరి వంతూ అయింది, ఈసారి అటల్ బిహారీ వంతు) అంటూ బీజేపీ పిలుపునిచ్చింది. దీనికి మచ్చలేని వాజ్‌పేయి ఇమేజ్ తోడై బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమికి అధికారం దక్కింది. తొలిసారి 16 రోజుల్లో పడిపోయిన వాజ్‌పేయి ప్రభుత్వం రెండోసారి 13 నెలలకే పరిమితమైంది. దేశాన్ని వృద్ధి బాటన నడిపేందుకు వైజ్ఞానిక రంగంలో స్వయం ప్రతిపత్తి సాధించాలంటూ 1998లో పిలుపునిచ్చిన 'జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్' నినాదం 1999లో బీజేపీకి విజయాన్ని అందించింది. మూడోసారి ఎన్డీఏ సర్కారును విజయవంతంగా నడిపారు వాజ్‌పేయి.

కొంప ముంచిన 'ఇండియా షైనింగ్'

దేశంలో సెల్ ఫోన్లను ప్రవేశపెట్టడం నుంచి 'స్వర్ణ చతుర్భుజి' హైవేల ప్రాజెక్టు తదితరాలతో ప్రగతికి పెద్దపీట వేసిన వాజ్‌పేయి సర్కారు 2004 ఎన్నికల్లో అతి విశ్వాసంతో బొక్క బోర్లా పడింది. ధరాభారం తదితరాలతో తాము సతమతమవుతుంటే 'ఇండియా షైనింగ్ (భారత్ వెలిగిపోతోంది)' నినాదంతో ఊరూవాడా ఊదరగొట్టడం జనానికి అస్సలు నచ్చలేదు. దాంతో బీజేపీ కొంప మునిగింది. వాజ్‌పేయి సర్కారు ఇంటిబాట పట్టింది.

కాంగ్రెస్ కా హాత్, ఆమ్ ఆద్మీ కే సాత్

దాదాపు ఎనిమిదేళ్ల పాటు అధికారానికి దూరమైన కాంగ్రెస్‌కు 2004లో పూర్వ వైభవం తీసుకొచ్చిన స్లోగన్. వాజ్‌పేయి సర్కారు పేదలను విస్మరించిందని, తాము సంక్షేమ పథకాలతో వారిని ఆదుకుంటామని చెప్పిన తీరు జనాలకు కనెక్టయింది. కాంగ్రెస్ సారథ్యంలో యూపీఏ సర్కారు గద్దెనెక్కింది. సోనియాగాంధీ విదేశీయత వివాదంతో మన్మోహన్ సింగ్ ప్రధానిగా పదేళ్లు కొనసాగారు.

అబ్ కీ బార్ మోదీ సర్కార్

పదేళ్లపాటు ప్రతిపక్షంలో కూర్చున్న కమలనాథులకు 2014లో మళ్లీ అధికారం కట్టబెట్టిన స్లోగన్. నరేంద్ర మోదీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించి, 'ఈసారి మోదీ ప్రభుత్వం' నినాదంతో బీజేపీ ఎన్నికల బరిలోకి దిగింది. ఇది కార్యకర్తల్లో జోష్ నింపడమే గాక దేశవ్యాప్తంగా మార్మోగి బీజేపీని గెలిపించింది. తర్వాత అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ కూడా 'అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్' నినాదంతో ఇండో–అమెరికన్ ఓటర్లను ఆకట్టుకున్నారు. అలాగే 'అచ్చే దిన్ ఆయేంగే (మంచి రోజులొస్తాయ్)', 'చాయ్ పే చర్చ', సబ్ కా సాత్ సబ్ కా వికాస్ వంటి నినాదాలూ ఆ ఎన్నికల్లో ఓటర్లను ఆకట్టుకున్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 'ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్ (మరోసారి మోదీ ప్రభుత్వం)', 'మోదీ హై తో ముమ్‌కిన్ హై (మోదీతో సాధ్యం)' నినాదాలు వైరలయ్యాయి. ఈసారి కమలనాథులు 'తీస్‌రీ బార్ మోదీ సర్కార్' (మూడోసారీ మోదీ సర్కారు), 'అబ్ కీ బార్ 400 పార్' (ఈసారి 400 పై చిలుకు)' నినాదంతో ఎన్నికల బరిలోకి దిగారు.

అచ్చే బీతే 5 సాల్, లగే రహో కేజ్రీవాల్

నయా రాజకీయ సంచలనంగా దూసుకొచ్చిన ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను 2020లో ఢిల్లీ పీఠంపై మరోసారి బంపర్ మెజారిటీతో కూర్చోబెట్టిన స్లోగన్. 'ఐదేళ్లు బాగా గడిచాయి. సాగిపో కేజ్రీవాల్' అన్న ప్రచారం ఓటర్లను ఆకర్షించింది. 2015 అసెంబ్లీ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 70 సీట్లకు ఏకంగా 67 దక్కించుకున్న కేజ్రీవాల్ 2020లోనూ 62 సీట్లతో ప్రత్యర్థులపై 'చీపురు' తిరగేశారు.

ఎన్నికల్లో పేలిన మరికొన్ని నినాదాలు...

- జన్‌సంఘ్ కో వోట్ దో, బీడీ పీనా చోడ్ దో; బీడీ మే తంబాకు హై, కాంగ్రెస్‌వాలా డాకూ హై (1967లో భారతీయ జనసంఘ్ నినాదం)
- ప్రోగ్రెస్ త్రూ కాంగ్రెస్ (కాంగ్రెస్‌తోనే అభివృద్ధి. 1960ల్లో నినాదమిది. అయితే, 'ప్రోగ్రెసా, కాంగ్రెసా' అంటూ శివసేన ఇచ్చిన కౌంటర్ అప్పట్లో బాగా పేలింది)
- వోట్ ఫర్ కాఫ్ అండ్ కౌ; ఫర్‌గెట్ అదర్స్ నౌ (ఆవుదూడ గుర్తుకు ఓటేయండి, మిగతా పార్టీలను మర్చిపోండి అంటూ ఇందిరా కాంగ్రెస్ ఇచ్చిన నినాదం. కానీ ఆ గుర్తు ఇందిర, సంజయ్‌లకు ప్రతీక అంటూ వ్యంగ్యాస్త్రాలు పేలాయి)
- జబ్ తక్ రహేగా సమోసా మే ఆలూ, తబ్ తక్ రహేగా బిహార్ మే లాలూ (సమోసాలో ఆలూ ఉన్నంతకాలం బిహార్లో లాలూ ఉంటారు)
- జాత్ పర్ నా పాత్ పర్, మొహర్ లగేగీ హాత్ పర్ (కులమతాలకు అతీతంగా హస్తం గుర్తుకు ఓటేద్దామంటూ 1996 ఎన్నికల్లో పీవీ ఇచ్చిన నినాదం)
- సోనియా నహీ, యే ఆంధీ హై; దూస్రీ ఇందిరాగాంధీ హై (సోనియా కాదు, తుఫాను; మరో ఇందిర అంటూ 2009లో కాంగ్రెస్ ఇచ్చిన నినాదం)

కాఫీ విత్ యూత్

- బీజేపీ యువ మోర్చా కార్యక్రమం
- పట్టణ ఓటర్లే లక్ష్యం



సాక్షి, న్యూఢిల్లీ: యువ ఓటర్లను ఆకర్షించేందుకు 'చాయ్ పే చర్చ'ను కాస్తా 'కాఫీ విత్ యూత్'గా మార్చింది బీజేపీ. వీలైతే కప్పు కాఫీ అంటూ పార్టీ యువ మోర్చా నేతలు కొత్త ఓటర్లను అడుగుతున్నారు. ముంబైలో చేపట్టిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించడంతో వీటిని దేశవ్యాప్తంగా చేపడుతున్నారు. యువ ఓటర్ల నాడి తెలుసుకుని, వారిని బీజేపీ వైపు మళ్లించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

బూత్ స్థాయి నుంచి...


ముంబైలో ఇటీవల పలుచోట్ల దాదాపు 300 మంది యువ ఓటర్లతో బీజేపీ యువ మోర్చా నేతలు 'కాఫీ పే చర్చ' నిర్వహించారు. పదేళ్లలో బీజేపీ చేసిన అభివృద్ధి కార్యక్రమాల్ని వారికి వివరించారు. దేశవ్యాప్తంగా పలు నగరాలు, పట్టణాల్లో ఈ చర్చలను విస్తరిస్తున్నారు. ప్రతి భేటీలో కనీసం 150 నుంచి 200 మంది యువ ఓటర్లుండేలా ప్లాన్ చేస్తున్నారు. 'కాఫీ పే చర్చ'లో బూత్ స్థాయి కార్యకర్త మొదలు యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుని దాకా పాల్గొంటారు. ప్రతి కార్యకర్త తమ పరిధిలోని కనీసం 10 మంది కొత్త, యువ ఓటర్లను ఈ చర్చకు తీసుకొస్తున్నారు. రెస్టారెంట్లు, పార్కులు, ఆట స్థలాలు, ఖాళీ ప్రదేశాల్లో వినూత్నంగా దీన్ని నిర్వహిస్తున్నారు. మోదీ పేర్కొన్న 'విజన్ 2047' లక్ష్యంతో చర్చ సాగుతోంది. 'రాబోయే ఐదేళ్లలో దేశంలో యువత పాత్ర ఎలా ఉండాలి? ప్రభుత్వం ఏం చేస్తే యువతకు దగ్గరవుతుంది? అన్ని రంగాల్లోనూ ప్రపంచంలో భారత్ అగ్ర స్థానానికి చేరాలంటే ఏం చేయాలి? అవినీతి నిర్మూలన, ఆర్థికాభివృద్ధి, పేదరికం లేని ఇళ్లు' తదితర అంశాలపై రెండు నుంచి మూడు గంటల పాటు కార్యక్రమం జరుగుతోంది. యువ ఓటర్ల సలహాలను పార్టీ అధిష్టానానికి పంపుతున్నారు.

గతం

కాంగ్రెస్‌కు సానుభూతి పవనాలు

8వ లోక్‌సభ ఎన్నికల్లో 404 సీట్లు

రాజీవం



ఇందిర వారసునిగా గద్దెనెక్కిన రాజీవ్ 1984లో జరిగిన 8వ లోక్‌సభ ఎన్నికల్లో చరిత్రాత్మక విజయం అందుకున్నారు. ఇందిర హత్య తాలూకు సానుభూతి కాంగ్రెస్‌కు బాగా కలిసొచ్చింది. ఏకంగా 404 స్థానాల్లో ఘన విజయం సాధించి రికార్డు సృష్టించింది. బీజేపీ ఆవిర్భావం తర్వాత జరిగిన ఈ తొలి ఎన్నికలివి. ఆ పార్టీకి భారీగా ఓట్లు పడ్డా సీట్లు మాత్రం రెండే దక్కాయి. అయితే ఈ ఎన్నికల నుంచి కాంగ్రెస్ బలం క్రమంగా తగ్గుతూ పోగా, బీజేపీ గ్రాఫ్ పెరుగుతూ రావడం విశేషం...

- సాక్షి, నేషనల్ డెస్క్

1984 అక్టోబర్ 31న ఇందిర హత్య యావత్ ప్రపంచాన్నీ షాక్‌కు గురి చేసింది. అదే రోజు సాయంత్రం రాజీవ్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించినా ఏడో లోక్‌సభ పదవీకాలం ముగుస్తుండడంతో ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించారు. 1984 డిసెంబర్ 24, 27, 28 తేదీల్లో 514 లోక్‌సభ స్థానాలకే ఎన్నికలు జరిగాయి. ఉగ్రవాదంతో అట్టుడుకుతున్న అసోం, పంజాబ్‌లోని మిగతా స్థానాల్లో 1985లో ఎన్నికలు జరిగాయి. సానుభూతికి తోడు ఇందిర దూరదృష్టితో చేపట్టిన అభివృద్ధి పనులు కూడా కాంగ్రెస్‌కు కలిసొచ్చాయి. హరిత విప్లవం

అభివృద్ధికి ప్రజామోదం

తో పంటల దిగుబడి భారీగా పెరిగింది. రక్షణ, ఆర్థిక రంగాల్లో కీలక నిర్ణయాలను జనం హర్షించారు. ఇందిర హయాంలోని 1980–85 ఆరో పంచవర్ష ప్రణాళికను అత్యంత విజయవంతమైనదిగా చెబుతారు. జీవన వ్యయం పెరిగినా ఆర్థిక వృద్ధి 5.4 శాతానికి చేరింది. వీటన్నింటి ఫలస్వరూపంగా కాంగ్రెస్‌కు ఏకంగా 49.1 శాతం ఓట్లు, 404 సీట్లు దక్కాయి. నెహ్రూ, ఇందిర నాయకత్వంలోనూ ఇన్ని సీట్లు రాలేదు. యూపీలో కాంగ్రెస్ 85కు ఏకంగా 83 సీట్లను గెలుచుకుంది! బెంగాల్ మినహా పెద్ద రాష్ట్రాలన్నింట్లోనూ దుమ్ము రేపినా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం ధాటికి ఆరింటితోనే సరిపెట్టుకుంది. టీడీపీ ఏకంగా 30 సీట్లు నెగ్గింది.

ఎనిమిదో లోక్‌సభలో పార్టీల బలాబలాలు
(మొత్తం స్థానాలు 514)

పార్టీ	స్థానాలు
కాంగ్రెస్	404
టీడీపీ	30
సీపీఎం	22
అన్నాడీఎంకే	12
జనతా పార్టీ	10
బీజేపీ	2
ఇతరులు	29
స్వతంత్రులు	5

మరిన్ని విశేషాలు...

- బీజేపీ ఆవిర్భావం తర్వాత జరిగిన ఈ తొలి ఎన్నికల్లో పార్టీ 7.74 శాతం ఓట్లు సాధించింది.
- బీజేపీ నెగ్గిన రెండు సీట్లలో ఒకటి హన్మకొండ. అక్కడ బీజేపీ అభ్యర్థి చందుపట్ల జంగారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి పీవీ నరసింహారావును ఓడించారు. బీజేపీకి రెండో స్థానం గుజరాత్‌లోని మెహసానాలో దక్కింది.
- 1985లో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని రాజీవ్ తీసుకొచ్చారు.
- ఓటు హక్కు వయో పరిమితిని 1988లో 21 ఏళ్ల నుంచి 18కి తగ్గించారు.
- ఎన్నికల్లో ఈవీఎంలు వాడేలా 1988లో చట్ట సవరణ చేశారు. సెబీని ఏర్పాటు చేశారు.
- 1989లో కేంద్ర ఎన్నికల సంఘంలో సీఈసీకి తోడు మరో ఇద్దరు కమిషనర్లను నియమించారు.
- విద్య ఆధునికీకరణకు జాతీయ విధానాన్ని ప్రవేశపెట్టారు. నవోదయ విద్యాలయ వ్యవస్థ తెచ్చారు.
- కంప్యూటర్లు, విమానయాన పరిశ్రమ, రక్షణ, రైల్వేల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు.
- వృద్ధి రేటు పెంపే లక్ష్యంగా కార్పొరేట్ సంస్థలకు సబ్సిడీలు అందించారు.
- దేశంలో టెలికం, ఐటీ రంగ అభివృద్ధికి రాజీవే ఆద్యుడని చెబుతారు.

బోఫోర్స్ మరక...

రాజీవ్ హయాంలో పలు వివాదాలూ రేగాయి. బోఫోర్స్ శతఘ్నుల కొనుగోలులో అవినీతి మరక వాటిలో ముఖ్యమైనది. ఈ కాంట్రాక్ట్ కోసం గాను భారత రాజకీయ నాయకులకు బోఫోర్స్ కంపెనీ రూ.820 కోట్ల ముడుపులు చెల్లించినట్టు 1987 మేలో స్వీడిష్ రేడియో స్టేషన్ ప్రసారం చేసిన కథనం సంచలనం రేపింది. బోఫోర్స్ తరఫున మధ్యవర్తిత్వం వహించిన ఒట్టావియో ఖత్రోచికి రాజీవ్ కుటుంబంతో సన్నిహిత సంబంధాలున్నట్టు ఆరోపణలు వచ్చాయి. అలాగే జాతుల పోరుతో అట్టుడుకుతున్న శ్రీలంకలో శాంతి పేరుతో జోక్యంపైనా రాజీవ్ విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇండియన్ పీస్ కీపింగ్ ఫోర్స్ పేరిట ఆయన పంపిన భారత సైన్యం ఎల్టీటీఈతో నేరుగా యుద్ధానికి దిగింది! ఈ పరిణామం అంతిమంగా రాజీవ్ హత్యకు దారితీసింది.

నాడేం జరిగిందంటే..?

ఇందిర హత్యకు గురైనప్పుడు రాజీవ్ పశ్చిమబెంగాల్‌లో పర్యటిస్తున్నారు. ఆయనతో పాటున్న కాంగ్రెస్ సీనియర్ నేత ప్రణబ్ ముఖర్జీకి తొలుత హత్య వార్త ఉదయం 9.30కు తెలిసింది. ఇందిర్పై కాల్పులు జరిగాయని మాత్రం రాజీవ్‌కు చెప్పి విమానంలో ఢిల్లీ బయల్దేరదీశారు. కాక్‌పిట్‌లోకి వెళ్లిన రాజీవ్ కాసేపటికి బయటికొచ్చి 'అమ్మ మరణించింది' అని ప్రకటించారు. అందరూ మౌనం దాల్చారు.

పరిచయం

• బాసురీ స్వరాజ్

డాటరాఫ్ సుష్మ





బాసురీ స్వరాజ్. సక్సెస్‌ఫుల్ సుప్రీంకోర్టు లాయర్. అయినా సరే, అక్షరాలా అమ్మకూచి. సుష్మా స్వరాజ్ అంతటి గొప్ప వ్యక్తికి కూతురు కావడం తన అదృష్టమంటారు. తల్లితో కలిసున్న ఫొటోలను తరచూ షేర్ చేస్తుంటారు. విద్యార్థి సంఘ నేతగా రాజకీయ ఓనమాలు నేర్చుకున్న బాసురి బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్‌గా న్యాయవాద వృత్తిలోనూ రాజకీయాలను కొనసాగించారు. ఈసారి న్యూఢిల్లీ స్థానం నుంచి లోక్‌సభ బరిలో దిగి ఎన్నికల అరంగేట్రమూ చేస్తున్నారు...

- సాక్షి, నేషనల్ డెస్క్

వారసత్వ రాజకీయాలను విమర్శించే బీజేపీ కూడా ఆ తాను ముక్కేనని ఇటీవల విపక్షాలు విమర్శలు ఎక్కుపెడుతున్నాయి. బాసురీకి టికెటివ్వడాన్ని కూడా ఇందుకు ఉదాహరణగా చూపుతున్నాయి. కానీ తన తల్లి ప్రజాప్రతినిధిగా చేసినంత మాత్రాన తనవి వారసత్వ రాజకీయాలు కావంటారు బాసురీ. ''రావడమే సీఎం, పీఎం వంటి ఉన్నత పదవులతోనో పార్టీ అధినేతగానో రాజకీయాల్లో అడుగు పెడితే వారసత్వ రాజకీయం అవుతుంది. కానీ నాలా కార్యకర్త నుంచి మొదలైతే కాదు'' అంటూ తిప్పికొడుతున్నారు. ''నా రాజకీయ ప్రస్థానం పార్టీ కార్యకర్తగానే మొదలైంది. న్యాయవాదిగా కోర్టులో అడుగుపెట్టే ముందే అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కార్యకర్తగా పార్టీ కోసం పనిచేశా. ఇప్పుడు పార్టీ నాకో అవకాశమిచ్చింది. ఇప్పుడూ అందరిలాగే కష్టపడుతున్నా'' అని చెప్పుకొచ్చారు. న్యూఢిల్లీ సిటింగ్ ఎంపీ, కేంద్ర మంత్రి మీనాక్షి లేఖీని పక్కనపెట్టి మరీ బాసురీకి అవకాశమిచ్చింది బీజేపీ. దీనిపై మీనాక్షి బాగా అసంతృప్తితో ఉన్నారన్న వార్తలను బాసురీ కొట్టిపడేశారు. ఆమె ఆశీస్సులు తనకెప్పుడూ ఉంటాయన్నారు.

హై ప్రొఫైల్ కేసులతో...

బాసురీ 1984 జనవరి 3న జన్మించారు. లండన్‌లోని వార్విక్ యూనివర్సిటీ నుంచి ఇంగ్లిష్ సాహిత్యంలో డిగ్రీ చదివారు. బీపీపీ లా స్కూల్‌లో న్యాయశాస్త్రాన్ని అభ్యసించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలోని సెంట్ కేథరీన్స్ కాలేజీలో మాస్టర్స్ పూర్తి చేశారు. అనంతరం న్యాయవాద వృత్తిలో ప్రవేశించారు. 2007 నుంచి ఢిల్లీ బార్ కౌన్సిల్ సభ్యురాలిగా ఉన్నారు. నాలుగేళ్ల కిందట ఢిల్లీ బీజేపీ లీగల్ సెల్ కో–కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టారు. అదే సమయంలో హరియాణా అడిషనల్ అడ్వకేట్ జనరల్‌గానూ నియమితులయ్యారు. కాంట్రాక్టులు, రియల్ ఎస్టేట్, పన్నులు, అంతర్జాతీయ వాణిజ్య మధ్యవర్తిత్వాలు, నేరాల కేసులను వాదించారు. ఆమె క్లయింట్స్ హై ప్రొఫైల్ వాళ్లే కావడంతో న్యాయవాద రంగంలో అతికొద్ది కాలంలోనే కీర్తి సంపాదించారు. మీడియా ముందు అంతగా కనిపించని బాసురీ.. ఐపీఎల్ వివాదంలో లలిత్ మోడీ న్యాయవాద బృందంలో ఒకరిగా తొలిసారి వార్తల్లోకెక్కారు. గతేడాది ఆప్ ప్రభుత్వంపై విమర్శలు చేసి మరోసారి వార్తల్లో నిలిచారామె.

తల్లికి స్వయంగా అంత్యక్రియలు...

సుష్మా స్వరాజ్ 2019లో కన్నుమూశారు. ఆమె అంత్యక్రియలను స్వయంగా నిర్వహించి బాసురీ అప్పట్లో వార్తల్లోకెక్కారు. మహిళలను చైతన్యవంతులను చేసే దిశగా ఆమె ప్రసంగాలు చేస్తుంటారు. ఆ క్రమంలో 2021లో తనకు దక్కిన 'తేజస్విని' అవార్డును తల్లికి అంకితమిచ్చారు. ప్రతి విషయంలోనూ గురువుగా మారి తనకు అమూల్యమైన జీవిత విలువలను నేర్పిందంటూ తల్లిని గుర్తు తెచ్చుకుని కన్నీళ్ల పర్యంతమయ్యారు.

బాబు దండగ అంటే.. జగన్ పండగ చేశారు..

రామోజీ.. కళ్లకు పచ్చగంతలు తీసి చూడు...
మొత్తంగా వ్యవ'సాయం' రూ. 1,86,548 కోట్లు



రాష్ట్రంలో కొత్త పుంతలు తొక్కుతున్న వ్యవసాయ రంగం

- గణనీయమైన పురోగతి.. రైతుల ఆదాయం పెరుగుదల.. జీవన ప్రమాణ స్థాయి మెరుగు
- దింపుడు కల్లం ఆశతో ఉన్న టీడీపీ కోసం ఈనాడు రోత రాతలు
- కళ్లెదుటే మార్పు కనిపిస్తున్నా ఉన్మాదిలా పేట్రేగిపోతున్న రామోజీ
- వినూత్న ఆర్బీకే వ్యవస్థపై అంతర్జాతీయ స్థాయిలో వేనోళ్ల ప్రశంసలు
- గ్రామ స్థాయిలో విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు, యంత్ర, బ్యాంకింగ్ సేవలు

- ఈ క్రాప్ ద్వారా పక్కాగా పంటల నమోదు
- పైసా భారం పడకుండా పంటల బీమా
- సీజన్ ముగియకుండానే పంట నష్టపరిహారం
- గత ప్రభుత్వం ఎగ్గొట్టిన బకాయిలు సైతం చెల్లింపు
- ఎన్నికల్లో ఇచ్చిన హామీకి మించి పెట్టుబడి సాయం
- ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలకు రూ.7 లక్షల సాయం

- రికార్డు స్థాయిలో సాగు విస్తీర్ణం.. దిగుబడులు..
- పంటల మార్పిడితో పెరిగిన ఉద్యాన పంటల సాగు
- పండ్ల సాగు, దిగుబడులు, ఎగుమతులు ఘనం
- ఆక్వా రైతులకు అండగా నిలిచిన ప్రభుత్వం
- మత్స్యకారులకు వెన్నుదన్నుగా సంక్షేమ ఫలాలు
- జగనన్న పాల వెల్లువతో పాడి రైతులకు భరోసా
- అనుబంధ రంగాలకూ ఊతం..


పాల కేంద్రంలో పాలు పోస్తున్న మహిళలు



రామోజీవి దుర్మార్గపు రాతలే..

వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ రాయితీ, ధరల స్థిరీకరణ, ఆర్బీకేలు, ఇతర విప్లవాత్మక కార్యక్రమాలేవీ రామోజీ కళ్లకు కనిపించడం లేదు. ఆత్మహత్య చేసుకున్న రైతులను గుర్తిస్తే.. ఎక్కడ పరిహారం ఇవ్వాల్సి వస్తుందోనని బాబు విస్మరించారు. ఆ బకాయిలు సహా.. పరిహారం పెంచి ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌దే. ఇది కూడా తనకు కనిపించనట్లు రామోజీ నటిస్తున్నారు. అంతర్జాతీయ, జాతీయస్థాయి వ్యవసాయ రంగ నిపుణులు రాష్ట్రంలో వ్యవసాయ రంగం ప్రగతిని ప్రశంసించడం కూడా విస్మరించి దుర్మార్గపు రాతలు రాస్తుండటం రామోజీకే చెల్లింది. ఆర్బీకేలు అన్నదాత పాలిట దేవాలయాలుగా అవతరించాయి. 10,778 ఆర్బీకేలు, వన్ స్టాప్ సెంటర్స్, నాలెడ్జ్ హబ్‌లు.. ప్రతి రైతును గ్రామస్థాయిలో చేయిపట్టి నడిపిస్తున్నాయి. 16 వేల మందికి పైగా పట్టభద్రులతోపాటు అనుభవజ్ఞులైన ఎంపీఏవోలు, గోపాలమిత్రలు అన్నదాతలకు సేవలందిస్తున్నారు. స్మార్ట్ టీవీ, డిజిటల్ లైబ్రరీ, సీడ్, సాయిల్ టెస్టింగ్ కిట్స్, కియోస్క్‌ల ద్వారా సత్వర సేవలు అందుతున్నాయి. సర్టిఫై చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో పాటు.. చేప, రొయ్యల సీడ్, ఫీడ్, పశుగ్రాసం, దాణా పంపిణీ చేస్తున్నారు. ప్రతి ఆర్బీకేలో ఓ వలంటీర్, 9,277 మంది బ్యాంకింగ్ కరస్పాండెంట్‌లను అనుసంధానించారు. ఆర్బీకే ఛానల్, ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ కూడా అందుబాటులోకి తెచ్చారు. ఫలితంగా ఆర్బీకే వ్యవస్థ ప్రపంచ దేశాలకు రోల్‌మోడల్‌గా నిలిచింది.

'ఇక వ్యవసాయం దండగ.. దాని పని అయిపోయింది.. రైతులు వేరే పనులు చూసుకోండి.. వ్యవసాయానికి ఉచిత కరెంట్ అట! సాధ్యమయ్యే పనేనా? కరెంటు తీగలు బట్టలు ఆరేసుకోవడానికి పనికొస్తాయి'. ఈ మాటలు అన్నది ఎవరని తెలుగు ప్రజలు ఎవరిని అడిగినా 'చంద్రబాబునాయుడు' అని ఠక్కున సమాధానమిస్తారు. రైతులంటే ఆయనకు చులకన. వ్యవసాయం అంటే దరిద్రం అని భావన. విద్యుత్ చార్జీలు తగ్గించమని అడిగినందుకు రైతులపై కాల్పులు జరిపించిన చరిత్ర ఆయనది.

'ఈ దేశంలో, రాష్ట్రంలో అత్యధిక శాతం మంది ప్రజలు ఆధారపడిన వృత్తి వ్యవసాయం. ఆరుగాలం శ్రమిస్తూ మనందరికీ అన్నం పెడుతున్న అన్నదాతలకు అండగా నిలవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. రైతుల కష్టాలు కళ్లారా చూశాను కాబట్టే వారి కోసం ఎందాకైనా.. అంటూ ఎన్నో పథకాలు, కార్యక్రమాలు చేపట్టాం. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. రైతులకు ప్రభుత్వాల పరంగా ఎంత చేసినా తక్కువే' అని సీఎం వైఎస్ జగన్ తరచూ చెబుతుంటారు.

వైఎస్ జగన్‌కు, చంద్రబాబుకు మధ్య ఎంత తేడా ఉందో పై రెండు ఉదాహరణలే నిదర్శనం. ఇలాంటి చంద్రబాబుకు ఈనాడు రామోజీ నిత్యం బాకా ఊదుతున్నారు. వ్యవసాయ రంగ పితామహుడు చంద్రబాబే అన్నట్లు కలరింగ్ ఇస్తున్నారు. దింపుడు కల్లం ఆశలతో ఉన్న టీడీపీని ఎలాగైనా సరే బతికించాలని బరితెగింపు రాతలు రాస్తున్నారు. నిస్సిగ్గుగా అబద్ధాలు వల్లె వేస్తున్నారు.

చంద్రబాబు రుణమాఫీ హామీని నమ్మి రైతులు నిండా మునిగారు. ఈ తరుణంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలకు నాంది పలికింది. విత్తు నుంచి విక్రయం వరకు రైతులకు అన్నివిధాలా అండగా నిలుస్తూ వ్యవసాయాన్ని పండగ చేసింది. వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ రాయితీ, ధరల స్థిరీకరణ నిధి వంటి సంక్షేమ పథకాల ద్వారా స్థిరమైన వాతావరణాన్ని కల్పించింది. ఫలితంగా వ్యవసాయ రంగంలో గణనీయమైన పురోగతి సాధ్యమైంది. రైతుల ఆదాయం, జీవన ప్రమాణ స్థాయి పెరిగింది.

- పంపాన వరప్రసాదరావు




- తోమియో షిచిరీ, కంట్రీ మాజీ డైరెక్టర్, ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (యూఎన్‌వో)


ప్రపంచ స్థాయి ఆవిష్కరణ

వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ఆలోచన వినూత్నం. ప్రపంచ స్థాయి ఆవిష్కరణ. వ్యవసాయాధారిత దేశాలన్నీ అనుసరించదగ్గ గొప్ప విధానం. వీటికి అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తాం. వీటి గురించి ఇప్పటికే ఐక్యరాజ్య సమితికి కూడా నివేదించాం.

జాతీయ స్థాయిలో అధ్యయనం జరగాలి

ఆర్బీకేల ద్వారా సంక్షేమ పథకాల అమలుతో పాటు సాగు ఉత్పాదకాలను రైతుల ముంగిటకు తీసుకెళ్తున్న తీరు బాగుంది. వాటిని జాతీయ స్థాయిలో అమలు చేసేందుకు చర్చ, అధ్యయనం జరగాలి. ఆర్బీకేలు ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేస్తే బాగుంటుంది. ఈ విషయమై కేంద్రానికి నివేదిక ఇస్తున్నాం.


అమితాబ్‌కాంత్, సీఈవో, నీతి ఆయోగ్



ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చెల్లించిన పరిహారం					
సంవత్సరం	రైతులు (లక్షల్లో)	పరిహారం (రూ.కోట్లల్లో)	2020-21	292	20.44
			2021-22	252	17.64
2014-18 (పాతబకాయిలు)	474	23.70	2022-23	339	23.73
2019-20	317	22.19	2023-24	120	08.40

ఈ క్రాప్ విప్లవాత్మక మార్పు

ఏళ్ల తరబడి రైతులు ఎదుర్కొంటున్న గిట్టుబాటు ధర పొందగలగడమనే ప్రధాన సమస్యకు ఎలక్ట్రానిక్ క్రాపింగ్ (పంటల నమోదు) ద్వారా శాస్త్రీయ పరిష్కారాన్ని ఏపీ ప్రభుత్వం చూపించింది. రైతులు ఎంత విస్తీర్ణంలో ఏ పంట సాగు చేస్తున్నారో ఈ క్రాప్ ద్వారా నమోదు చేస్తున్నారు. పంటల వారీ దిగుబడి అంచనాలతో ఏయే పంట ఉత్పత్తులు ఎప్పుడు మార్కెట్‌లోకి వస్తాయో ప్రభుత్వం వద్ద సమాచారం ఉంటుంది. ఏ పంట ఉత్పత్తులకు ఎక్కడ డిమాండ్ ఉంటుందో ఆయా మార్కెట్లను అనుసంధానిస్తే ప్రతీ రైతుకు మద్దతు ధర దక్కుతుంది. ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయడం గొప్ప విషయం.

– ప్రొఫెసర్ విజయ్ పాల్ శర్మ, చైర్మన్, వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్

దేశం మొత్తం ఏపీని చూస్తోంది..

మాది తమిళనాడు. ఇప్పటి వరకు దేశంలోనే అత్యధిక అగ్రి ల్యాబ్స్(33) మా రాష్ట్రంలోనే ఉన్నాయనుకునే వాడ్ని. కానీ ఏపీలో ఏకంగా 160 ల్యాబ్స్‌ను తక్కువ సమయంలో నాణ్యతతో ఏర్పాటు చేశారు. ఇక్కడి ల్యాబ్స్, సాగు ఉత్పాదకాలను నేరుగా రైతులకందించాలన్న ఆలోచనతో తీసుకొచ్చిన 'రైతు భరోసా కేంద్రాలు' గొప్ప ప్రయోగం. గ్రామస్థాయిలో రైతులకు ఇంతలా సేవలందిస్తున్న రాష్ట్రం భారతదేశంలో మరొకటి లేదు.

– డాక్టర్ కె.పొన్ను స్వామి, జాయింట్ డైరెక్టర్, కేంద్ర ప్రభుత్వ నూనెగింజల అభివృద్ధి సంస్థ

ఆర్బీకేలు.. ఆదర్శం

ఆర్బీకేలు అన్నదాత పాలిట దేవాలయాలుగా అవతరించాయి. ఇవి ప్రతి రైతును గ్రామస్థాయిలో చేయిపట్టి నడిపిస్తున్నాయి. గ్రామల్లో ఏర్పాటైన 10,778 ఆర్బీకేలను వన్ స్టాప్ సెంటర్స్, నాలెడ్జ్ హబ్‌లుగా తీర్చిదిద్దారు. వీటిలో 16 వేల మందికి పైగా పట్టభద్రులతోపాటు అనుభవజ్ఞులైన ఎంపీఏవోలు, గోపాల మిత్రలు సేవలందిస్తున్నారు. ఇక్కడ స్మార్ట్ టీవీ, డిజిటల్ లైబ్రరీ, సీడ్, సాయిల్ టెస్టింగ్ కిట్స్, కియోస్క్‌లు ఏర్పాటు చేశారు. ఆర్బీకేల ద్వారా బుక్ చేసుకున్న 24 గంటల్లోనే సర్టిఫై చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో పాటు చేప, రొయ్యల సీడ్, ఫీడ్, పశుగ్రాసం, దాణా పంపిణీ చేస్తున్నారు. మెరుగైన సేవల కోసం ప్రతీ ఆర్బీకేలో ఓ వలంటీర్, బ్యాంకింగ్ సేవల కోసం 9,277 బ్యాంకింగ్ కరస్పాండెంట్‌లను అనుసంధానించారు. ఈ క్రాప్ ప్రామాణికంగా ధాన్యంతో సహా పంట ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నారు. రైతు భరోసా, పంటల బీమా, పంట నష్ట పరిహారం, వడ్డీ రాయితీ వంటి సంక్షేమ ఫలాలను అర్హులైన రైతులకు అందిస్తున్నారు. యంత్ర సేవా కేంద్రాల ఏర్పాటుతో పాటు గోదాములు, కోల్డ్ రూమ్స్, కలెక్షన్ సెంటర్స్ వంటి మౌలిక వసతుల కల్పనతో బహుళ ప్రాయోజిత కేంద్రాలు (ఎంపీఎఫ్‌సీ) లుగా తీర్చిదిద్దారు. ప్రత్యేకంగా ఆర్బీకే చానల్, ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ కూడా అందుబాటులోకి తెచ్చారు. ఫలితంగా ఆర్బీకే వ్యవస్థ ప్రపంచ దేశాలకు రోల్‌మోడల్‌గా నిలిచింది. పొరుగు రాష్ట్రాలతో పాటు ఇథియోపియా, వియత్నాం వంటి దేశాలు ఈ తరహా సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు పోటీపడుతున్నాయి. ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏవో), నీతి ఆయోగ్, ఐసీఎఆర్, నాబార్డు, ఆర్బీఐ ఇలా జాతీయ, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు ఆర్బీకేలను సందర్శించి వీటి సేవలను కొనియాడారు.




వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్

వైఎస్సార్ రైతు భరోసా పథకం రైతాంగానికి వెన్నుదన్నుగా నిలిచింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ కంటే మిన్నగా ఏటా 3 విడతల్లో ఒక్కో విడతకు రూ.13,500 చొప్పున 2019 నుంచి ఇప్పటివరకు 1.65 లక్షల కౌలు రైతులు, 94 వేల అటవీ భూ సాగు రైతులతో సహా 53.58 లక్షల మంది రైతులకు రూ.34,288.17 కోట్ల పెట్టుబడి సాయం అందించారు. ఎన్నికల హామీ ప్రకారం ఈ పథకంలో ప్రతి రైతు కుటుంబానికి 4 విడతల్లో రూ.50 వేలు ఇవ్వాల్సి ఉండగా, 5 విడతల్లో రూ.67,500 సాయం అందించారు. నోటిఫై చేసిన పంటలు సాగు చేసిన రైతులకు యూనివర్శల్ బీమా కవరేజ్ కల్పిస్తూ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం అమలు చేస్తోన్న ఏకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది. గత ప్రభుత్వ హయాంలో కేవలం 30.85 లక్షల మందికి రూ.3,411.20 కోట్ల బీమా పరిహారం అందిస్తే ఈ ప్రభుత్వ హయాంలో 54.55 లక్షల మందికి రూ.7,802.05 కోట్ల చొప్పున రెట్టింపు పరిహారం అందింది. 19 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఎలాంటి కోతలు లేకుండా రోజువారీగా 9 గంటల నాణ్యమైన నిరంతర ఉచిత విద్యుత్ అందిస్తోంది. ఈ ఐదేళ్లలో విద్యుత్ సబ్సిడీ రూపంలో రూ.37,374 కోట్లు, ఫీడర్ల సామర్థ్యం పెంచేందుకు మరో రూ.1700 కోట్లు ఖర్చు చేసింది.



సీజన్ ముగిసేలోపే పంట నష్ట పరిహారం

- ✔ ఈ ప్రభుత్వంలో ఏ సీజన్‌లో పంట నష్టానికి ఆ సీజన్‌లోనే పరిహారం అందజేత.
- ✔ ఇందుకోసం రూ.2వేల కోట్ల ప్రకృతి వైపరీత్యాల నిధి ఏర్పాటు.
- ✔ తిత్లీ తుఫాన్ సమయంలో చంద్రబాబు ఎగ్గొట్టిన రూ.182.60 కోట్ల పరిహారం అందజేత
- ✔ ఈ ఐదేళ్లలో 34.41లక్షల మంది రైతులకు రూ.3261.60 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ అందజేత
- ✔ 39.07లక్షల మంది రైతులకు బాబు ఎగ్గొట్టిన రూ.1180.66 కోట్లు అందజేత
- ✔ ఈ ఐదేళ్లలో 84.67 లక్షల మంది రైతులకు రూ.2050.53 కోట్ల సున్నా వడ్డీ రాయితీ అందజేత
- ✔ 2019 నుంచి ఇప్పటి వరకు 801 మంది భూ యజమానులు, 495 మంది కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడగా, టీడీపీ హయాంలో ఆత్మహత్య చేసుకున్న 474 మందితో కలిపి మొత్తం 1,770 మందికి రూ.114.42 కోట్ల పరిహారం జమ



పథకం	లబ్ధిదారులు(లక్షల్లో)	మొత్తం(రూ.కోట్లలో)
వైఎస్సార్ రైతు భరోసా...	53.58	34,288
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	54.55	7802
ఇన్‌పుట్ సబ్సిడీ	34.41	3262
ఇతర పంటల కొనుగోలు	6.17	7726
ధాన్యం సేకరణ బకాయిలు(2014-19)	-	960
ధాన్యం కొనుగోలు రబీ (2018-19 నుంచి ఖరీఫ్ 2023 ఖరీఫ్)	37.73	65.313
విద్యుత్ బకాయిలు(2014-19)	-	8845
ఉచిత వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ	-	43,744
ఫీడర్ల సామర్థ్యం పెంపు	-	1700
ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ	-	3497
వైఎస్సార్ మత్స్యకార భరోసా	-	538
మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ	-	148
శనగ రైతులకు బోనస్	-	300
సూక్ష్మ సేద్యం, పండ్ల తోటల అభివృద్ధి	7.33	3365
ఆయిల్ పామ్ రైతులకు సబ్సిడీ	0.53	248
వైఎస్సార్ యంత్ర సేవా పథకం	-	1052
విత్తన సబ్సిడీ	76.10	1380
వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు	84.66	2051
విత్తన బకాయిలు (2014-19)	-	384
మొత్తం		1,86,548

మట్టిలో మాణిక్యాలకు జగన్ వల్లే వెలుగు

- మళ్లీ ఆయన సీఎం అయితేనే గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం
- 'ఆడుదాం ఆంధ్రా' వల్లే చెన్నై సూపర్ కింగ్స్ శిక్షణకు ఎంపిక
- 'సాక్షి'తో క్రికెట్ క్రీడాకారుడు పవన్

ప్రతిభ ఉన్నా ప్రోత్సాహం లేక ఎందరో క్రీడాకారులు గ్రామాలకే పరిమితమైపోయారు. ఈ విషయాన్ని గ్రహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి రూపకల్పన చేసి రాష్ట్ర మంతా భారీఎత్తున నిర్వహించారు. ఎందరో క్రీడాకారులు ముందుకెళ్లడానికి ఇది దారిచూపింది. అలా వెలుగులోకి వచ్చిన వారిలో ఆనంద్‌పాల్ అలియాస్ పవన్ ఒకరు. విజయనగరం జిల్లా జామి మండలంలోని మారుమూల గ్రామం అలమండకు చెందిన ఈ కుర్రాడు ధోనీ సారథ్యంలోని ఐపీఎల్ టీమ్ చెన్నై సూపర్ కింగ్స్ ఆధ్వర్యంలో శిక్షణకు ఎంపికయ్యాడు. తొలి శిక్షణ శిబిరంలో పాల్గొని వచ్చిన అనంతరం పవన్ 'సాక్షి'తో ముచ్చటించాడు. ఆ విశేషాలు అతని మాటల్లోనే.. – సత్యార్థ్



సెమీ ఫైనల్స్‌లో ఓడినా..

అన్ని చోట్లా మా టీమ్ గెలుపొందింది. చివరకు సెమీ ఫైనల్స్‌లో ఓడిపోయాం. ఆ మ్యాచ్‌లు వీక్షించడానికి వచ్చిన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) ఫ్రాంచైజీ నన్ను దత్తత తీసుకుంది. ఆడుదాం ఆంధ్రాలో రాష్ట్ర స్థాయిలో పాల్గొనడమే ఒక అద్భుతం అనుకుంటే.. ఏకంగా సీఎస్‌కే టీమ్ ట్రైనింగ్‌కు ఎంపికవడం.. శిక్షణ అనంతరం నాకెంతో ఇష్టమైన క్రికెటర్ ధోని ఆధ్వర్యంలోని టీమ్‌లో సభ్యుడిగా ఆడే అవకాశం నాకు దక్కవచ్చని తెలిసి పొంగిపోయాను. ఈ అవకాశం సద్వినియోగం చేసుకుని క్రికెటర్‌గా ఎదగడానికి శాయశక్తులా ప్రయత్నిస్తాను.

ఇంటర్వ్యూ

చేనులో ఆట నుంచి 'చెన్నై' దాకా...

నా తండ్రి చిన్నప్పుడే చనిపోయారు. తల్లి కూడా రెండేళ్ల క్రితం మరణించారు. నాకు చిన్నతనం నుంచే క్రికెట్ అంటే చాలా ఇష్టం. పొలాలమ్మట, గల్లీల్లో ఆడుతూ ఉండేవాడిని. 'చదువుకుని ఉద్యోగం చేసుకోక క్రికెట్ అంటూ తిరుగుతున్నావ్ ఏంట్రా'.. అంటూ అమ్మ కోప్పడుతూ ఉండేది. ఫ్రెండ్స్ మాత్రం క్రికెట్ బాగా ఆడతానని పొగుడుతుండేవారు. అడపాదడపా గ్రామాల్లో జరిగే మ్యాచ్‌లలో ఆడి స్వల్ప పారితోషకాలు అందుకోవడం తప్ప ఆటకు ఎలా సానబెట్టుకోవాలో నాకు తెలియలేదు. అదే సమయంలో దేవుడిచ్చిన వరంలా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ ప్రకటించారు. మా గ్రామ సచివాలయం ద్వారా ఆ కార్యక్రమానికి ఎంపికయ్యాను.

థ్యాంక్స్ టు జగన్ సార్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎంతో దూరదృష్టితో ఆలోచించి మట్టిలో మాణిక్యాలను వెలికితీయడానికే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం చేపట్టారు. జీవితాంతం జగనన్నకు రుణపడి ఉంటాను. థాంక్స్ టూ జగన్ సార్.. ఆయనెప్పుడూ పేదల పక్షానే ఉంటూ.. ఎన్నో మంచి పథకాలు అమలుచేస్తున్నారు. క్రీడల విషయంలోనూ పేదలకు మేలు చేసే గొప్ప కార్యక్రమం నిర్వహించారు. గల్లీల్లో ఆడుకునే నాలాంటి వాడు రాష్ట్రమంతా తెలిసేలా చేశారు. మరోసారి ఆయనే సీఎం కావాలని.. ఆడుదాం ఆంధ్రాను మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరుకుంటున్నాను.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
శనివారం ॥ 20-4-2024

ఆకాశంలో సగం అని చాటడం వేరు.. నిరూపించడం వేరు. నేటి అమ్మాయిలు చదువులో, మేధలో, సమర్థమైన అవకాశాలు అందుకోవడంలో తమ ఆకాశం సగం అని నిరూపిస్తున్నారు. యు.పి.ఎస్.సి. 2023 టాప్ 25 ర్యాంకుల్లో 10 మంది అమ్మాయిలు ఉన్నారు. మన తెలుగు అమ్మాయి అనన్య (3), రుహానీ (5), సృష్టి (6), అన్‌మోల్ రాథోడ్ (7), నౌషీన్ (9), ఐశ్వర్యం ప్రజాపతి (10), మేధా ఆనంద్ (13), స్వాతి శర్మ (17), వార్దా ఖాన్ (18), రితికా వర్మ (25). వీరిలో అనన్య, సృష్టి, వార్దా ఖాన్‌ల కథనాలు ఇప్పటికే అందించాం. మిగిలిన ఏడుగురు ప్రతిభా పరిచయాల గురించిన ఈ కథనం.

టాపర్స్

‘స్వయం సమృద్ధి’, ‘ఆర్థిక స్వాతంత్ర్యం’, ‘నిర్ణయాత్మక అధికారిక పాత్ర’, ‘పరిపాలనా రంగాల ద్వారా జనావళికి సేవ’, ‘సామర్థ్యాలకు తగిన స్థానం’, ‘లక్ష్యాలకు తగిన సామర్థ్యం’... ఇవీ నేటి యువతుల విశిష్ట ఆకాంక్షలు, అభిలాషలు, లక్ష్యాలు. అందుకే దేశంలో అత్యంత క్లిష్టతరమైన సివిల్స్ ప్రవేశ పరీక్షల్లో వీరు తలపడుతున్నారు. గెలుస్తున్నారు. నిలుస్తున్నారు. యు.పి.ఎస్.సి. 2023 ఫలితాల్లో టాప్ 25లో పది ర్యాంకులు అమ్మాయిలు సాధించడం గర్వపడాల్సిన విషయం. మొత్తం 1016 మంది అభ్యర్థులు ఎంపిక కాగా వీరిలో అమ్మాయిలు 352 మంది ఉండటం ముందంజను సూచిస్తోంది. తల్లిదండ్రులకు భారం కాకుండా ఒకవైపు ఉద్యోగాలు చేస్తూ లేదా ఇంటి దగ్గర చదువుకుంటూ వీరిలో చాలామంది ర్యాంకులు సాధించారు. మహబూబ్‌నగర్‌కు చెందిన అనన్య రెడ్డి టాప్ 3 ర్యాంక్ సాధించి తెలుగు కీర్తి రెపరెపలాడించింది. కోచింగ్ సెంటర్‌ల మీద ఆధారపడకుండా సొంతగా చదువుకోవడం ఒక విశేషమైతే, మొదటి అటెంప్ట్‌లోనే ఆమె భారీ ర్యాంక్ సాధించడం మరో విశేషం. అలాగే ఢిల్లీకి చెందిన సృష్టి దబాస్ 6వ ర్యాంక్, వార్దా ఖాన్ 18వ ర్యాంక్ సాధించి స్ఫూర్తిగా నిలిచారు. మిగిలిన ఏడుగురు విజేతల వివరాలు.



రుహానీ
(5వ ర్యాంకు)

హర్యానాకు చెందిన రుహానీ హర్యానాలోని గుర్‌గావ్‌లోనూ ఢిల్లీలోనూ చదువుకుంది. తల్లిదండ్రులు ఇద్దరూ లెక్చరర్లు. ఎకనమిక్స్‌లో గ్రాడ్యుయేషన్ చేసిన రుహానీ ‘ఇగ్నో’ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసింది. 2020లో ఇండియన్ ఎకనామిక్ సర్వీస్‌కు ఎంపికయ్యి నీతి ఆయోగ్‌లో మూడేళ్లు పని చేసింది. కాని ఐ.ఏ.ఎస్ కావడం ఆమె లక్ష్యం. మరో అటెంప్ట్‌లో ఆమె ఐ.పి.ఎస్.కు ఎంపికయ్యింది. హైదరాబాద్‌లో శిక్షణ పొందుతూ ఆఖరుసారిగా 6వ అటెంప్ట్‌లో టాప్ ర్యాంక్ సాధించింది. పేద వర్గాల ఆర్థిక స్థితిని మెరుగు పర్చడం తన లక్ష్యం అంటోంది రుహానీ.



అన్‌మోల్ రాథోడ్
(7వ ర్యాంకు)

జమ్ము నుంచి 200 కిలోమీటర్ల దూరంలో ఉండే ఉద్రానా అనే మారుమూల పల్లె అన్‌మోల్‌ది. తండ్రి బ్యాంక్ మేనేజర్, తల్లి ప్రిన్సిపాల్. ఇంటర్ వరకూ జమ్ములో చదువుకున్నా గాంధీనగర్‌లో బి.ఏ.ఎల్.ఎల్.బి. చేసింది. 2021లో చదువు పూర్తయితే అదే సంవత్సరం సివిల్స్ రాసింది. కాని ప్రిలిమ్స్ దాటలేకపోయింది. 2022లో మళ్లీ ప్రయత్నిస్తే 2 మార్కుల్లో ఇంటర్వ్యూ వరకూ వెళ్లే అవకాశం పోయింది. 2023లో మూడవసారి రాసి 7వ ర్యాంక్ పొందింది. అయితే ఈలోపు ఆమె ‘జమ్ము కశ్మీర్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్’ పోటీ పరీక్ష రాసి ఉద్యోగానికి ఎంపికైంది. ఆ ఉద్యోగ శిక్షణ తీసుకుంటూనే సివిల్స్ సాధించింది. ‘రోజుకు ఎనిమిది గంటలు చదివాను. చిన్నప్పటి నుంచి నాకు తగాదాలు తీర్చడం అలవాటు. రేపు కలెక్టర్‌ను అయ్యాక ప్రజల సమస్యలను తీరుస్తాను’ అంటోందామె.

నౌషీన్ (9వ ర్యాంకు)

‘మాది ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్. కాని ఢిల్లీ యూనివర్సిటీలో చదువుకోవడం వల్ల అక్కడి విద్యార్థుల రాజకీయ, సామాజిక అవగాహన స్థాయి నన్ను ఆశ్చర్యపరిచి సివిల్స్ రాసేలా పురిగొల్పింది. 2020 నుంచి ప్రయత్నించి నాలుగో అటెంప్ట్‌లో 9వ ర్యాంక్ సాధించాను. చరిత్రలో ఈ రెండు ఘటనలు జరగకపోయి ఉంటే బాగుండేదని వేటి గురించి అనుకుంటావ్ అంటూ నన్ను ఇంటర్వ్యూలో అడిగారు- రెండు ప్రపంచ యుద్ధాలు జరక్కపోయి ఉంటే బాగుండేదని, ఆసియా–ఆఫ్రికా దేశాలు వలసవాద పాలన కిందకు రాకుండా ఉంటే బాగుండేదని చెప్పాను. నా జవాబులు బోర్డ్‌కు నచ్చాయి’ అని తెలిపింది నౌషీన్. ‘ఐ.ఏ.ఎస్. ఆఫీసర్‌గా పని చేయడం గొప్ప బాధ్యత. చాలా మంది జీవితాల్లో మార్పు తేవచ్చు’ అందామె.





ఐశ్వర్యం ప్రజాపతి
(10వ ర్యాంకు)

లక్నోకు చెందిన ఐశ్వర్యం ప్రజాపతి రెండో అటెంప్ట్‌లో 10వ ర్యాంక్ సాధించింది. ‘నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఉత్తరాఖండ్’లో చదువుకున్న ఐశ్వర్యం ఒక సంవత్సరం పాటు విశాఖపట్నం ఎల్ అండ్ టిలో ట్రయినీగా పని చేసింది. ‘నేను ఇన్ని గంటలు చదవాలి అని లెక్కపెట్టుకోని చదవలేదు. చదివినంతసేపు నాణ్యంగా చదవాలి అనుకున్నాను. నన్ను కలెక్టర్‌గా చూడాలన్నది మా అమ్మానాన్నల కల. సాధిస్తానని తెలుసుకాని ఇంత మంచి ర్యాంక్ వస్తుందనుకోలేదు. ఎవరైనా సరే తమకు ఏది నచ్చుతుందో ఆ దారిలో వెళ్లినప్పుడే సాధించాలన్న మోటివేషన్ వస్తుంది’ అని తెలిపిందామె.

మేధా ఆనంద్ (13వ ర్యాంకు)

‘మా అమ్మ ఆగ్రాలో బ్యాంక్ ఉద్యోగం చేస్తుంది. కలెక్టర్ ఆఫీసు మీదుగా వెళ్లినప్పుడల్లా నా కూతురు కూడా ఒకరోజు కలెక్టర్ అవుతుంది అనుకునేది. నాతో అనేది. నా లక్ష్యం కూడా అదే. కాలేజీ ఫైనల్ ఇయర్‌లో ఉన్నప్పటి నుంచి సివిల్స్ రాయాలని తర్ఫీదు అయ్యాను. సెకండ్ అటెంప్ట్‌లో 311వ ర్యాంక్ వచ్చింది. కాని నేను సంతృప్తి చెందలేదు. ప్రస్తుతం నేను నార్త్ రైల్వేస్‌లో పని చేస్తున్నాను. పని చేస్తూనే 50 లోపు ర్యాంక్ కోసం కష్టపడ్డాను. కాని 13వ ర్యాంక్ వచ్చింది. నేటి మహిళల్లోని సామర్థ్యాలు పూర్తిగా సమాజానికి ఉపయోగపడటం లేదు. వారికి ఎన్నో అడ్డంకులున్నాయి. వాటిని దాటి వారు ముందుకు రావాలి. కలెక్టర్ అయ్యాక నేను స్త్రీలు ముఖ్యభూమికగా ఆర్థిక వికాసం కోసం కృషి చేస్తాను’ అని తెలిపింది మీరట్‌కు చెందిన మేధా ఆనంద్.



స్వాతి శర్మ (17వ ర్యాంకు)

జెంషడ్‌పూర్‌కు చెందిన స్వాతి శర్మ తను సాధించిన 17 ర్యాంక్‌తో జార్ఖండ్‌లో చాలా మంది ఆడపిల్లలకు స్ఫూర్తిగా నిలుస్తానని భావిస్తోంది. ‘మా రాష్ట్రంలో అమ్మాయిలకు ఇంకా అవకాశాలు దొరకాల్సి ఉంది’ అంటుందామె. అంతేకాదు కలెక్టరయ్యి దిగువ, గిరిజన వర్గాల మహిళల అభ్యున్నతికి పని చేయాలనుకుంటోంది. ‘ఎం.ఏ. పొలిటికల్ సైన్స్ చదివాను. ఆ చదువే ఐ.ఏ.ఎస్. చదవమని ఉత్సాహపరిచింది. ఢిల్లీలో సంవత్సరం ఆరు నెలలు కోచింగ్ తీసుకున్నాను. రెండు మూడు సార్లు విఫలమయ్యి నాకు నేనే తర్ఫీదు అయ్యి ఇప్పుడు 17వ ర్యాంక్ సాధించాను. మా నాన్న రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్, అమ్మ గృహిణి. బాగా చదువుకుని అనుకున్న లక్ష్యాన్ని సాధించడమే పిల్లలు తల్లిదండ్రులకిచ్చే కానుక’ అంది స్వాతి శర్మ.





రితికా వర్మ (25వ ర్యాంకు)

‘ఎన్నో సమస్యలున్న బిహార్ రాష్ట్రం కోసం పని చేయాల్సింది చాలా ఉంది. మాది పాట్నా. మా నాన్న ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్‌లో మేనేజర్. ప్రస్తుతం మేము గుంటూరులో ఉంటున్నాం. ఢిల్లీలో బిఎస్సీ మేథ్స్ చదివిన నేను సివిల్స్ ద్వారా పేదల కోసం పని చేయాలని నిశ్చయించుకున్నాను. నాకు సాహిత్యం అంటే ఆసక్తి ఉంది. బిహార్‌లో పేదలకు భూమి సమస్య, పని సమస్య ఉన్నాయి. తక్కువ వేతనాల వల్ల పల్లెల నుంచి నిరవధికంగా వలస సాగుతోంది. కలెక్టర్‌గా నేను వీరి కోసం పని చేయాలనుకుంటున్నాను’ అని తెలిపింది రితికా వర్మ.

ఇంటిప్స్



- తెల్లని వస్త్రాలపై పడిన పసుపు, టీ మరకలు ఒకపట్టానా వదలవు. ఈ మరకలను వదిలించడానికి ముందుగా పచ్చిపాలను మరకలపై పోసి పది నిమిషాలపాటు రుద్దాలి. తరువాత డిటర్జెంట్‌లో నానబెట్టి ఉతికితే మరకలు పూర్తిగా పోతాయి.



- దిండు కవర్లపైన పడిన నూనె పోవాలంటే... నూనెపైన టాల్కం పౌడర్ వేసి పదిహేను నిమిషాలు ఉంచాలి. తరువాత సర్ఫ్‌లో నానబెట్టి ఉతికితే నూనె శుభ్రంగా పోతుంది.

అదర్ సైడ్

సోషల్ స్టార్

చిన్న పట్టణంలో పుట్టి పెరిగిన రాజశ్రీ దేశ్‌పాండేకి ఆర్థిక కష్టాలు తెలుసు. ‘డబ్బు మాత్రమే అన్ని సమస్యలకు పరిష్కారం’ అని ఒకప్పుడు అనుకున్న మాట తప్పు అని తెలుసు. ఔరంగాబాద్ నుంచి ముంబై వరకు తన ప్రయాణంలో ఎన్నో విషయాలు తెలుసుకుంది. బాలీవుడ్‌లో నటిగా తనదైన గుర్తింపు తెచ్చుకున్న రాజశ్రీ దేశ్‌పాండే సేవాపథంలో పయనిస్తోంది, ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సేవా కార్యక్రమాలను విస్తరిస్తోంది...





గత సంవత్సరం వచ్చిన నెట్‌ఫ్లిక్స్ షో ‘ట్రయల్ బై ఫైర్’ నటిగా రాజశ్రీకి ఎంతో పేరు తీసుకువచ్చింది. ఎన్నో అవార్డ్‌లు వచ్చాయి, 1997లో వచ్చిన ‘ఉప్‌హార్’ సినిమా ఆధారంగా వచ్చిన ‘ట్రయల్ బై ఫైర్’లో లీడ్ రోల్ పోషించింది రాజశ్రీ. మరాఠీ చిత్రం ‘సత్యశోధక్’లో సావిత్రి బాయి పూలే పాత్ర ఆమెకు ఎంతో పేరు తెచ్చింది.

ఒకవైపు నటిస్తూనే మరో వైపు సామాజిక సేవాకార్యక్రమాల్లో పాల్గొంటుంది. మహారాష్ట్రలోని కరువు బారిన పడిన 30 గ్రామాలలో సహాయక కార్యక్రమాలలో పాల్గొంది. తన స్వచ్ఛంద సంస్థ ‘నభాంగన్’ ఫౌండేషన్ ద్వారా ఎన్నో గ్రామాల్లో భూగర్భ జలాల పునరుద్ధరణ నుంచి పాఠశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం వరకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. జెండర్ సెన్సిటైజేషన్‌పై ఎన్నో సదస్సులు నిర్వహించింది.

గత కొన్ని సంవత్సరాలుగా స్థానిక ప్రజలు, ప్రభుత్వ అధికారులతో కలిసి పనిచేస్తున్న రాజశ్రీ ఎన్నో విషయాలపై అవగాహన పెంచుకుంది. ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి తన సేవా కార్యక్రమాలను విస్తరిస్తోంది. నటిగా తనకు వచ్చిన ఆదాయంతో పాటు క్రౌడ్ ఫండింగ్, డొనేషన్స్ ద్వారా సేవా కార్యక్రమాలకు అవసరమైన నిధులను సేకరిస్తోంది.

‘ఎవరూ పట్టించుకోని ప్రాంతాలకు వెళ్లడం అంటే ఇష్టం’ అంటున్న రాజశ్రీ ముంబై చుట్టుపక్కల ప్రాంతాల్లో బీచ్ ప్రక్షాళన, నదుల పునరుజ్జీవనానికి సంబంధించిన కార్యక్రమాలు చేస్తుంటుంది. ‘ఇలాంటి కార్యక్రమాలు చేస్తే పబ్లిసిటీ వస్తుంది అనే దృష్టితో కాకుండా సమస్య మూలాన్ని అర్థం చేసుకొనే కోణంలో నిజాయితీగా పనిచేయాలి’ అంటుంది రాజశ్రీ.

మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో పెరిగిన రాజశ్రీకి తమ కుటుంబ పోషణ పాలాన్ని పరిశ్రమలు ఎలా లాక్కున్నదీ బాగా గుర్తుంది. తల్లిదండ్రులు చిన్నా చితకా ఉద్యోగాలు చేసేవారు. ఆర్థికంగా ఎన్ని కష్టాలు పడినా కుమార్తెల చదువు విషయంలో మాత్రం ఎప్పుడూ వెనకడుగు వేయలేదు. పుణేలో లా చేస్తూనే మరోవైపు డబ్బుల కోసం అడ్వర్‌టైజింగ్ ఏజెన్సీలో పనిచేసేది రాజశ్రీ.

స్కూలు రోజుల్లో నాటకాల్లో నటించి ‘శభాష్’ అనిపించుకుంది. ‘నటన’పై ఆసక్తి అక్కడే ఆగిపోలేదు. ఇరవై ఎనిమిది సంవత్సరాల వయసులో ముంబైకి వెళ్లి ఫిల్మ్ కోర్సు చేసేలా చేసింది. అయితే తన అభిరుచే వృత్తిగా మారుతుందని, నలుగురిలో గుర్తింపు తెస్తుందని ఊహించలేదు.

2012లో ఒక సంవత్సరం పాటు హిందీ టెలివిజన్ సీరియల్‌లో నటించింది. ‘తలాష్’ ‘కిక్’లాంటి సినిమాలలో చిన్న చిన్న పాత్రలలో నటించింది.

> **మనలోకి మనం**
> క్షేత్రస్థాయిలో ప్రజలతో కలిసి పనిచేస్తున్నప్పుడు ఎన్నో సమస్యల గురించి ఎన్నో కోణాలలో ఆలోచించే సామర్థ్యం సొంతం అవుతుంది. సినిమా వెలుగులు అక్కడ చిన్నబోతాయి. మనల్ని మనం తెలుసుకునేలా చేస్తాయి.
> – రాజశ్రీ దేశ్‌పాండే

2015లో వచ్చిన ‘యాంగ్రీ ఇండియన్ గాడెసెస్’ చిత్రం ఆమె కెరీర్‌కు బ్రేక్ ఇచ్చింది. ‘ఇక వెనక్కి చూడాల్సిన అవసరం లేదు’ అంటూ వేరే ప్రపంచం వైపు తొంగి చూడడానికి బొత్తిగా టైమ్ దొరకని టైమ్ అది. అయితే రాజశ్రీ మాత్రం ‘నేనూ నా కెరీర్’కు అని మాత్రమే అనుకోకుండా సామాజిక విషయాలపై కూడా దృష్టి పెట్టేది.

ఆ టైమ్‌లో నేపాల్ భూకంప బాధితుల కోసం చేపట్టిన సేవాకార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంది,

‘నా సమస్యలు అన్నిటికీ డబ్బుతోనే పరిష్కారం దొరుకుతుంది అని అనుకునేదాన్ని. నేను చాలా సంపాదించాను. అయినప్పటికీ నేను సంతోషంగా లేనన్న విషయం గ్రహించాను’ అంటున్న రాజశ్రీ సేవాపథంపై దృష్టి సారించింది. ఆ బాటలో నడవడంలో తనకు మానసిక శాంతి లభిస్తోంది. డబ్బు కంటే విలువైన అనుభవాలను ఇస్తోంది.

‘నేను ఏమీ మారలేదు. అప్పటిలాగే ఉన్నాను’ అని రాజశ్రీ నోటి నుంచి వినిపించే మాట. కాళ్లు భూమి మీద నిలిచేలా ఉంచే మాట.

‘వ్యక్తిగత అనుభవాలు నటనపై ప్రభావం చూపుతాయి’ అంటారు. సేవాకార్యక్రమాల ద్వారా ఈ ప్రపంచాన్ని రకరకాల కోణాలలో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్న రాజశ్రీ దేశ్‌పాండే నటనపై కూడా తన నటజీవితానికి ఆవల ప్రపంచానికి సంబంధించిన అనుభవాల ప్రభావం ఉంది.

- ఫస్ట్ టైమ్



ఓపెన్ ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రిసెర్చ్ ఆర్గనైజేషన్-యూఎస్) తొలి ఉద్యోగిగా మన దేశంలో నియామకం అయిన ప్రజ్ఞామిశ్రా ప్రత్యేక గుర్తింపు సాధించింది...

ఓపెన్ ఏఐలో ‘గవర్నమెంట్ రిలేషన్స్’ హెడ్‌గా బాధ్యతలు నిర్వహించనుంది 39 సంవత్సరాల ప్రజ్ఞా మిశ్రా. ఇంతకు ముందు ‘ట్రూ కాలర్’లో పబ్లిక్ ఎఫైర్స్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించింది. పబ్లిక్ ఎఫైర్స్ డైరెక్టర్‌గా వివిధ శాఖల మంత్రులు, స్టేక్ హోల్డర్‌లు, ఇన్వెస్టర్‌లు, మీడియా పార్ట్‌నర్‌లతో కలిసి పనిచేసింది. దీనికి ముందు మెటా ప్లాట్‌ఫామ్ ‘ఇంక్’లో మూడు సంవత్సరాలు పనిచేసింది. మిస్ ఇన్‌ఫర్మేషన్ వ్యతిరేక క్యాంపెయిన్‌కు నాయకత్వం వహించింది.

ఢిల్లీ యూనివర్శిటీలో కామర్స్‌లో గ్రాడ్యుయేషన్ చేసిన ప్రజ్ఞ ఇంటర్నేషనల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎంబీఏ చేసింది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్‌లో ‘బార్గెయినింగ్ అండ్ నెగోషియేషన్స్’ సబ్జెక్ట్‌లో డిప్లొమా చేసింది.

ప్రజ్ఞ ప్రతిభావంతురాలైన గోల్ఫర్. 1998 నుంచి 2007 వరకు ఎన్నో ఇంటర్నేషనల్ టోర్నమెంట్స్‌లో ఆడింది. మెడిటేషన్ ట్రైనర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకుంది. వ్యక్తిత్వ వికాస కోణంలో పాడ్‌కాస్ట్‌లో ప్రసంగాలు చేసింది. ఈ నెల ఆఖరులో ‘ఓపెన్ ఏఐ’తో తన ప్రయాణాన్ని ప్రారంభించనుంది ప్రజ్ఞామిశ్రా.

మొలకలు తినడంలో మెలకువలు



చాలామందికి మొలకెత్తిన గింజలు తినడం అలవాటు. వీటిని ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల అనేకమైన ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఈ విషయం ప్రాచుర్యంలోకి రావడం వల్ల ప్రస్తుత కాలంలో చాలా మంది స్ప్రౌట్స్ తినడం తమ ఆహారపు అలవాట్లలో భాగంగా చేసుకుంటున్నారు. అయితే చాలామంది వీటిని తినే విషయంలో కొన్ని పొరపాట్లు చేస్తున్నారు. ఫలితంగా మొలకలు తినడం మూలాన కలిగే ప్రయోజనాల మాట అటుంచి, అజీర్తి, గ్యాస్ వంటి ఇతర సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. అందువల్ల మొలకలను ఎలా తీసుకోవాలో మెలకువలు తెలుసుకుందాం...

మొలకెత్తిన విత్తనాలను సంపూర్ణ ఆహారంగా చెప్పవచ్చు. శరీరానికి కావల్సిన పోషకాలు అన్నీ మొలకెత్తిన విత్తనాలలో ఉంటాయి. అయితే మొలకెత్తిన గింజలను నమలడం కొద్దిగా కష్టంతో కూడిన పని. తక్కిన టిఫిన్లతో పోల్చితే వీటిని తినడానికి, అవి అరగడానికి కాస్త ఎక్కువ సమయం పడుతుంది. ఈ ఇబ్బంది ఎందుకులే అని కొందరు వీటిని జ్యూస్ చేసుకొని తాగేస్తుంటారు. ఇది అతి పెద్ద పొరపాటు. మొలకెత్తిన విత్తనాలను జ్యూస్ చేసి తాగడం వల్ల వీటిలో ఉండే పోషకాలు శరీరానికి ఎక్కువగా అందవు. నిజానికి మొలకెత్తిన విత్తనాలను నమిలినప్పుడు మన నోట్లో లాలాజలం ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. ఈ లాలాజలం మొలకెత్తిన విత్తనాలలో ఉండే కార్బోహైడ్రేట్స్ జీర్ణం అవ్వడానికి సహాయపడుతుంది. జ్యూస్ చేసి తాగడం వల్ల ఈ కార్బోహైడ్రేట్స్ జీర్ణం అవ్వవు. కనుక శరీరం వీటిని సంగ్రహించుకోలేదు.

మొలకెత్తిన విత్తనాలను నమిలినప్పుడు వీటిని జీర్ణం చేయడానికి జీర్ణాశయం, ప్రేగులల్లో రసాయనాలు ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. దీనివల్ల పేగులు పోషకాలను ఎక్కువగా శోషించుకుంటాయి. ఈ విత్తనాలను జ్యూస్ చేసి తాగడం వల్ల రసాయనాల ఉత్పత్తి ఎక్కువగా జరగక మన పేగులు వీటిల్లో ఉండే పోషకాలను ఎక్కువగా శోషించుకోలేవు. పైగా జ్యూస్ చేసి తాగడం వల్ల వాంతులు అయ్యే అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయి. ఇంతకీ వీటిని ఎలా తీసుకోవాలి సందేహం చాలామందికి వస్తుంది.

మొలకెత్తిన విత్తనాలను నేరుగా తినడమే మనకు చాలా మంచిది. ఇలా నేరుగా తినడం వల్లనే మన శరీరానికి కావల్సిన పోషకాలు అన్నీ లభిస్తాయి. అలా తినలేకపోతే కొద్దిగా నూనె వేసి వేయించి ఉప్పూకారం నిమ్మరసం కలుపుకుని తినవచ్చు లేదా వీటిలో తేనె, నిమ్మరసం, ఖర్జూర, దానిమ్మ గింజలు, ఎండు ద్రాక్ష, ఉల్లిపాయ ముక్కలు వేసుకుని తినడం వల్ల రుచి మెరుగుపడుతుంది. కనుక సులభంగా తినవచ్చు.

ప్రకృతి జీవనంలో ఆరోగ్యం ఆహ్లాదం

ఎండలు దంచేస్తున్నాయి. ఇది కొంత అసౌకర్యంగా అనిపించవచ్చు. అలాగని ఎండలని తిట్టుకుంటూ కూర్చోవడం సరి కాదు. ఎండలకు జడిసి ఇంటిలోనుంచి కాలు బయట పెట్టకుండా ఉండటమూ మంచిది కాదు. ఎందుకంటే మొన్న వచ్చిన ఉగాదితో మనం వసంత రుతువులో అడుగు పెట్టాం. వసంత రుతువన గానే చిగిర్చిన పచ్చని చెట్లు, పక్షులు, జంతువులు, రంగురంగుల పువ్వులు, సూర్యుడి కాంతి, చంద్రుని వెన్నెల, నక్షత్రాలు, అడపాదడపా వీస్తూ ఒంటికి హాయినిచ్చే చల్లటి గాలు... ఇలా ప్రకృతి ఎన్నో రూపాలలో మన చుట్టూ ఉంటుంది. మనం కూడా ప్రకృతిలో భాగమే, మన ఉనికికి కారణం ప్రకృతే. మన జీవితం ప్రకృతి మీద ఆధారపడి ఉంది. కానీ మనలో చాలామంది ప్రకృతికి పెద్ద ప్రాముఖ్యత ఇవ్వరు. ఈ ఆధునికత, నాగరకత వల్ల మనం ప్రకృతి నుంచి దూరంగా బతుకుతున్నాం. అయితే ప్రకృతిలో గడపడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకుందాం.

ప్రకృతిలో గడపడం వల్ల కలిగే ఉపయోగాలు ఏంటి? ప్రకృతికి మనం ఎందుకు ప్రాముఖ్యత ఇవ్వాలి? ప్రకృతిలో గడపలేని వారు అందుకు ప్రత్యామ్నాయంగా ఏం చేయవచ్చో చూద్దామా...



ఒత్తిడి నుంచి విడుదల

ఈ రోజుల్లో చిన్న నుంచి పెద్ద దాకా అందరికీ ఒత్తిడి సాధారణం అయిపోయింది. అలాంటప్పుడు వీలయినప్పుడల్లా ప్రకృతిలో కాస్త సమయం గడిపితే ఒత్తిడి చాలా మేరకు తగ్గుతుంది. ఎన్నో రకాల శారీరక, మానసిక రుగ్మతల నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చు.

వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది

మన ఆరోగ్యంగా ఉండాలంటే రోగ నిరోధక శక్తి చాలా అవసరం. రోజూ కొద్దిసేపు ప్రకృతిలో గడపడం వల్ల మన శరీరానికి లేలేత సూర్యకిరణాలలోని విటమిన్ అందుతుంది. చల్లటి గాలి తగులుతుంది. ఇది వ్యాధులు నయం అయ్యే గుణాన్ని పెంచుతుంది. అంటే రోగనిరోధక శక్తి సహజంగానే సమకూరుతుందన్నమాట.

శరీరం, మనసు సేదతీరతాయి

కేవలం ఐదు నిముషాలు ప్రకృతిలో గడిపినా శారీరకంగా, మానసికంగా ఎంతో ఆహ్లాదకరమైన అనుభూతిని పొందవచ్చని పరిశోధనలెన్నో ఎలుగెత్తి చాటుతున్నాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది, రక్తపోటు అదుపులో ఉంటుంది. జ్ఞాపక శక్తి, ఏకాగ్రత పెరుగుతాయి.

వయసు తెలియకుండా చేస్తుంది

ఎక్కువగా ప్రకృతిలో గడిపే పెద్దవాళ్ళకి కీళ్ల నొప్పులు, నిద్రలేమి లాంటి సమస్యలు వచ్చే అవకాశం తక్కువ అని పరిశోధనలు చెప్తున్నాయి. అంటే పొలంలో పని చేస్తూ, ప్రకృతికి దగ్గరగా గడిపేవారు మిగిలిన వారితో పోల్చితే చాలా ఆరోగ్యంగా, చలాకీగా ఉన్నట్లు కనిపించేది అందుకే.

ఇతర ప్రయోజనాలు

- మీరు ఎప్పుడైనా మూడీగా ఉన్నప్పుడు కాసేపు ప్రకృతిలో గడిపి చూడండి. ఆ మ్యాజిక్ మీరే చూస్తారు
- ఆరోగ్యకరమైన ప్రాణశక్తి సూర్యుడి నుంచి, భూమి నుంచి, గాలి నుంచి వస్తుంది. ప్రకృతిలో గడపడం వల్ల మనలో ప్రాణశక్తి పెరుగుతుంది
- ఆనందంగా ఉండేలా చేస్తుంది. ఆనందమే మనల్ని నిజంగా ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది
- సృజనాత్మకతని పెంచుతుంది. సమస్యలు పరిష్కరించే సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది
- మనం రోజులో ఎన్నో పనులు చేస్తాం. అలసిపోవడం చాలా సహజం. ప్రకృతిలో గడిపితే శరీరం, మైండ్ నూతన ఉత్సాహంతో ఉంటాయి
- జీవితం కొన్నిసార్లు చాలా రొటీన్‌గా తయారవుతుంది. ప్రకృతిలో గడపడం వల్ల జీవితం కొత్తగా అనిపిస్తుంది
- ప్రకృతిలో గడపడం వల్ల నిద్ర నాణ్యత మెరుగుపడుతుంది
- మనం సూర్యరశ్మిలో గడిపినపుడు మన శరీరంలో విటమిన్ ఈ పెరుగుతుంది. దాని వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయి
- ప్రకృతిలో గడపడం వల్ల ఆత్మ విశ్వాసం, ఫిట్ నెస్ పెరుగుతాయి
- ఇంట్లో చేసిన వ్యాయామం కన్నా ప్రకృతి సహజమైన వాతావరణంలో చేసే వ్యాయామం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయని పరిశోధనలు చెప్తున్నాయి. కాబట్టి వ్యాయామాన్ని నాలుగు గోడల మధ్యలో కాకుండా ప్రకృతిలో చెయ్యడం ప్రారంభిస్తే జీవన నాణ్యత పెరగడాన్ని మీరే గమనించవచ్చు.



ప్రకృతిలో ఎలా గడపాలంటే..?

వేగంగా నడవడం, జాగింగ్: మెడిటేషన్ చెయ్యడం: గుండెలనిండా గాలి పీల్చి వదులుతుండడం, వ్యాయామం లేదా యోగా చేయడం మంచిది.

ప్రకృతిలో గడపడం వల్ల మన శరీరానికి వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని పరిశోధనలు చెప్తున్నాయి.

మీకు ఏం చేయాలనిపించకుండా బోర్ గా ఉంటే వెళ్ళి కాసేపు ప్రకృతిలో కూర్చోండి. ఆ చల్లని గాలిని ఎంజాయ్ చెయ్యండి. బయటకి వెళ్ళడానికి కూడా ఇష్టం లేదా? అయితే కేవలం మన ప్రకృతిలో ఉన్నట్టు ఊహించుకున్నా, ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయని పరిశోధనలు చెప్తున్నాయి. అద్భుతం కదా? కాబట్టి మీరు ఎప్పుడైతే ఒత్తిడి తగ్గించుకోవాలనుకుంటారో అప్పుడు ముందుగా ఒక పెద్ద చెట్టుకింద కూర్చున్నట్టు లేదా అడవిలో నడుస్తున్నట్టు ఊహించుకోండి. వీలుంటే ఇంట్లో అందమైన ప్రకృతి పెయింటింగ్స్ పెట్టుకోవడం, ఇండోర్ ప్లాంట్స్ పెంచుకోవడం చాలా ప్రయోజనకరం.



చెమట కాయలా? ఉపశమనం ఇలా...

ఎండలు మండుతున్నాయి. దీంతో విపరీతమైన చెమట, దురదలతో చాలా ఇబ్బంది పడిపోతుంటారు. చర్మం తన మృదుత్వాన్ని కూడా కోల్పోతుంది. చెమటకాయలు దురదకు కారణమై, చికాకు, ఆయా భాగాలలో మంట, నొప్పికి దారితీస్తాయి. అతిగా చెమట పట్టే వారిలో వీటి సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా నుదుటిపై, ముఖం, మెడ, వీపు, ఛాతీ, తొడల మీద చెమట కాయలు వస్తుంటాయి. వీటి తీవ్రత ఎక్కువైతే చర్మం ఎర్రపొక్కులుగా మారటం, గోకటం వల్ల చర్మం చిట్లి రక్తం కారడం జరుగుతుంది. కొన్ని చిట్కాలతో కొంత ఉపశమనం పొందవచ్చు. అవేంటో చూద్దాం.

రెండు పూటలా స్నానం చేస్తూ శరీరాన్ని శుభ్రంగా వుంచుకోవాలి. చెమట ఎక్కువగా పట్టినప్పుడు స్నానం చేయడం, లేదా తడి వస్త్రంతో శరీరాన్ని తుడవడం తప్పనిసరి. వదులుగా ఉండే పల్చని కాటన్ వస్త్రాలు వేసుకోవాలి. నీళ్లు బాగా తాగాలి. దాంతో శరీరం చల్లగా ఉంటుంది. వీలైనంత వరకు ఎండలోకి వెళ్లకుండా చూసుకోవాలి. స్నానం చేసే నీటిలో గుప్పెడు మల్లెపూలు, జాజిపూలు లేదా వట్టివేళ్ల చూర్ణం వేసి గంటసేపు నాననిచ్చి, ఆ నీటితో స్నానం చేయడం మంచిది. ఇటువంటి స్నానం శరీరాన్ని చల్లగా ఉంచుతుంది.

ఒంటినిండా చెమటకాయలు వచ్చినప్పుడు గంధం ముద్దని పేలిన చోట పల్చని పూతలా వేసుకుంటే, మంట, దురద తగ్గుతాయి. ఇందులో కర్పూరాన్ని కలిపి పేలిన చోట లేపనంలా రాసినా కూడా సమస్య అదుపులోకి వస్తుంది. మార్కెట్లో లభ్యమయ్యే గంధం పొడిలో సహజత్వం ఉండదు. అందుకే గంధపు చెక్కని సానపై అరగదీసి, దాన్ని వాడటం శ్రేయస్కరం. చందనం పొడి, వట్టివేళ్ల పొడిని రోజ్‌వాటర్‌లో కలిపి పల్చని లేపనంలా చెమట కాయలపై రాసినా మంచిదే. కలబంద గుజ్జుని రాసుకున్నా కూడా చెమటకాయల నుంచి ఉపశమనం కలుగుతుంది.

తాటి ముంజెలలోని నీటిని చెమట కాయలపై రాసి, ఆరిన తర్వాత శుభ్రమైన వస్త్రంతో మృదువుగా తుడిచేయాలి. పుచ్చకాయ, కర్బూజా, కీరదోస, ముంజెలు, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, పల్చని మజ్జిగ... వంటి చలువచేసే పదార్థాలు వీలైనంత ఎక్కువగా తీసుకోవాలి. కారం, గరం మసాలా, నూనెలో వేయించిన పదార్థాలకు దూరంగా ఉండాలి.

సినిమా

పిచ్చి పట్టిందా నీకు...



• శర్వానంద్, కృతీ శెట్టి, విక్రమాదిత్య

'మంచిగా కనపడేవాళ్లందరూ మంచివాళ్లు కాదురా... ఫర్ ఎగ్జాంపుల్ నేను' అంటూ మొదలవుతుంది 'మనమే..' సినిమా టీజర్. శర్వానంద్, కృతీ శెట్టి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం ఇది. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. శుక్రవారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ప్లేబాయ్ మనస్తత్వం ఉండే అబ్బాయి, బాధ్యతగా జీవించాలనుకునే ఓ అమ్మాయి జీవితాల్లోకి విక్రమాదిత్య అనే ఓ పిల్లవాడు వచ్చినప్పుడు వారి జీవితాలు ఎలా ప్రభావితం అయ్యాయి? అన్నదే ఈ చిత్రం కథాంశమన్నట్లుగా యూనిట్ చెబుతోంది. 'వాడప్పట్నుంచి ఆపకుండా ఏడుస్తున్నాడు. అసలేం చేశావ్... (కృతీ శెట్టి), 'తాగటానికెళ్లొచ్చా..' (శర్వానంద్), 'ఇల్లు చూసుకోవడం రాదు... పిల్లవాడిని చూసుకోవడం రాదు... పిచ్చిపట్టిందా నీకు...' (కృతీ శెట్టి), 'ఇద్దరిలో ఒకళ్లు ఏడ్వండి' (శర్వానంద్) వంటి సంభాషణలు విడుదలైన టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, సహ-నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

వారం ఆలస్యంగా...



• తమన్నా

సుందర్ .సి కీలక పాత్రలో నటించి, దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'అరణ్మనై 4'. ఇందులో తమన్నా, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటించారు. ఖుష్బు సుందర్, ఏసీఎస్ అరుణ్ కుమార్ నిర్మించారు. ఈ మూవీని 'బాక్' పేరుతో ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్ఎల్‌పీ తెలుగులో విడుదల చేస్తోంది. ఈ నెల 26న తెలుగు, తమిళ భాషల్లో ఈ మూవీని రిలీజ్ చేయాలనుకున్నారు. అయితే ఎండల తీవ్రత అధికంగా ఉండటం వలన విడుదలను వాయిదా వేశామని మేకర్స్ ప్రకటించారు. వారం ఆలస్యంగా మే 3న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. 'వెన్నెల' కిశోర్, శ్రీనివాస్ రెడ్డి, ఢిల్లీ గణేశ్, కోవై సరళ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సంగీతం: హిప్‌హాప్ తమిళ, కెమెరా: కృష్ణమూర్తి.

ప్రతిసారీ కొత్త కోణం కనిపించింది

- విజయేంద్ర ప్రసాద్



• జగపతిబాబు, విజయేంద్ర ప్రసాద్, ఆయుష్, సుశ్రీ

''రుస్లాన్' టీజర్‌ని చాలాసార్లు చూశాను. చూసిన ప్రతిసారీ కొత్త కోణం కనిపించింది. ఆయుష్ శర్మ బాగా నటించాడు. రాధామోహన్‌గారు చాలా ప్యాషన్ ఉన్న నిర్మాత. ఈ సినిమాని అద్భుతంగా నిర్మించారు'' అని ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్ అన్నారు. ఆయుష్ శర్మ, సుశ్రీ మిశ్రా జంటగా నటించిన హిందీ చిత్రం 'రుస్లాన్'. కరణ్ .బి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో జగపతిబాబు కీలక పాత్ర పోషించారు. కేకే రాధామోహన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో జగపతిబాబు మాట్లాడుతూ– ''హిందీలో 'రుస్లాన్' నా రెండో చిత్రం. ఈ సినిమా పెద్ద హిట్ అవుతుంది'' అన్నారు. ''సల్మాన్ ఖాన్‌గారి 'సుల్తాన్' సినిమాకి సహాయ దర్శకుడిగా చేశాను. అప్పుడు విజయేంద్ర ప్రసాద్‌గారు నన్ను నటుడిగా లాంచ్ చేస్తే బావుంటుందన్నారు. అలా నటుడిగా నా జర్నీ మొదలైంది'' అన్నారు ఆయుష్. ''రుస్లాన్' చాలా స్పెషల్ మూవీ'' అన్నారు సుశ్రీ మిశ్రా. ''మా బ్యానర్‌లో నిర్మించిన తొలి హిందీ చిత్రం 'రుస్లాన్'' అన్నారు కేకే రాధామోహన్.

ఇరవయ్యేళ్ల తర్వాత యాభై ఆరవ చిత్రంలో...



• శోభన • మోహన్‌లాల్

మాలీవుడ్ సిల్వర్ స్క్రీన్ హిట్ పెయిర్ మోహన్‌లాల్, శోభనల జోడీ రిపీట్ కానుంది. మోహన్‌లాల్ హీరోగా తరుణ్ మూర్తి దర్శకత్వంలో ఎమ్. రంజిత్ ఓ సినిమా నిర్మించనున్నారు. ఈ చిత్రంలో శోభన కథానాయికగా నటించనున్నారు. ఈ సినిమాలో భాగమైనట్లుగా సోషల్ మీడియాలో శోభన ఓ వీడియో షేర్ చేశారు. ''మోహన్‌లాల్‌గారి ఈ 360వ సినిమాలో నేను నటించనున్నాను. నాకు గుర్తు ఉన్నంతవరకు ఆయనతో నేను కలిసి చేయబోతున్న 56వ చిత్రం ఇది'' అని ఆ వీడియోలో పేర్కొన్నారు శోభన. ఇక 1985లో వచ్చిన మలయాళ చిత్రం 'అవిడతే పోలే ఇవిడెయుమ్'లో తొలిసారి కలిసి నటించారు మోహన్‌లాల్, శోభన. ఆ తర్వాత ఈ ఇద్దరూ 'మణిచిత్ర తాళు' (ఈ సినిమా ఆధారంగానే 'చంద్రముఖి' తీశారు), 'నాడోడిక్కట్టు' వంటి హిట్ చిత్రాల్లో నటించారు. 1994లో వచ్చిన మలయాళ చిత్రం 'తేన్మావిన్ కొంబాట్'లో మోహన్‌లాల్, శోభన లీడ్ రోల్స్‌లో నటించారు. ఇప్పుడు 20 ఏళ్ల తర్వాత మోహన్‌లాల్, శోభన కలిసి నటించనున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే.. 2009లో వచ్చిన మలయాళ చిత్రం 'సాగర్ ఆలియాస్ జాకీ రీలోడెడ్'లో మోహన్‌లాల్ హీరోగా నటించగా, శోభన ఓ అతిథి పాత్ర చేశారు.

పొట్టేల్‌లాంటివి అరుదుగా వస్తాయి

- సందీప్ రెడ్డి



• అనన్య, యువ చంద్ర, సందీప్ రెడ్డి వంగా

''పొట్టేల్' సినిమా టీజర్ చూడగానే.. ఇలాంటి కంటెంట్ మలయాళ సినిమాలో ఎక్కువగా చూస్తుంటాం.. తెలుగులో ఇలాంటి చిత్రాలు ఎందుకు రావట్లేదని అనుకుంటాం. కానీ, 'పొట్టేల్'లాంటి చిత్రాలు అరుదుగా వస్తాయి. చిన్న, రూరల్ సినిమాలని అందరూ ప్రోత్సహించాలి'' అని డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా అన్నారు. యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల ముఖ్య తారలుగా సాహిత్ మోత్కూరి దర్శకత్వం వహించిన చిత్రం 'పొట్టేల్'. నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగే నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ని సందీప్ రెడ్డి వంగా విడుదల చేశారు. అనంతరం యువ చంద్ర కృష్ణ మాట్లాడుతూ– ''పొట్టేల్' మన మట్టికథ. మంచి భావోద్వేగాలు, వాణిజ్య అంశాలున్న తెలుగు సినిమా ఇది'' అన్నారు. ''నా కెరీర్‌లో ఇది బెస్ట్ మూవీ అవుతుంది'' అన్నారు అనన్య నాగళ్ల. ''ఈ సినిమా విషయంలో యూనిట్ అంతా చాలా గర్వంగా ఉన్నాం'' అన్నారు సాహిత్ మోత్కూరి. ''ఇది మట్టి నుంచి పుట్టిన కథ. సినిమా బాగా వచ్చింది'' అన్నారు నిశాంక్, సురేష్ కుమార్. నటుడు అజయ్ పాల్గొన్నారు.

లచ్చిమక్క పెళ్లి



• వైశాలీ రాజ్

1980 కాలంలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా పొలిటికల్ డ్రామాగా రూపొందిన చిత్రం 'జితేందర్ రెడ్డి'. విరించి వర్మ దర్శకత్వంలో ముదుగంటి రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రంలో 'బాహుబలి, ఎవరికీ చెప్పొద్దు' సినిమాలతో నటుడిగా పేరు తెచ్చుకున్న రాకేశ్ వర్రె లీడ్ రోల్‌లో నటించగా, వైశాలీ రాజ్, రియా సుమన్, సుబ్బరాజు ఇతర ముఖ్య పాత్రలు చేశారు. పెళ్లి నేపథ్యంలో వచ్చే ఈ చిత్రంలోని 'లచ్చిమక్క...' పాటను విడుదల చేశారు. చిత్ర సంగీతదర్శకుడు గోపీ సుందర్ స్వరపరచిన ఈ పాటకు రాంబాబు గోసాల సాహిత్యం అందించగా మంగ్లీ పాడారు. జితేందర్ రెడ్డి ఇంట్లో జరిగే పెళ్లిలో సరదాగా సాగే పాట ఇది అని యూనిట్ పేర్కొంది. మే 3న ఈ చిత్రం విడుదల కానుంది.

యుద్ధమే చేయాలి



• సాయికుమార్, వినయ్, చరిష్మా

సాయికుమార్, వినయ్, అరుణ్, దీప్తీ వర్మ, ఆమని, చరిష్మా శ్రీకర్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'లక్ష్మీ కటాక్షం'. 'ఫర్ ఓట్' అనేది క్యాప్షన్. యు. శ్రీనివాసుల రెడ్డి, బి. నాగేశ్వర రెడ్డి, వహీద్ షేక్, కె. పురుషోత్తం రెడ్డి నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. 'ఇరవైఐదేళ్ల నుంచి నిర్మించుకుంటూ వస్తున్న రాజకీయ సామ్రాజ్యం రా నాది. నన్ను ఆపాలంటే పెద్ద యుద్ధమే చేయాలి', 'ధర్మా.. నువ్వు ఎమ్ఎల్ఏ కావడానికి కావాల్సిన వంద కోట్లు బయలుదేరబోతున్నాయి', 'ఈ ఎన్నికల్లో ఓటుకు ఒక్క రూపాయి కూడా పంచనివ్వకుండా చేయాలి' అనే డైలాగ్స్ విడుదలైన ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ సినిమాకు సంగీతం: అభిషేక్ రుఫుస్.

రీల్స్

హిందీ వార్‌లో హాలీవుడ్ యాక్షన్



• స్పిరో రజాటోస్

బాలీవుడ్ 'వార్ 2'లో హాలీవుడ్ తరహా యాక్షన్ కనిపించనుంది. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ లీడ్ రోల్స్‌లో అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'వార్ 2' రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తారట. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ ముంబైలోని ఓ స్టూడియోలో జరిగింది. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కాంబినేషన్‌లో ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించారట మేకర్స్. ఈ పోరాట దృశ్యాలను హాలీవుడ్ స్టంట్ కొరియోగ్రాఫర్ స్పిరో రజాటోస్ డిజైన్ చేశారని బాలీవుడ్ సమాచారం. ఇక 'కెప్టెన్ అమెరికా: ది సివిల్ వార్', 'కెప్టెన్ అమెరికా: ది ఫస్ట్ సోల్జర్' 'ఫాస్ట్ ఎక్స్' వంటి హాలీవుడ్ చిత్రాలకు యాక్షన్ డిజైన్ చేశారు స్పిరో. కాగా స్పై జానర్‌లో ఆదిత్యా చోప్రా నిర్మిస్తున్న 'వార్ 2' చిత్రం వచ్చే ఏడాది ఆగస్టు 14న రిలీజ్ కానుంది.


మ్యాడ్‌కి శుభాకాంక్షలు



• సిద్ధు జొన్నలగడ్డ

హిట్ మూవీ 'డీజే టిల్లు'కి సీక్వెల్‌గా 'టిల్లు స్క్వేర్'తో హిట్ అందుకున్న సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నుంచి మరో హిట్ మూవీ సీక్వెల్ రానుంది. ఈ సంస్థ నిర్మించిన 'మ్యాడ్' (2023) మూవీకి సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్' షురూ అయింది. 'మ్యాడ్'లో హీరోలుగా నటించిన నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ సీక్వెల్‌లోనూ నటిస్తున్నారు. 'మ్యాడ్' దర్శకుడు కల్యాణ్ శంకర్ సీక్వెల్‌ని కూడా తెరకెక్కిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్, సూర్యదేవర నాగవంశీ సమర్పణలో సూర్యదేవర హారిక, సాయి సౌజన్య నిర్మిస్తున్న 'మ్యాడ్ స్క్వేర్' హైదరాబాద్‌లో ఆరంభమైంది. ఈ కార్యక్రమానికి హీరో సిద్ధు జొన్నలగడ్డ, దర్శకుడు కేవీ అనుదీప్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చిత్రదర్శకుడికి స్క్రిప్ట్ అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు సిద్ధు జొన్నలగడ్డ. ''మ్యాడ్' చిత్రంకన్నా రెట్టింపు వినోదాన్ని 'మ్యాడ్ స్క్వేర్' ద్వారా అందించబోతున్నాం. కథానాయికల వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అన్నారు మేకర్స్.

ట్రాప్‌లో కిల్లర్



• జోష్ హార్ట్‌నెట్

జోష్ హార్ట్‌నెట్, ఏరియల్ డోనోఘ్యూ, సలేకా శ్యామలన్, హయిలే మిల్స్ ముఖ్య తారలుగా నటిస్తున్న హాలీవుడ్ చిత్రం 'ట్రాప్'. అశ్విన్ రాజన్, మార్క్ బియన్‌స్టాక్, ఎమ్. నైట్ శ్యామలన్ నిర్మిస్తున్న ఈ సినిమాను వార్నర్ బ్రదర్స్ పిక్చర్స్ ఆగస్టు 9న విడుదల చేయనుంది. ఈ సినిమా ట్రైలర్ విడుదలైంది. ఓ తండ్రి, కూతురు కలిసి ఒక మ్యూజికల్ కాన్సర్ట్‌కు వెళతారు. ఈ కార్యక్రమాన్ని టార్గెట్ చేసి, ఓ సీరియల్ కిల్లర్‌ను పట్టుకోవాలన్నది పోలీసుల ప్లాన్. అయితే ఆ కాన్సర్ట్ అనేది ఓ ట్రాప్ అని ఆ తండ్రికి తెలుస్తుంది. ఎందుకంటే అతనే సీరియల్ కిల్లర్. అప్పుడు ఆ కిల్లర్ ఏం చేశాడు? అన్నదే 'ట్రాప్' కథాంశమని హాలీవుడ్ టాక్. ఆ సీరియల్ కిల్లర్ పాత్రలో జోష్ హార్ట్‌నెట్ నటిస్తున్నారు.

సాక్షి బిజినెస్
శనివారం
20-4-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	559	73,088
నిఫ్టీ ▲	151	22,147

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	15,370	▼ 231
డోజోన్స్	37,994	▲ 219
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,896	▲ 19
డాక్స్	17,737	▼ 100
షాంఘై	3,065	▼ 9
నికాయ్	37,068	▼1,011

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	73,404	▼ 73
బంగారం (99.5 స్వచ్ఛత)	73,110	▼ 73
వెండి (కేజీ)	71,576	▼ 474

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒక్కటి	83.17	84.19
£	బ్రిటన్ పౌండ్	ఒక్కటి	102.67	105.22
€	యూరో	ఒక్కటి	87.86	90.22
¥	జపాన్ ఎన్ (100)	ఒక్కటి	53.62	54.82
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒక్కటి	52.57	54.49
S$	సింగపూర్ డాలర్	[illegible]	59.20	63.40
SAR	సౌదీ రియాల్	[illegible]	21.37	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.84	23.61
¥	చైనా యువాన్	[illegible]	10.39	12.39

ఎన్నికల వేళలోనూ ఆర్థిక క్రమశిక్షణ ..

భారత ఎకానమీకి ఐఎంఎఫ్ కితాబు



వాషింగ్టన్: ఎన్నికల సంవత్సరంలోనూ కూడా భారత్ ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తోందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) కితాబిచ్చింది. భారత ఆర్థిక వ్యవస్థ మెరుగ్గా రాణిస్తోందని, ప్రపంచానికి కాంతి పుంజంలా కొనసాగుతోందని పేర్కొంది. 'ప్రస్తుతం భారత ఎకానమీ మెరుగ్గానే ఉంది. 6.8 శాతం వృద్ధి అనేది చాలా మంచి రేటే. ద్రవ్యోల్బణం దిగి వస్తోంది. ఫండమెంటల్స్ పటిష్టంగానే కనిపిస్తున్నాయి. ఎన్నికల సంవత్సరంలో కూడా ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తుండటం చెప్పుకోగిన విషయం. ఎందుకంటే చాలా దేశాలు ఇలాంటప్పుడు ఆర్థికంగా చాలా సాహసాలు చేస్తుంటాయి. కానీ ఈ ప్రభుత్వం క్రమశిక్షణ పాటిస్తోంది' అని ఐఎంఎఫ్ డైరెక్టర్ (ఆసియా, పసిఫిక్ విభాగం) కృష్ణ శ్రీనివాసన్ ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. గత అనేక సంవత్సరాలుగా భారత్ అనేక షాక్‌లను సమర్థంగా ఎదుర్కొని, బైటపడిందన్నారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న పెద్ద ఎకానమీల్లో ఒకటిగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రైవేట్ వినియోగం, ప్రభుత్వ పెట్టుబడుల తోడ్పాటుతో 2024–25 ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు 6.8 శాతంగా ఉండొచ్చని అంచనా వేస్తున్నట్లు శ్రీనివాసన్ తెలిపారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, యువ జనాభా మొదలైన అంశాలన్నీ కూడా ఇందుకు ఊతమివ్వగలవని చెప్పారు. జనాభాపరమైన ప్రయోజనాలను పొందాలంటే భారత్ విద్య, ఆరోగ్యంపై భారీగా ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుందని శ్రీనివాసన్ చెప్పారు.

మెరుగుపడిన ఉపాధి కల్పన!

ఈపీఎఫ్‌ఓ గణాంకాల వెల్లడి



న్యూఢిల్లీ: రిటైర్‌మెంట్ ఫండ్ సంస్థ– ఈపీఎఫ్‌ఓలో మార్చితో ముగిసిన గత 2023–24 ఆర్థిక సంవత్సరంలో 1.65 కోట్ల మంది కొత్త సభ్యత్వం పొందారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో చేరిన సభ్యులతో పోల్చితే ఈ సంఖ్య 19 శాతం అధికం. దేశంలో ఉపాధి పరిస్థితి మెరుగుపడినట్లు తాజా పేరోల్ డేటా వివరించింది. గడచిన ఆరు సంవత్సరాల్లో 6.1 కోట్లకుపైగా ఈపీఎఫ్‌ఓలో చేరినట్లు కార్మిక మంత్రిత్వశాఖ అధికారి ఒకరు తెలిపారు. 2017–18లో నిరుద్యోగితా రేటు 6 శాతం ఉంటే, 2022–23లో ఈ రేటు 3.2 శాతానికి తగ్గినట్లు కూడా వెల్లడించారు.

● ఇన్ఫోసిస్ డివిడెండ్ ధమాకా..

బుల్లి బిలియనీర్‌కు రూ. 4 కోట్లు



న్యూఢిల్లీ: బుల్లి బిలియనీర్ ఐదు నెలల ఏకగ్రాహ రోహన్ మూర్తి తాజాగా రూ. 4.2 కోట్లు అందుకోనున్నాడు. ఐటీ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తి మనుమడు ఏకగ్రాహకు ఇటీవల 15 లక్షల షేర్లను బహుమతిగా ఇవ్వడంతో ఇది సాధ్యపడింది. క్యూ4తోపాటు, గత ఆర్థిక సంవత్సరానికి ఫలితాలు ప్రకటించిన ఇన్ఫోసిస్ వాటాదారులకు షేరుకి రూ. 28 డివిడెండ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో ఇన్ఫోసిస్ వాటాదారుడిగా ఏకగ్రాహకు డివిడెండ్ రూపేణా రూ. 4.2 కోట్లు లభించనున్నాయి. ఏకగ్రాహకు నారాయణ మూర్తి కానుకగా ఇచ్చిన ఇన్ఫోసిస్ షేర్ల విలువ రూ. 240 కోట్లుకాగా.. బుల్లి బిలియనీర్ తాజాగా 4 కోట్ల నగదును అందుకోనున్నాడు. ప్రత్యేక డివిడెండ్ రూ. 8తో కలిపి మొత్తం రూ. 28 డివిడెండ్‌ను ఇన్ఫోసిస్ జూలై1 కల్లా చెల్లించనుంది. ఇందుకు మే 31 రికార్డ్ డేట్‌గా ప్రకటించింది.

ఐటీ కంపెనీల్లో కోతలు..

టాప్ 3 సంస్థల్లో 64వేల మంది తగ్గుదల



బెంగళూరు: అంతర్జాతీయంగా డిమాండ్ బలహీనంగా ఉండటం, టెక్నాలజీపై క్లయింట్లు ఖర్చులను తగ్గించుకోవడం తదితర అంశాలు దేశీ ఐటీ రంగంపై ప్రభావం చూపుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరం మూడు దిగ్గజ సంస్థలు .. టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రోలో 64,000 మందికి పైగా సిబ్బంది తగ్గారు. ఆయా కంపెనీల ఆర్థిక ఫలితాల ప్రకారం అగ్రగామి టీసీఎస్‌లో ఉద్యోగుల సంఖ్య 13,249 మేర తగ్గి 6,01,546కి పరిమితమైంది. అలాగే రెండో అతి పెద్ద ఐటీ సేవల సంస్థ ఇన్ఫీలోనూ 25,994 మంది నిష్క్రమించగా ఉద్యోగుల సంఖ్య 3,17,240కి తగ్గింది. ఇన్ఫీలో అట్రిషన్ రేటు (ఉద్యోగుల వలసలు) 12.6 శాతంగా ఉంది. ఇక శుక్రవారం ఫలితాలు వెల్లడించిన విప్రోలో ఉద్యోగుల సంఖ్య 24,516 మేర తగ్గి 2,34,054కి పరిమితమైంది.

కనిష్టాల వద్ద కొనుగోళ్లు

నాలుగు రోజుల నష్టాలకు చెక్ ● రాణించిన బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లు



ముంబై: కనిష్ట స్థాయిల వద్ద బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆటో షేర్ల భారీ కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీల నాలుగురోజుల వరుస నష్టాలకు శుక్రవారం చెక్ పడింది. సెన్సెక్స్ 559 పాయింట్లు లాభపడి 73,088 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 151 పాయింట్లు పెరిగి 22,147 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు ప్రథమార్ధమంతా నష్టాలతో ట్రేడయ్యాయి. అయితే ఇటీవల మార్కెట్ వరుస పతనంలో భాగంగా దిగివచ్చిన లార్జ్ క్యాప్ షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. ఫలితంగా సూచీలు మిడ్ సెషన్ నుంచి లాభాల దిశగా కదిలాయి. ఒక దశలో సెన్సెక్స్ 673 పాయింట్లు పెరిగి 73,210 వద్ద, నిఫ్టీ 184 పాయింట్లు బలపడి 22,180 వద్ద ఇంట్రాడే గరిష్టాలను అందుకున్నాయి. రికవరీ ర్యాలీలోనూ ఐటీ, టెలికం, యుటిలిటీ, రియల్టీ, టెక్ రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.39%, 0.04% చొప్పున నష్టపోయాయి.

విప్రో.. వీక్!



- ● క్యూ4 నికర లాభం డౌన్
- ● రూ. 2,835 కోట్లకు చేరిక
- ● ఆకట్టుకోని క్యూ1 అంచనాలు

బెంగళూరు: ఐటీ సేవల దిగ్గజం విప్రో లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం వార్షికంగా దాదాపు 8 శాతం క్షీణించి రూ. 2,835 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2022–23) ఇదే కాలంలో రూ. 3,075 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 4.2 శాతం వెనకడుగుతో రూ. 22,208 కోట్లకు చేరింది.

అటూఇటుగా వృద్ధి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) తొలి త్రైమాసికానికి(క్యూ1) ఆదాయంలో ప్రతికూల లేదా స్వల్ప వృద్ధిని విప్రో అంచనా వేసింది. వెరసి –1.5 నుంచి +0.5 శాతం గైడెన్స్ ప్రకటించింది. ఇది కంపెనీ కొత్త సీఈవోగా శ్రీనివాస్ పల్లియా బాధ్యతలు స్వీకరించాక వెలువరించిన తొలి గైడెన్స్‌కాగా.. వృద్ధికి ఊతమివ్వడమే ప్రథమ ప్రాథమ్యమని శ్రీనివాస్ పేర్కొన్నారు.



సవాళ్ల ఫలితం

గతేడాది ఐటీ పరిశ్రమకు పలు సవాళ్లు ఎదురయ్యాయ్. దీంతో కంపెనీ పనితీరు ప్రభావితమైంది. స్వల్పకాలంలో మరిన్ని సమస్యలు ఎదురయ్యే అవకాశముంది. అయితే అవకాశాలకు అంతులేదు. మేమంతా కలసికట్టుగా కృషి చేయడం ద్వారా తదుపరి వృద్ధి దశను అందుకోనున్నాం.

– శ్రీనివాస్ పలియా, సీఈవో, విప్రో లిమిటెడ్.

ఇతర విశేషాలు

- ● గతేడాదికి మొత్తం ఆదాయం 1 శాతం నీరసించి రూ. 89,760 కోట్లకు పరిమితమైంది.
- ● నికర లాభం 2.6 శాతం తక్కువగా రూ. 11,045 కోట్లను తాకింది.
- ● ఈ ఏడాది క్యూ1లో ఐటీ సర్వీసుల బిజినెస్ ఆదాయం 261.7-267 కోట్ల డాలర్ల శ్రేణిలో నమోదుకాగలదని అంచనా వేసింది.
- ● పూర్తి ఏడాదిలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 9.1 శాతం క్షీణించి 2,34,054కు పరిమితమైంది.

ఫలితాల నేపథ్యంలో విప్రో షేరు బీఎస్‌ఈలో 2 శాతం లాభంతో రూ. 453 వద్ద ముగిసింది.

పేఇన్‌స్టాకార్డ్ నిధుల సమీకరణ

హైదరాబాద్: బిల్లుల చెల్లింపులను సులభతరం చేసే హైదరాబాదీ ఫిన్‌టెక్ స్టార్టప్ సంస్థ పేఇన్‌స్టాకార్డ్ తాజాగా ఏంజెల్ ఇన్వెస్టర్ల నుంచి పెట్టుబడులు సమీకరించింది. బ్రాండిక్స్ ఇండియా పార్ట్‌నర్ వీసీ దొరస్వామి, పారిశ్రామికవేత్త సంధ్యా రాణి మద్దిపాటి తదితరులు వీరిలో ఉన్నట్లు సంస్థ వ్యవస్థాపకులు సాయి కృష్ణ ముసునూరు, శ్రీ నగేశ్ కోటిపల్లి తెలిపారు. కార్యకలాపాలను విస్తరించేందుకు ఈ నిధులను ఉపయోగిస్తామన్నారు.

ఏపీ అంతటా ఎయిర్‌టెల్ 5జీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారతీ ఎయిర్‌టెల్ ఆంధ్ర ప్రదేశ్‌లోని అన్ని జిల్లాలు, గ్రామాలకు 5జీ నెట్‌వర్క్‌ను విస్తరించినట్టు ప్రకటించింది. ఏపీలో 79 లక్షల మంది కస్టమర్లు 5జీ సేవలను వినియోగిస్తున్నారని సంస్థ వెల్లడించింది. గడిచిన ఆరు నెలల్లో 5జీ వినియోగదార్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఎయిర్‌టెల్ తెలిపింది.

జియో ఫైనాన్షియల్ లాభం రూ. 311 కోట్లు



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లాభం రూ. 311 కోట్లుగా, ఆదాయం రూ. 418 కోట్లుగా నమోదైంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి విభజించిన జియో ఫైనాన్షియల్ .. డిసెంబర్ క్వార్టర్‌లో రూ. 294 కోట్ల నికర లాభం, రూ. 414 కోట్ల ఆదాయం ప్రకటించింది. మరోవైపు, పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ నికర లాభం రూ. 1,605 కోట్లకు చేరింది. జియో ఫైనాన్షియల్ సంస్థ.. ఇన్వెస్టింగ్, ఫైనాన్సింగ్, ఇన్సూరెన్స్ బ్రోకింగ్, పేమెంట్ బ్యాంక్, పేమెంట్ అగ్రిగేటర్ తదితర కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

శుక్రవారం కంపెనీ షేరు బీఎస్‌ఈలో 2 శాతం తగ్గి రూ. 370 వద్ద క్లోజయ్యింది.

హిందుస్తాన్ జింక్ లాభం డౌన్

క్యూ4లో రూ. 2,038 కోట్లు

న్యూఢిల్లీ: వేదాంతా గ్రూప్ మైనింగ్ దిగ్గజం హిందుస్తాన్ జింక్ గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 21 శాతం క్షీణించి రూ. 2,038 కోట్లకు పరిమితమైంది. జింక్ ధరలు నీరసించడం ప్రభావం చూపింది. అంతక్రితం ఏడాది(2022–23) ఇదే కాలంలో రూ. 2,583 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 8,863 కోట్ల నుంచి రూ. 7,822 కోట్లకు తగ్గింది. ఈ కాలంలో రూ. 2,099 కోట్ల క్యాష్‌ఫ్లోను సాధించింది. పెట్టుబడి వ్యయాల తదుపరి గతేడాదిలో కార్యకలాపాల నిర్వహణ ద్వారా రూ. 9,004 కోట్ల నగదు(ఫ్రీ క్యాష్ ఫ్లో)ను సాధించినట్లు కంపెనీ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో షేరు ఎన్ఎస్ఈలో 2 శాతం క్షీణించి రూ. 398 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-4-2024 ఫామ్ ధర...

విశాఖ	430–00
చిత్తూరు	493–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	415–00
విజయవాడ	415–00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	410–00
వరంగల్	412–00
రిటైల్ ధర	4.70

సాక్షి స్పోర్ట్స్



సెమీస్‌లో అనిరుధ్, రిత్విక్ జోడీలు

అకాపుల్కో (మెక్సికో): జీఎన్‌పీ సెగురోస్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్–125 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో హైదరాబాద్ ప్లేయర్లు అనిరుధ్ చంద్రశేఖర్, బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ సంచలనం సృష్టించారు. అనిరుధ్ (భారత్)–హాన్స్ హచ్ వెర్డొగో (మెక్సికో)... రిత్విక్–నిక్కీ పునాచా (భారత్) జోడీలు సీడెడ్ జంటలను బోల్తా కొట్టించి సెమీఫైనల్లోకి ప్రవేశించాయి. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో రిత్విక్–నిక్కీ జంట 6–4, 6–1తో రెండో సీడ్ పీటర్ మటుస్‌జెవ్‌స్కీ (పోలాండ్)–మాథ్యూ క్రిస్టోఫర్ రొమియోస్ (ఆస్ట్రేలియా) జోడీని ఓడించగా... అనిరుధ్–వెర్డొగో ద్వయం 3–6, 6–4, 10–7తో 'సూపర్ టైబ్రేక్'లో మూడో సీడ్ రింకీ హిజికాటా (ఆస్ట్రేలియా)–మ్యాక్ కిగెర్ (అమెరికా) జంటకు షాక్ ఇచ్చింది.



టైటిల్ పోరుకు యూకీ-అల్బానో జోడీ



మ్యూనిక్: భారత టెన్నిస్ అగ్రశ్రేణి క్రీడాకారుడు యూకీ బాంబ్రీ తన కెరీర్‌లో మూడోసారి ఏటీపీ -250 టోర్నీలో డబుల్స్ టైటిల్ పోరుకు అర్హత సాధించాడు. బీఎండబ్ల్యూ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)–అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) ద్వయం ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో యూకీ–ఒలివెట్టి జంట 6–1, 6–7 (5/7), 10–7తో 'సూపర్ టైబ్రేక్'లో ఎర్లెర్–మెడ్లెర్ (ఆస్ట్రియా) ద్వయంపై గెలిచింది. 92 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఈ ఇండో–ఫ్రెంచ్ జోడీ ఏడు ఏస్‌లు సంధించి నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది.

హార్దిక్ పాండ్యాపై రూ. 12 లక్షలు జరిమానా



ముల్లాన్‌పూర్: ముంబై ఇండియన్స్ జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ రూ. 12 లక్షలు జరిమానా విధించింది. ముల్లాన్‌పూర్‌లో గురువారం పంజాబ్ కింగ్స్ జట్టుతో ఐపీఎల్ మ్యాచ్‌లో ముంబై జట్టు నిర్ణీత సమయంలో పూర్తి 20 ఓవర్ల కోటా పూర్తి చేయలేకపోయింది. దాంతో స్లో ఓవర్‌రేట్ నమోదు చేసినందుకు హార్దిక్‌పై పెనాల్టీని విధించారు. తాజా సీజన్‌లో ఇప్పటి వరకు స్లో ఓవర్‌రేట్ కారణంగా రిషభ్ పంత్ (ఢిల్లీ క్యాపిటల్స్–2 సార్లు), శుబ్‌మన్ గిల్ (గుజరాత్ టైటాన్స్), సంజూ సామ్సన్ (రాజస్తాన్ రాయల్స్), శ్రేయస్ అయ్యర్ (కోల్‌కతా నైట్‌రైడర్స్)లపై జరిమానా విధించారు.

నాలుగో స్థానంలో దీపా కర్మాకర్

దోహా: ప్రపంచకప్ జిమ్నాస్టిక్స్ టోర్నీలో భారత మహిళా జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ వాల్ట్ ఈవెంట్‌లో నాలుగో స్థానంలో నిలిచింది. ఫైనల్లో దీపా 13.333 పాయింట్లు స్కోరు చేసింది. నవాస్ కార్లా (పనామా; 13.850 పాయింట్లు) స్వర్ణం, ఆన్ చాంగ్ (కొరియా; 13.833 పాయింట్లు) రజతం సాధించి పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు. వచ్చే నెలలో తాష్కెంట్‌లో జరిగే ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో దీపా రాణిస్తే పారిస్ బెర్త్ సాధించే అవకాశముంది.

'సూపర్' పోరులో జెయింట్స్ పైచేయి

ఐపీఎల్ సీజన్‌లో వరుసగా రెండు ఓటముల తర్వాత లక్నో సూపర్ జెయింట్స్ కోలుకుంది. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో చెన్నై సూపర్ కింగ్స్‌ను నిలువరించిన లక్నో ఆ తర్వాత ఎలాంటి తడబాటు లేకుండా లక్ష్యం చేరింది. ఛేదనలో కేఎల్ రాహుల్, డికాక్ కీలక పాత్ర పోషించగా... రెండు వరుస విజయాల తర్వాత చెన్నై తలవంచింది.

- • సొంతగడ్డపై లక్నో విజయం
- • 8 వికెట్లతో ఓడిన చెన్నై
- • రాణించిన రాహుల్, డికాక్



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రాహుల్

లక్నో: సొంతగడ్డపై సమష్టి ప్రదర్శనతో లక్నో కీలక విజయాన్ని అందుకుంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో లక్నో 8 వికెట్ల తేడాతో ఐదుసార్లు చాంపియన్ చెన్నైపై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. రవీంద్ర జడేజా (40 బంతుల్లో 57 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ చేయగా... రహానే (24 బంతుల్లో 36; 5 ఫోర్లు, 1 సిక్స్), మొయిన్ అలీ (20 బంతుల్లో 30; 3 సిక్స్‌లు), ధోని (9 బంతుల్లో 28 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. అనంతరం లక్నో 19 ఓవర్లలో 2 వికెట్లకు 180 పరుగులు సాధించి గెలిచింది. కెప్టెన్ కేఎల్ రాహుల్ (53 బంతుల్లో 82; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు), క్వింటన్ డికాక్ (43 బంతుల్లో 54; 5 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 90 బంతుల్లోనే 134 పరుగులు జోడించి విజయాన్ని సులువు చేశారు.

ధోని మెరుపులు...

ఓపెనర్ రచిన్ రవీంద్ర (0) టోర్నీలో తన వరుస వైఫల్యాలను కొనసాగించగా... మరో ఎండ్‌లో రహానే కొన్ని చక్కటి షాట్లు ఆడాడు. పవర్‌ప్లే ముగిసేసరికి చెన్నై 51 పరుగులు చేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (17) ప్రభావం చూపలేకపోగా, నాలుగో స్థానంలో వచ్చిన జడేజా పరిస్థితిని చక్కదిద్దాడు. అయితే రహానేతో పాటు ఫామ్‌లో ఉన్న శివమ్ దూబే (3), సమీర్ రిజ్వీ (1)లను తక్కువ వ్యవధిలో అవుట్ చేసి లక్నో ఆధిక్యం ప్రదర్శించింది. ఈ సమయంలో కట్టుదిట్టమైన బౌలింగ్ కారణంగా చెన్నై బ్యాటర్లు పరుగులు చేయడంలో ఇబ్బంది పడ్డారు. ఒకదశలో వరుసగా 34 బంతుల పాటు బౌండరీనే రాలేదు! 16 ఓవర్లు ముగిసేసరికి స్కోరు 113/5. అయితే చివరి 4 ఓవర్లలో సూపర్ కింగ్స్ చెలరేగి 63 పరుగులు రాబట్టింది. మొహసిన్ ఓవర్లో సిక్సర్‌తో 34 బంతుల్లో జడేజా అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా... బిష్ణోయ్ వేసిన తర్వాతి ఓవర్లో అలీ వరుసగా 6, 6, 6 బాదడం విశేషం. అనంతరం 19వ ఓవర్లో 4, 6 కొట్టిన ధోని... ఆఖరి ఓవర్లో మరో 2 ఫోర్లు, సిక్స్‌తో చెలరేగాడు. ఏడో వికెట్‌కు ధోని, జడేజా 13 బంతుల్లో 35 పరుగులు జోడించారు.

శతక భాగస్వామ్యం...

ఛేదనను రాహుల్, డికాక్ ఘనంగా ఆరంభించారు. వీరిద్దరిని ఇబ్బంది పెట్టడంలో చెన్నై బౌలర్లంతా విఫలమయ్యారు. ఇద్దరూ ధాటిగా ఆడటంతో పవర్‌ప్లేలో 54 పరుగులు రాగా... 10.5 ఓవర్లు ముగిసేసరికి స్కోరు 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 100 పరుగులు దాటింది. 31 పరుగుల స్కోరు వద్ద డికాక్ ఇచ్చిన క్యాచ్‌ను పతిరణ వదిలేయగా, 31 బంతుల్లో రాహుల్ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత 41 బంతుల్లో డికాక్ కూడా హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. విజయానికి చేరువైన దశలో తక్కువ వ్యవధిలో వీరిద్దరు అవుటైనా... లక్ష్యం చేరేందుకు లక్నోకు ఇబ్బంది ఎదురు కాలేదు.

స్కోరు వివరాలు

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రహానే (బి) కృనాల్ 36; రచిన్ (బి) మొహసిన్ 0; రుతురాజ్ (సి) రాహుల్ (బి) యశ్ 17; జడేజా (నాటౌట్) 57; దూబే (సి) రాహుల్ (బి) స్టొయినిస్ 3; రిజ్వీ (స్టంప్డ్) రాహుల్ (బి) కృనాల్ 1; అలీ (సి) బదోని (బి) బిష్ణోయ్ 30; ధోని (నాటౌట్) 28; ఎక్స్‌ట్రాలు 4; మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు 176. వికెట్ల పతనం: 1–4, 2–33, 3–68, 4–87, 5–90, 6–141. బౌలింగ్: హెన్రీ 3–0–26–0, మొహసిన్ 4–0–37–1, యశ్ ఠాకూర్ 4–0–45–1, కృనాల్ పాండ్యా 3–0–16–2, రవి బిష్ణోయ్ 4–0–44–1, స్టొయినిస్ 2–0–7–1. లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: డికాక్ (సి) ధోని (బి) ముస్తఫిజుర్ 54; రాహుల్ (సి) జడేజా (బి) పతిరణ 82; పూరన్ (నాటౌట్) 23; స్టొయినిస్ (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు 13; మొత్తం (19 ఓవర్లలో 2 వికెట్లకు) 180. వికెట్ల పతనం: 1–134, 2–161. బౌలింగ్: దీపక్ చహర్ 3–0–26–0, తుషార్ 4–0–42–0, ముస్తఫిజుర్ 4–0–43–1, జడేజా 3–0–32–0, పతిరణ 4–0–29–1, అలీ 1–0–5–0.

ఐపీఎల్‌లో నేడు

ఢిల్లీ × హైదరాబాద్
వేదిక: న్యూఢిల్లీ
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	7	6	1	12	0.677
కోల్‌కతా	6	4	2	8	1.399
చెన్నై	7	4	3	8	0.529
హైదరాబాద్	6	4	2	8	0.502
లక్నో	7	4	3	8	0.123
ఢిల్లీ	7	3	4	6	-0.074
ముంబై	7	3	4	6	-0.133
గుజరాత్	7	3	4	6	-1.303
పంజాబ్	7	2	5	4	-0.251
బెంగళూరు	7	1	6	2	-1.185

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

సంయుక్తంగా అగ్రస్థానంలో గుకేశ్



టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నీ ఓపెన్ విభాగంలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ అద్భుత ప్రదర్శన కొనసాగుతోంది. తమిళనాడుకు చెందిన 17 ఏళ్ల గుకేశ్ 12వ రౌండ్ తర్వాత 7.5 పాయింట్లతో నకమురా (అమెరికా), నిపోమ్‌నిషి (రష్యా)లతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాడు. 12వ రౌండ్‌లో గుకేశ్ 57 ఎత్తుల్లో నిజాత్ అబసోవ్ (అజర్‌బైజాన్)ను ఓడించాడు. ఈ టోర్నీలో గుకేశ్‌కిది నాలుగో విజయం. భారత్‌కే చెందిన ప్రజ్ఞానంద, విదిత్‌లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. నిపోమ్‌నిషితో జరిగిన గేమ్‌ను తమిళనాడు కుర్రాడు ప్రజ్ఞానంద 55 ఎత్తుల్లో 'డ్రా' చేసుకోగా... మహారాష్ట్ర ప్లేయర్ విదిత్ 52 ఎత్తుల్లో కరువానా (అమెరికా) చేతిలో ఓడిపోయాడు. నిర్ణీత 14 రౌండ్‌లు ముగిశాక అత్యధిక పాయింట్లు సాధించిన ప్లేయర్ ప్రస్తుత ప్రపంచ చాంపియన్‌తో ప్రపంచ టైటిల్ కోసం పోటీపడతాడు. మరోవైపు మహిళల విభాగంలో భారత స్టార్ కోనేరు హంపి ఖాతాలో ఎనిమిదో 'డ్రా' చేరింది. గొర్యాచ్‌కినా (రష్యా)తో జరిగిన 12వ రౌండ్ గేమ్‌ను హంపి 25 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. ఉక్రెయిన్ గ్రాండ్‌మాస్టర్ అనా ముజిచుక్‌తో జరిగిన గేమ్‌ను భారత్‌కే చెందిన గ్రాండ్‌మాస్టర్ వైశాలి 57 ఎత్తుల్లో నెగ్గింది. హంపి 6 పాయింట్లతో నాలుగో స్థానంలో, వైశాలి 5.5 పాయింట్లతో ఆరో స్థానంలో ఉన్నారు.

భారత ఫ్రీస్టయిల్ రెజ్లర్లకు నిరాశ

ఒక్క విభాగంలోనూ లభించని ఒలింపిక్ బెర్త్



అమన్

బిష్కెక్ (కిర్గిస్తాన్): ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ రెజ్లింగ్ టోర్నీలో తొలి రోజు భారత పురుషుల ఫ్రీస్టయిల్ రెజ్లర్లకు నిరాశ ఎదురైంది. అందుబాటులో ఉన్న ఆరు వెయిట్ కేటగిరీల (57, 65, 74, 86, 97, 125 కేజీలు) నుంచి ఒక్క విభాగంలోనూ భారత రెజ్లర్‌కు ఒలింపిక్ బెర్త్ ఖరారు కాలేదు. ప్రతి వెయిట్ కేటగిరీలో ఫైనల్ చేరిన ఇద్దరికి ఒలింపిక్ బెర్త్‌లు లభిస్తాయి. 57 కేజీల విభాగంలో అమన్ సెహ్రావత్‌కు త్రుటిలో ఒలింపిక్ బెర్త్ చేజారింది. సెమీఫైనల్లో అమన్ 0–10తో గులోమ్‌జన్ అబ్దుల్లాయెవ్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో ఓడిపోయాడు. అంతకుముందు అమన్ తొలి రౌండ్‌లో 10–0తో యెరాసిల్ ముఖాతరూలీ (కజకిస్తాన్)పై, క్వార్టర్ ఫైనల్లో 11–1తో కిమ్ సంగ్‌వన్ (దక్షిణ కొరియా)పై గెలుపొందాడు. భారత ఇతర రెజ్లర్లు జైదీప్ (74 కేజీలు) క్వార్టర్ ఫైనల్లో... దీపక్ (97 కేజీలు) తొలి రౌండ్‌లో... సుమిత్ మలిక్ (125 కేజీలు) క్వార్టర్ ఫైనల్లో ఓటమి పాలయ్యారు.

దీపక్, సుజీత్ ఆలస్యంగా...



టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం బౌట్‌లో ఓడిపోయిన దీపక్ పూనియా (86 కేజీలు), సుజీత్ కలాకల్ (65 కేజీలు) ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీకి ఎంట్రీలు పంపించినా దురదృష్టం వారిని వెంటాడింది. రష్యాలో ఈనెల 2 నుంచి 15 వరకు శిక్షణ పొందిన దీపక్, సుజీత్ 16న దుబాయ్ మీదుగా కిర్గిస్తాన్ రాజధాని బిష్కెక్ చేరుకోవాలనుకున్నారు. అయితే దుబాయ్‌లో అనూహ్య వరదల కారణంగా వీరిద్దరు దుబాయ్ విమానాశ్రయంలో చిక్కుకుపోయారు. పలు విమానాలు రద్దు కావడం... మరికొన్ని ఆలస్యంగా నడవడంతో దీపక్, సుజీత్ శుక్రవారం తప్పనిసరిగా హాజరుకావాల్సిన వెయింగ్ కార్యక్రమానికి సమయానికి చేరుకోలేకపోయారు. దాంతో దీపక్, సుజీత్ ఈ టోర్నీలో బరిలోకి దిగలేకపోయారు. మే నెలలో టర్కీలో వరల్డ్ క్వాలిఫయింగ్ టోర్నీ రూపంలో భారత రెజ్లర్లకు పారిస్ బెర్త్‌లు సంపాదించే అవకాశం మిగిలి ఉంది. శనివారం మహిళల విభాగంలో పోటీలు జరుగుతాయి. వినేశ్ ఫొగాట్ (50 కేజీలు), అన్షు (57 కేజీలు), మాన్సి (62 కేజీలు), నిషా (68 కేజీలు), రీతిక (76 కేజీలు) బరిలో ఉన్నారు.

హైదరాబాద్-జల్గావ్‌కు విమాన సర్వీసు ప్రారంభం



జల్గావ్‌కు విమాన సర్వీసు ప్రారంభించిన ప్రతినిధులు

శంషాబాద్: హైదరాబాద్ నుంచి మహారాష్ట్రలోని జల్గావ్‌కు విమాన సర్వీసు శుక్రవారం ప్రారంభమైంది. ఈ మేరకు ఫ్లై-91 విమాన సర్వీసు ఇక్కడి నుంచి టేకాఫ్ తీసుకుని బయల్దేరింది. ప్రతి గురు, శనివారాల్లో ఈ సర్వీసు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుందని ఎయిర్‌లైన్స్ ప్రతినిధులు వెల్లడించాయి. దేశంలోని టైర్-2, 3 నగరాలకు విమాన సర్వీసులను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నట్లు వారు ప్రకటించారు.

వేసవికి 1,079 అదనపు ట్రిప్పుల రైలు సేవలు

సాక్షి, హైదరాబాద్: ఈ వేసవి కాలంలో అదనపు రద్దీని నియంత్రించేందుకు అదనపు రైళ్లతో 1,079 ట్రిప్పులు తిప్పుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఎక్కువ రద్దీ ఉండే ప్రధాన మార్గాల్లో వెయిటింగ్ లిస్టు అధికంగా ఉన్న సమయాల్లో ఎక్కువ ట్రిప్పులు తిప్పుతున్నట్లు తెలిపింది. దానాపూర్, గోరఖ్‌పూర్, కొచ్చువేలి, అగర్తల, సంత్రాగచ్చి, షాలిమార్, పట్నా, షిర్డీ, మధురై, కొల్లాం, కటక్, రక్సాల్ లాంటి ప్రాంతాలకు వివిధ స్టేషన్ల నుంచి ఎక్కువగా ట్రిప్పులు నడుపుతున్నట్లు వెల్లడించింది. రద్దీ ఎక్కువగా ఉండి, రెగ్యులర్ రైళ్లు నామమాత్రంగా ఉన్న దానాపూర్ వైపు 22 అన్ రిజర్వ్‌డ్ వారాంతపు సర్వీసులు తిప్పుతున్నట్లు తెలిపింది. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కూడా ప్రత్యేక ట్రిప్పులు నడపనున్నారు. హైదరాబాద్ నుంచి తిరుపతి, కాకినాడ, నర్సాపూర్, విశాఖపట్నంల మధ్య అదనపు సర్వీసులు వేసినట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా 9,111 అదనపు ట్రిప్పులు అందుబాటులో ఉంటున్నాయని, ఇది గత వేసవి కంటే 2,742 ట్రిప్పులు ఎక్కువ అని వెల్లడించింది. రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో స్టేషన్లలో తొక్కిసలాట జరగకుండా, వేసవి నేపథ్యంలో నిరంతరాయంగా చల్లటి తాగునీటిని అందించేందుకు అదనపు ఏర్పాట్లు చేసినట్లు తెలిపింది.

వైద్యారోగ్యశాఖలోని 16 వేలకుపైగా పోస్టుల గడువు పొడిగింపు

రాష్ట్ర ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ

సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్యశాఖలో వైద్య విద్యాసంచాలకుల పరిధిలోని 16,024 పోస్టుల గడువును రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి హరిత శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీఎంఈ పరిధిలోని 4,013 కాంట్రాక్ట్ ఉద్యోగాలు, 9,684 ఔట్ సోర్సింగ్ పోస్టులు, గౌరవ వేతనం కింద ఉన్న 2,322 ఉద్యోగాల గడువును వచ్చే ఏడాది మార్చి 31 వరకు పెంచుతూ ఉత్తర్వులిచ్చారు. ఇదిలా ఉండగా, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, గౌరవ వేతనం కింద ఉన్న పోస్టులకు ప్రతీ ఏడాదికి ఓసారి ప్రభుత్వం రెన్యువల్ చేయాల్సి ఉంటుంది. మార్చి 31కి ఆయా ఉద్యోగాలకు గడువు పూర్తవుతుంది. దీంతో తర్వాతి ఏడాదికి పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇస్తుంది. అయితే ఏప్రిల్ 1, 2 తేదీల్లో చేయాల్సిన రెన్యువల్‌ను ఏప్రిల్ 18వ తేదీకి చేశారు. దీని వలన జీతాలు ఆలస్యమవుతాయని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు.

టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో గ్రూప్-2 ఖాళీల సవరించిన పట్టిక

సాక్షి, హైదరాబాద్: వివిధ ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-2 ఉద్యోగ ఖాళీలకు సంబంధించి సవరించిన పట్టికను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. జీఓఎంఎస్ 3, రాష్ట్ర మహిళా శిశు, వికలాంగుల సంక్షే మ శాఖ ఈ ఏడాది ఫిబ్రవరి 10న జారీ చేసిన హారిజాంటల్ రిజర్వేషన్లకు అనుగుణంగా పోస్టులను మార్పు చేస్తూ మహిళా రిజర్వేషన్లు లేకుండా రూపొందించిన ఉద్యోగ ఖాళీల పట్టికను కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచిన ట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

పాలిటెక్నిక్ లెక్చరర్ ఉద్యోగాల జీఆర్ఎల్ విడుదల

సాంకేతిక విద్యాశాఖ పరిధిలోని పాలిటెక్నిక్ కాలేజీల్లో లెక్చరర్ ఉద్యోగాలకు సంబంధించి నిర్వహించిన అర్హత పరీక్షలో అభ్యర్థుల జనరల్ ర్యాంకింగ్ లిస్ట్‌ను విడుదల చేసినట్లు టీఎస్‌పీఎస్సీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ జాబితా కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంది. అర్హత సాధించి అభ్యర్థుల ప్రాథమిక జాబితాను త్వరలో విడుదల చేయనున్నట్లు వెల్లడించింది.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.